






# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




శ్రీ పొట్టిశ్రీరాములు

16 నెల్లూరు

బుధవారం 23 ఆగస్టు 2017


27న మళ్లీ విచారణకు రండి : ఎమ్మెల్యేలకు సూచన 8 / రూ.1200లకే కార్పొరేట్ వైద్యం 9









నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

క్రికెట్ బుకీలు ఎవరో తెలుసా?.. కృష్ణసింగ్‌తో పరిచయం ఉందా.. లేబూరు శ్రీధర్‌రెడ్డి (ఎల్ఎస్ఆర్) తో మీ వ్యాపారాలు ఏమిటి?.. కృష్ణసింగ్ ఎన్నికల ఫండ్ ఇచ్చాడా... కార్పొరేటర్ల గోవా క్యాంపునకు ఖర్చు కృష్ణసింగ్‌దేనా.. బెట్టింగ్‌లలో మీ ఆర్థిక లావాదేవీలు ఏమిటి.. గంటల పాటు కృష్ణసింగ్‌తో ఫోన్‌లో ఏం మాట్లాడారు..??

..జిల్లా ఎస్పీ కార్యాలయంలో మూడున్నర గంటల పాటు సాగిన వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌ల విచారణలో పోలీసులు వారిపై కురిపించిన ప్రశ్నల వర్షమిది. క్రికెట్ బెట్టింగ్ కేసులకు సంబంధించి మరింత సమాచారం సేకరించేందుకు 160 సెక్షన్ కింద నోటీసులు అందుకున్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కోటంరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయానికి రాగా, మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే అనిల్ వచ్చారు. మొదట మూడు గంటల పాటు కోటంరెడ్డిని.. ఆ తరువాత ఒకటిన్నర గంటపాటు అనిల్‌ను విచారించి స్టేట్‌మెంట్స్ రికార్డు చేశారు. ఈ సందర్భంగా బెట్టింగ్‌లలో తమ పాత్రపై క్రికెట్ బుకీలు ఇచ్చిన స్టేట్‌మెంట్లు చూపాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. ఏఎస్పీ శరత్‌బాబు సారథ్యంలో ఈ విచారణ సాగింది. విచారణ అనంతరం ఎమ్మెల్యేలను అరెస్టు చేస్తారని ప్రచారం అలాంటిదేమీ జరగలేదు. అయితే మరింత సమాచారం కోసం ఈనెల 27న తదుపరి విచారణ నిర్వహిస్తామని, ఆ రోజు మరోసారి హాజరు కావాలని అధికారులు ఎమ్మెల్యేలకు సూచించారు. దీంతో ఆరోజున మరోసారి ఇదే వేళల్లో వీరిద్దరు తదుపరి విచారణకు హాజరు కానున్నారు.



## కృష్ణసింగ్ తెలుసా...

# అతనితో మీ అనుబంధమేంటి?

- కార్పొరేటర్ల గోవా క్యాంపు ఖర్చు ఆయనదేనా!?
- ఎల్ఎస్ఆర్‌తో మీ వ్యాపారాలు ఏమిటి?
- మూడున్నర గంటల పాటు ప్రశ్నల పరంపర
- ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు సమక్షంలో విచారణ



ఈ నెల 27న మలివిడత విచారణ

- కృష్ణసింగ్‌తో అనుబంధంపైనే ప్రధాన దృష్టి
- మా పాత్రపై నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్ చూపాలని కోరిన ఎమ్మెల్యేలు
- అవసరమైతే చూపుతామన్న అధికారులు

- వివరాలు 8లో

విచారణకు వెళుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి






ఆంధ్రాబ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

## సంస్కరణలపై బ్యాంకర్ల సమ్మె

- రోడ్డెక్కి నినదించిన ఉద్యోగులు 7
- 600 శాఖల మూత.. ఆగిన 50 కోట్ల లావాదేవీలు

వెలిగొండ అడవుల్లో

## పేకాట కేంద్రాలు!

- జూదరులకు స్వర్గధామం 7
- రోజుకు రూ.లక్షల్లో పందేలు

## కన్నబిడ్డపై అఘాయిత్యం

- మేనకూరులో తండ్రే కాటేశాడు!
- 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి
- గర్భిణిగా నిర్ధారించిన వైద్యులు
- ముదివర్తిపాళెంలో మరో ఘటన
- ప్రేమపేరుతో యువకుడి వంచన
- పోలీసులకు ఫిర్యాదు.. అరెస్టు



ఎన్ని చట్టాలు వచ్చినా ఆడబిడ్డపై అఘాయిత్యాలు తగ్గడంలేదు. వెన్నంటి ఉండి బిడ్డకు రక్షణ కల్పించాల్సిన తండ్రే కాటేస్తే... ఎవరికి చెప్పుకోవాలి... ఎలా చెప్పాలి... కడుపులో దాచుకున్న రహస్యం... కడుపు నొప్పితో ఆసుపత్రికి వెళితే బయట పడింది. నాయుడుపేట మండలం మేనకూరులో 13 ఏళ్ల బాలికపై తండ్రే లైంగిక దాడికి ఆల్పడ్డాడు. అలాగే ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెంలో ప్రేమపేరుతో ఓ యువకుడు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 6

నిరుపయోగ బోరుబావులు

## వారం రోజుల్లో పూడ్చాలి

ఏవైనా సంఘటనలు జరిగితే అధికారులదే బాధ్యత : డ్వామా పీడీ హరిత 3



### పెద్దశేషవాహనంపై వెంకయ్య వైభోగం

గొలగమూడిలో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం అశ్వవాహనంపై, రాత్రి పెద్దశేష వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. 16

# 27న వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

**నెల్లూరు(క్యాంపస్):** జిల్లా వ్యాయామ విద్య, ఉపాధ్యాయ, పాఠశాల విద్య సహాయకుల అసోసియేషన్ సంఘ సభ్యుల వార్షిక సమావేశం ఈనెల 27వ తేదీ ఎన్‌జీవో హోంలో జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, సనత్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గ ఎంపిక, వ్యాయామ విద్యా విషయాల గురించి సంఘ సభ్యులకు అవగాహన కల్పించడంపై చర్చిస్తామన్నారు.



# నిరుపయోగమైన బోర్లు పూడ్చండి

- **డ్వామా పీడీ హరిత**

**నెల్లూరు(వేదాయపాళెం):** జిల్లాలో నిరుపయోగంగా ఉన్న బోరు బావులను వారం రోజుల్లో పూడ్చేలా తహసీల్దారు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ హరిత తెలిపారు. బోరుబావుల తవ్వకాలకు సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయాలని పేర్కొన్నారు. బోరుబావులు తవ్వుకునే వారు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని, ఇష్టానుసారంగా తవ్వరాదని తెలిపారు. జిల్లాలో మండలాల వారీగా జాబితా సేకరించాలని తెలిపారు. నిరుపయోగంలో ఉన్న బోరు బావులు పూర్తిగా పూడ్చినట్లు భూగర్భ జల శాఖ అధికారులతో ధ్రువీకరణ పత్రాన్ని వారంలోపు డ్వామా కార్యాలయానికి, జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని పేర్కొన్నారు. బోరు బావుల తవ్వకాలు, వాటి పూడ్చివేత తదితర విషయాలపై ప్రజలకు మండల స్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బోరు బావులు తవ్వే డ్రిల్లింగ్ ఏజన్సీలు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకుని ప్రజా భద్రతను పరిగణలోకి తీసుకుకోవాలన్నారు, అలా తీసుకోనీ ఏజన్సీలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని పేర్కొన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా నిరుపయోగంలో ఉన్న బోరుబావుల కారణంగా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లదే బాధ్యత అని పేర్కొన్నారు. అధికారులకు సమాచారం ఇవ్వడంలో ప్రజా ప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలు అందిచాలనీ కోరారు.

# సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తాం

- **నేడు టౌన్‌హాలులో సమావేశం**
- **రేషన్ డీలర్ల సంఘ నాయకులు**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సిద్దు వెంకటసుబ్బారెడ్డి

**నెల్లూరు (హరనాథపురం):** రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దు వెంకటసుబ్బారెడ్డి చెప్పారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమాల కోసం బుధవారం టౌన్‌హాల్లో అసోసియేషన్ జిల్లా సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునగా గిరిజారావు ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేషన్ షాపుల నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించి, గౌరవవేతనం, లేదా పీడీఎస్ ఉద్యోగులుగా డీలర్లను గుర్తించి జీవనభృతి కల్పించాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ సమావేశానికి డీలర్లంతా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మునగా గిరిజారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బీ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# పర్వతారోహకుడికి సన్మానం



సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

**బుచ్చిరెడ్డిపాళెం:** పెద్దూరు లోని గోపాలకృష్ణయ్య ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో మంగళవారం కిలిమంజారో పర్వతారోహితుడు కోరికల వెంకట సూర్యప్రకాష్‌కు ఘన సన్మానం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పర్వతాలు అధిరోహించాలన్నారు. అనంతరం సూర్యప్రకాష్ మాట్లాడుతూ మల్లి మస్తాన్‌బాబును స్ఫూర్తిగా తీసుకొని భారత దేశ కీర్తి ప్రతిష్ఠలు ప్రపంచ దేశాలకు వ్యాపించేలా పర్వతా రోహణ చేయడమే లక్ష్యమన్నారు. కృషి, పటుదలతోపాటు ప్రజల ఆశీస్సులతో కిలి మంజారో పర్వతారోహణ చేశానన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, దేవా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనార్టీ యువత శిక్షణకు
# దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు (వేదాయపాళెం):** ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వివిధ కోర్సులలో ఉచిత శిక్షణకు జిల్లాలో ఉన్న నిరుద్యోగ మైనార్టీ యువత ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ కార్పొరేషన్ ఈడీ కే నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ పాఠశాలలో డీజల్ మెకానిక్, ట్రైనింగ్ సెంటర్‌లో లైట్, హెవీ వెహికల్ డ్రైవింగ్ 25 రోజుల నుంచి 4 నెలల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అంతేకాక సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ విజయవాడలో వివిధ మెకానికల్ కోర్సులలో శిక్షణ ఇస్తారని తెలిపారు. 18-33 సంవత్సరాల వయస్సు గల మైనార్టీ నిరుద్యోగ యువత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎంఎఫ్‌సీ.కామ్ అను వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9849901154 నెంబరును సంప్రదించాలని కోరారు.

# జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న తహసీల్దార్

**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థి శ్రీపతి దినకరశ్రీరామ్ జైపూర్‌లో జరిగే కుంగ్‌ఫూ, కరాటే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. నవంబర్‌లో జరిగే ఈ పోటీలకు శ్రీరామ్ హాజరు కానున్నాడు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రవీంద్రబాబు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఇబ్రహీం, స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
4
కావలి టౌన్
బుధవారం, 23 ఆగస్టు 2017
కావలి । కావలిటౌన్ । కావలి రూరల్

## పారిశుధ్య పరిశీలనలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు

**కావలి:** కావలి మూద్దూరుపాడులోని ఒకటో వార్డులో మంగళవారం మున్సిపల్ శానిటేషన్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు చేవూరి చిన్న షేక్ ఖాదర్‌బాష, ఎం మాలకొండారెడ్డి పర్యటించారు. వార్డులోని సమస్యలు, పారిశుధ్య పరిరక్షణ తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. అరుంధతీయపాలెంలో చెత్త కుండీల ఏర్పాటు, తాగునీటి బావి వద్ద వసతులు మెరుగుపరచాలని, ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న పెద్ద కాలువ నుంచి వర్షాకాలం నీరు ఇళ్లల్లోకి వస్తోందని ప్రజలు వారికి తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక కౌన్సిలర్ పులి రజని దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

## క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి

**కావలి:** కావలి ముసునూరు గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడా స్థలాన్ని అభివృద్ధి చేయాలని ఆ పాఠశాల విద్యార్థినులు జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి జ్యోత్స్నకు విన్నవించారు. మంగళవారం జ్యోత్స్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల కోరిక మేరకు క్రీడా మైదానాన్ని పరిశీలించి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

**కావలి:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ముస్లిం మైనారిటీ తదితర కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ ఏ. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 8వ వార్డులోని షాదీ మంజిల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి కావలి పురపాలక సంఘం నుంచి 2017-18 సంవత్సరానికి ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలని, అభ్యర్థులు అసలు ధ్రువీకరణలను వెంట తేవాలని ఆయన పేర్కొన్నారు.

**జలదంకి:** వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు జరపనున్నట్లు జలదంకి ఎంపీడీవో రవీంద్ర తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగుతాయన్నారు. ఉదయం బోగోలు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, జలదంకి, చింతలపాలెం ఆంధ్రప్రగతిగ్రామీణ బ్యాంకుల పరిధిలోని గ్రామాల అభ్యర్థులకు, మధ్యాహ్నం జలదంకి ఆంధ్ర బ్యాంకు, కావలి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్రాహ్మణక్రాక ఆంధ్రప్రగతిగ్రామీణ బ్యాంకుల పరిధిలోని గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఈ ఇంటర్వ్యూలకు బ్యాంకు మేనేజర్లు హాజరవుతారన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్దులు ఇంటర్వ్యూలకు ధ్రువీకరణలతో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## వ్యాసరచన పోటీలు

**కావలి:** కావలి పాతూరు పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు స్వచ్ఛభారత్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మ తులసీ, ఎన్‌సీసీ ఆఫీసర్ మస్తాన్‌వలి, ఆర్మీ స్టాఫ్, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

## ఇంగ్లీషు క్లబ్ ఏర్పాటు

**కావలి:** కావలి నారాయణ పాఠశాలలో మంగళవారం ఇంగ్లీషు క్లబ్ ఏర్పాటు చేశారు. నారాయణ సంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, ఎజీఎం భాస్కర్‌రెడ్డి, డీన్ ప్రసాద్ క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమ నిర్వాహకుడు సాదిక్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఈ క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ వై శ్రీకాంత్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావ పాల్గొన్నారు.

# గణేశ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

• చివరి దశలో విగ్రహాల అలంకరణ • ఆకర్షణీయంగా తాత్కాలిక మంటపాలు • సందడి చేస్తున్న యువత


కావలిలో తయారవుతున్న భారీ సెట్టింగ్


కొండాపురంలో కొలువుదీరిన గణేశ విగ్రహాలు

**కావలిటౌన్:** కావలి కలుగోళమ్మపేట మానససెంటర్‌లో ఏటా భారీ ఎత్తున నిర్వహించే గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది కూడ ఆదే స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లలో భాగంగా 40 రోజుల ముందు నుంచే శిల్పులు 60 అడుగుల భారీ విగ్రహాన్ని అదే ప్రాంతంలో తయారు చేశారు. వైవిధ్యబరితమైనసెట్టింగ్‌లు ఈ ఉత్సవాల్లో ఆకర్షణగా నిలవనున్నాయి. వర్షాలకు తడవకుండా ఉత్సవాలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఈ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. మలిశెట్టి మాట్లాడుతూ ఈ నెల 25న సరస్వతి పూజతో గణేష్ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, 29 గ్రామోత్సవం, నిమర్జన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

**పోలీసు అనుమతి తప్పనిసరి**

**దగదర్తి:** మండలంలోని వినాయక చవితి సందర్భంగా అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసినా, మైక్‌లు పెట్టినా, అసాంఘిక కార్యకలాపాలు, అశ్లీల నృత్యాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విజయ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేయదలిచిన వారు పూర్తి వివరాలతో నియమ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి తీసుకునే విగ్రహాల వద్ద ఎటువంటి వివాదాలు జరిగినా ఉత్సవ కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

**కొండాపురం:** మండలంలో వినాయకచవితి సందడి మొదలయ్యింది. కొండాపురంలో విగ్రహాలు అమ్మకానికి సిద్దంగా ఉంచారు. మండలంలో సమారు 56 గ్రామాలుండగా ప్రతి గ్రామంలోనూ ఒకటినుండి ఐదు వరకు విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ సారి విగ్రహాల సంఖ్య తగ్గవచ్చు. విగ్రహాల ధర రెట్టింపవడంతో కొనుగోలుకు భక్తులు వెనకడుగు వేస్తున్నారు.

## సిబ్బంది సమ్మెతో మూతబడిన బ్యాంకులు


ధర్నా చేస్తున్న ఎస్బీఐ ఉద్యోగులు

**కావలిటౌన్:** యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ కావలి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ధర్నా నిర్వహించారు. ఫోరం కన్వీనర్ ఎ. హరినారపరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ, విలీనం, నష్టాల్లో ఉన్న శాఖలు బ్రాంచీల మూసివేత, నిరరక్షక ఆస్తులు రైటాఫ్‌ను వ్యతిరేకిస్తు బ్యాంకు ఉద్యోగులందరు సమ్మె నిర్వహించామన్నారు. ఉద్దేశపూర్వక ఎగవేతలను క్రిమినల్ నేరంగా ప్రకటించక పోవడం, రికవరీ పార్లమెంటరీ కమిటీ సూచనలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. బ్యాంకులు బోర్డు బ్యూరోని ప్రభుత్వం రద్దు చేయాలని, మొండి బకాయిల వసూళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీఎన్ కుమార్, ఎల్ఐసీ, ఆర్టీసీ, సీఐటీయూ, పోస్టల్ ఉద్యోగులు సంఘీభావం ప్రకటించారు. నారాయణ స్వామి, ప్రకాష్‌రావు, సుబ్బరామిరెడ్డి, పవన్‌కుమార్, నాగలక్ష్మీ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రొయ్యల గుంతలు వద్దని రైతుల ఆందోళన


పనులు నిలిపివేయిస్తున్న వీఆర్‌వో గోవర్ధన్

**అల్లూరు:** తమ భూమి ఉన్న ప్రాంతంలో రొయ్యల గుంతలు ఏర్పాటు చేస్తున్నారని వాటిని నిలిపేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని సింగపేట రెవెన్యూకు చెందిన సర్వే నెంబర్ 49/1, 49/2లలో 90 ఎకరాల భూమి సీజేఎఫ్ఎస్ ద్వారా రైతులకు అందజేసిందని వాటి అనుభవదారులు స్వలాభం కోసం నెల్లూరుకు చెందిన కొంత మందికి లీజులకు ఇచ్చారని వారన్నారు. ఈ భూమిలో రొయ్యల గుంటలను ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారని ఇదే జరిగితే అందులో నుంచి వచ్చే వ్యర్థాలు సమీపంలోని ప్రధాన కాలువలోకి వదులుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి నుంచి ఉప్పు నీటిని పంపింగ్ చేసి రొయ్యలసాగును చేపట్టి కాలువలో వదులట ద్వారా ఈ కాలువ ఆయకట్టు పరిధిలో ఉండే దాదాపు 2000 ఎకరాలు పంట భూమి బీడుగా మారే అవకాశం ప్రమాదం ఉందని రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. స్పందించిన వీఆర్‌వో గోవర్ధన్ ఉడ్‌హౌస్ పేట నుంచి తిప్పకు వెళ్ళే మార్గంలోని భూమిలో చేపడుతున్న పనులను ఆపి ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ అమీద్ భూమిని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, ఆదెయ్య, వెంకటరమణారెడ్డితో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## పేదలందరికి శ్రీవారి దివ్యదర్శనం

**కావలిరూరల్:** రాష్ట్రంలోని పేద ప్రజలందరికి ఉచితంగా శ్రీవారి దివ్యదర్శనం కల్పిస్తామని దేవాదాయశాఖ జిల్లా సహాయక కమిషనర్ ఏగూరి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. కావలి కలుగోళమ్మ ఆలయం నుంచి మంగళవారం ఉదయం 150 మంది భక్తులతో రెండు ఆర్టీసీ బస్సులను జిల్లా సహాయక కమిషనర్ ఏగూరి రవీంద్రారెడ్డి, తహసీల్దార్ కృష్ణారావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ హిందువుల్లోని పేదలందరికి శ్రీవారి దర్శనం చేయించాలనే లక్ష్యంతో దేవాదాయ శాఖ ఉచితంగా మూడు రోజుల పాటు తిరుమల, తిరుచానూరు, ఒంటిమిట్ట, శ్రీశైలం, నర్రవాడల యాత్ర ప్రారంభించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల్లోని పేదలను గుర్తించి ఈ అవకాశాన్ని కల్పిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో కలుగోళమ్మ ఆలయ ధర్మకర్త మురళీధర్, రమణారెడ్డి, సురేంద్రరెడ్డి, సారంగపాణి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## 'అమరా'ను సత్కరించిన మున్సిపల్ అధికారులు


సత్కారం అందుకుంటున్న అమరా సుబ్బరావు

**కావలిటౌన్:** ఆల్ ఇండియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయిన అమరా సుబ్బారావును మంగళవారం కావలి మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. మున్సిపల్ ఆర్ఐ సుబ్బారావు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాలువాలు, పూలమాలలతో సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది యుగంధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మహేష్, వెంకటరామిరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ సన్నిబోయిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీలకు గుర్తింపు హర్షణీయం

**కావలిటౌన్:** 40 ఏళ్లుగా ఆర్‌ఎంపీలు గుర్తింపు కోసం పోరాటం చేస్తున్న ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని సీఎం చంద్రబాబు ఆర్‌ఎంపీలను గుర్తిస్తు జీవో విడుదల చేయడం హర్షణీయమని ఆర్‌ఎంపీడబ్ల్యూఏ డివిజన్ అధ్యక్షుడు తెలికేపల్లి శేషయ్య తెలిపారు. మంగళవారం క్రిస్ట్రియన్ పేటలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల మందికి పైగా ఆర్‌ఎంపీలు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆర్‌ఎంపీలకు ఒక ఏడాది పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించి వైద్యం చేసేందుకు అనుమతించడం శుభపరిణామమన్నారు.

ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రఫీ, నారాయణ, ప్రవీణ్‌కుమార్, శ్రావణాచార్యులు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్య నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**కావలి:** విద్యార్థులు వృత్తి విద్య నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కావలి ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి. రాజ్‌కుమార్ చౌదరి పేర్కొన్నారు. ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచాలన్న ఉద్దేశ్యంతో నైపుణ్యాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఆర్ లోకనాథం, అసిస్టెంట్ మేనేజర్ వినీల్ కుమార్, ట్రైనర్లు ప్రదీప్‌కుమార్, శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

# రికార్డులు తారుమారు

- రెవెన్యూ సిబ్బంది నిర్వాకం
- గల్లంతయిన వాటిపై విచారణ కరువు
- అయోమయంలో భూయజమానులు

**బోగోలు తహసీల్దార్ కార్యాలయంలో భూ సంబంధించిన దస్త్రాలు గల్లంతు, తారుమారు కావడంతో భూయాజమానులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యమని వారంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు చేతివాటం ప్రదర్శించి కబ్జాకోరులతో ఒప్పందం కుదుర్చుకుని ఈ పాపానికి ఒడిగట్టారన్న ఆరోపణలున్నాయి. దస్త్రాల తారుమారుపై తరచూ కథనాలు వెలువడుతున్నా స్పందించేవారు కరువయ్యారు. 1977 నాటి భూమి వివరాలు సక్రమంగా ఉన్న దస్త్రాల తారుమారు విషయమై రెవెన్యూ అధికారులు నిగ్గుతేల్చాల్సిందిపోయి బాధితులను కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పుకుంటున్నారు.**

**- బిట్రగుంట**


బోగోలు తహసీల్దారు కార్యాలయం

బోగోలు మండలం బోగోలు మేజర్ పంచాయతీలో 1977లో దేవిరెడ్డి వెంకారెడ్డి, రాఘవరెడ్డిలు బత్తుల రంగారెడ్డి కుమారులు సుబ్బారెడ్డి, గోపాలరెడ్డి, రమణారెడ్డి నుంచి మెతుకు వెంకయ్య కొనుగోలు చేసిన భూమి విక్రయించకుండానే దస్త్రాలు తారుమరైన వివాదం నేటికి కొనసాగుతోంది.

సర్వే నెం.3లో 12ఎకరాల 9సెంట్లు భూమిని బత్తులవారి కుమారుల నుంచి మెతుకు వెంకయ్య కొనుగోలు చేశాడు. 1985 జూలై 4న అతని పెద్దకుమారుడు రవీంద్రబాబుకు ఆ భూమిని రిజిస్టర్ చేశాడు. 2003న సర్వే నెం.3కు చెందిన 12ఎకరాల 9 సెంట్లకు పట్టా పాసుపుస్తకం రెవెన్యూ మంజూరు చేశారు. అదే భూమి మరోవ్యక్తి పేరుతో 2012లో రికార్డులోకి ఎక్కింది. దీంతో ఆ భూమికి సంబంధించిన వివాదం మొదలైంది. ఈ విషయంపై జిల్లా అధికారులను కలవడం, ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్‌లో ప్రవేశ పెట్టడం జరిగినప్పటికి ఇంత వరకు ఎవరినీ విచారించింది లేదు.

**దస్త్రాలు గల్లంతు**

ఉమామహేశ్వరపురం పంచాయతీకి సంభందించిన రెవెన్యూ దస్త్రాలన్నీ కార్యాలయంలో కనిపించక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 1987లో పేరం సుధాకర్‌రెడ్డి తూపిరి నరసయ్య, కాటం సుబ్బారెడ్డిల నుంచి 5.46 ఎకరాలు కొనుగోలు చేసి పాసుపుస్తకాలను పొందాడు. 2014లో అతని భార్య కృష్ణవేణికి ఆ భూమిని రిజిస్టర్ చేసినప్పటికి ఇంతవరకు 1-బి. పాసుపుస్తకం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాడు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ డెగ్లాట్స్ కనపడకపోవడంతో పాసుపుస్తకం మంజూరు చేయడం కష్టమవుతోందంటున్నారు.

**విచారణ కరువు**

ఉమామహేశ్వరపురంకు చెందిన రెవెన్యూ రికార్డుతోపాటు మరికొన్ని రికార్డులు గల్లంతైనట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయంపై అప్పటి తహసీల్దారును వివరణ కోరితే విషయాన్ని దాటవేశాడు. గల్లంతైన రికార్డులలోని రైతులకు న్యాయం జరగక కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయారు. జిల్లా అధికారులు సైతం స్పందించక పోవడంతో అసలు భూయజమానులు అవస్థలు పడుతున్నారు.

**ఇంటి దొంగలు ఎవరు?**

1975-76 నాటి రికార్డులలో కొన్ని ముఖ్యమైన పేజీలు కానరాకపోవడం, అదే రికార్డులలో కొత్తపేర్లు చేరడం జరిగినా ఈ మార్పులు, చేర్పులు చేసింది ఎవరు అన్న విషయమై ఇంతవరకు అధికారులు ఆరాతీసిన దాఖలాలు లేవు. ఈ రికార్డుల మార్పు వెనుక భారీగా నగదు చేతులు మారిందన్న ఆరోపణలున్నాయి. ఎస్వీ పాలెం సంచాయతీలో సర్వే నెంబర్ 181లోని 65 ఎకరాలు ఉమ్మడిగా 1982లో నాగూరి సుబ్బమ్మ తిరువల్లి అశ్వర్థనారాయణ నుంచి కొనుగోలు చేసిన భూమిని 2013 వరకు ఉమ్మడిగా సాగు చేసుకుంటూ ఎవరి భాగాలు వారు పంచుకోగా 2014లో కొందరు పాస్ పుస్తకాలు పొందిన భాస్కరుని వెంకటసుబ్బమ్మ పొలంపై మరొకరికి పాస్‌పుస్తకాలు మంజూరు, రికార్డులు తారుమారు చేయటంతో ఆ వివాదం నేటికి కొనసాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రికార్డుల తారుమారు, గల్లంతు బాధ్యులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

**ఉన్నతాధికారులు విచారించాలి**



రెవెన్యూ కార్యాలయాల్లో గల్లంతైన దస్త్రాలపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులు కఠినంగా శిక్షించాలి. బాధిత రైతులను ఆదుకోవాలి.

**- ముంతాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ**

**పక్కాగా జరుగుతున్న అవినీతి**



భూమికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారులు దగ్గర ఉన్నాయి. అయినా విచారించరు. దీంతో పక్కాగా అవినీతికి పాల్పడ్డారని భావించాల్సి వస్తోంది.

**- మెతుకు రాజేశ్వరి**

**పాస్ పుస్తకాలు ఇవ్వరు**



రిజిస్ట్రేషన్ చేయించుకొని మూడేళ్లవుతోంది. కార్యాలయంలో డైగ్లాండ్స్ కనబడడంలేదని పాస్‌పుస్తకాలు ఇవ్వలేకున్నామంటున్నారు. ఎవరో చేసిన తప్పుకు మేం అవస్థ పడుతున్నాం.

**- పేరం సుధాకర్‌రెడ్డి**

## భూసార పరీక్ష పత్రాల పంపిణీ


భూసార పత్రాలతో అన్నదాతలు

**దగదర్తి:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్ష పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమి ఏ మేరకు సారవంతమైందో తెలియడంతో పాటు భూమిలో ఏయే ఏయే ఖనిజాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకోవచ్చని, ఆ లోపాలు సరిచేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఆయన తెలిపారు. భూసారానికి అనువైన ఎరువులు వాడితే రైతులకు పుష్కలంగా పంటలు పండడంతో పాటు ఖర్చు కూడ తగ్గుతుందన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, పాల్, తదితరులు పాల్గొన్నారు.

## క్రాకుటూరులో 'పొలం పిలుస్తోంది'

**కలిగిరి:** మండలంలోని క్రాకుటూరు పంచాయతీలో వ్యవసాయాధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వ లైసెన్సు పొందిన వ్యాపారస్తుల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసినపుడు బిల్లులు తప్పక తీసుకోవాలని, పంటకాలం పూర్తయి దిగుబడులు వచ్చేవరకు బిల్లులు, రసీదులు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. పంట సాగులో మెళకువలను వ్యవసాయశాఖాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తారన్నారు. వీలైనంత వరకూ రైతులు రసాయనిక ఎరువులకు దూరంగా ఉండాలన్నారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి ఎం శ్రీవాణి, విస్తరణాధికారి చిరంజీవి, ఎంపీఈవోలు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

## దివ్యాంగుల ఇంటికే ఆర్టీసీ బస్ పాసులు

**కలిగిరి:** ఆర్టీసీ రాయితీ బస్ పాసులను మండల కేంద్రాల్లో దివ్యాంగులకు ఇంటివద్దనే ఇస్తారని సేవాసంఘ జిల్లా ప్రధాన సలహాదారు సయ్యద్ ఘనీబాష పేర్కొన్నారు. మండలంలోని వెలగపాడులో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కావలి డివిజన్ పరిధిలోని వికలాంగుల సౌకర్యార్థం ఆర్టీసీ డీఎం సుష్మప్రతి ఈ నెల 23న దగదర్తి, 24న కొండాపురం, 25న కావలి, 26న కలిగిరి, 27న బోగోలు, 28న జలదంకి మండలాల్లో రాయితీ బస్ పాస్‌లను అర్హులైన వారికి అందిస్తారన్నారు.. వికలాంగులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, అందనివారు తగిన ధ్రువీకరణలు ఇస్తే సేవా సంస్థ తరపున వారు లబ్ధిపొందేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల మండల అధ్యక్షురాలు గర్రె ప్రమీల, తురిమెర్ల కృష్ణమూర్తి, షేక్ కాలేబు, జీ శ్రీనివాసులు, ఎస్కే ఖాజామియా పాల్గొన్నారు.

**దగదర్తి:** మండలంలోని దివ్యాంగులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీ పొందేలా పాస్‌లు ఇవ్వనున్నట్లు వికలాంగుల సంఘం నాయకుడు టీసీ మాల్యాద్రినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో బుధవారం ఏపీఎస్‌ఆర్టీసీ కావలి డిపో అధికారుల సహకారంతో దగదర్తిలోని పంచాయతీ కార్యాలయ ఆవరణంలో వికలాంగులందరికి రాయితీపై పాస్‌లు మంజూరు చేస్తారన్నారు. వికలాంగులందరు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డును తీసుకుని మంజూరు కేంద్రానికి రావాలన్నారు.

## చెన్నూరులో కంటి వైద్యశిబిరం

**దగదర్తి:** మండలంలోని చెన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం బీఎంఆర్ చారిటబుల్ ట్రస్టు, మోడరన్ ఐ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పెన్నాడెల్టా వైస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ప్రారంభించారు. అనంతరం 324 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 109 మంది కంటి అద్దాలకు ఎంపిక కాగ 43 మందిని శస్త్రచికిత్స నిమిత్తం నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రికి తరలించారు. 109 కంటి అద్దాలకు ఎంపిక అయిన వారికి త్వరలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భార్గవ్, రజని, సర్పంచ్ వేముల బుజ్జమ్మ, స్థానిక టీడీపీ నాయకులు, అనీల్, కుమార్‌తో పాటు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్టు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి సంస్థ ప్రతినిధులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మిలియన్ మార్చ్ గోడపత్రిక ఆవిష్కరణ

**కలిగిరి:** సెప్టెంబరు ఒకటిన సీపీఎస్ ఎంప్లాయ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ సంబంధించిన గోడపత్రికను మంగళవారం స్థానిక సీపీఎస్ ఎంప్లాయిమెంట్ సభ్యులు జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మిలియన్ మార్చ్ కార్యక్రమంలో ప్రతి సీఎస్‌పీ ఉద్యోగి పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస దీక్షితులు, విజయ్‌కుమార్, ఫిరోజ్, ఖాజ అహమ్మద్, బాలనాగేశ్వరరావు,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలి

**బిట్రగుంట:** మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరికి అందేలా సక్రమంగా నిర్వహించాలని మండల టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పీ హరిబాబు అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వహణను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు సరిపడినంత నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద పౌష్టిక విలువలతో కూడిని ఆహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో జిల్లా తెలుగునాడు సమైఖ్య ఆదేశాల మేరకు పథక పరిశీలన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, మోహన్‌కుమార్, రఫీ, వంశీ, బాలుర బాలికల ప్రధానోపాధ్యాయులు, చెంచు లక్ష్మీ బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కన్నతండ్రే కాటేశాడు!

**● 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి ● ఆసుపత్రిలో నిర్ధారించిన వైద్యులు**

**ఓజిలి/నాయుడుపేట :** తల్లి జన్మనిస్తే.. తండ్రి వెన్నంటి ఉండి జీవిత పాఠాలు నేర్పిస్తాడు. అలాంటి వ్యక్తే కామాంధుడిగా మారాడు. తల్లిలేని 13 ఏళ్ల చిన్నారికి అన్నీ తానై ఉండాల్సిన నాన్నే ఆ బిడ్డనే కాటేస్తే... ఎవరికి చెప్పుకోవాలి... ఎలా చెప్పాలి... కడుపులో దాచుకున్న రహస్యం... కడుపునొప్పితో ఆసుపత్రికి వెళితే బయటపడింది. వివరాల్లోకి వెళితే.. నాయుడుపేట మండలం మేనకూరు గిరిజన కాలనీకి చెందిన వ్యక్తితో ఓజిలి మండలం ఏనుగువాడకు చెందిన యువతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. కొన్నాళ్లు వీరి సంసారం సాఫీగా సాగింది. ఆ తర్వాత తాగుడుకు బానిస అయిన ఆ వ్యక్తి నిత్యం భార్యను వేధించేవాడు. ఈ నేపథ్యంలో ఎనిమిదేళ్ల క్రితం ఆ ఇల్లాలు భర్తను వదిలించుకుని పుట్టినిల్లు అయిన ఏనుగువాడకు వచ్చేసింది. వీరికి కలిగిన బాలిక మాత్రం మేనకూరులోని తండ్రి వద్దనే పెరుగుతోంది. ఇటీవల ఏనుగువాడలోని తల్లి వద్దకు వచ్చిన బాలిక కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో సాధారణ మాత్రలతో సరిపుచ్చింది. మంగళవారం భరించలేని కడుపునొప్పి రావడంతో ఆ తల్లి తన కుమార్తెను సమీపంలోని వజ్జావారిపాళెం ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చింది. అక్కడ వైద్యులు అనుమానంతో పరీక్షలు చేసి గర్భవతిగా నిర్ధారించారు. తల్లితోపాటు వైద్య సిబ్బంది ప్రశ్నించడంతో తన తండ్రి చేసిన నిర్వాకాన్ని బాలిక వారితో చెప్పింది. ఈ మేరకు సమాచారం అందుకున్న నాయుడుపేట ప్రోగ్రాం అధికారిణి రమాదేవి వజ్జావారిపాళెం నుంచి బాలికను ఓజిలి ఎమ్పీడీవో కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఎమ్పీడీవో నారాయణతో మాట్లాడి సీడీపీవో అధికారులకు బాలికను అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు.



# ప్రేమ పేరుతో..

**బాలికపై యువకుడి లైంగిక దాడి**

**ఫోక్సాయాక్టులో నిందితుడి అరెస్టు**

**నెల్లూరు (క్రైం) :** ఓ బాలికకు ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడటంతో బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును అట్రాసిటీ సెల్-2కు బదలాయించడంతో నిందితుడిపై ఫోక్సాయాక్ట్‌కింద కేసు నమోదు చేసిన డీఎస్పీ సుధాకర్ దర్యాప్తు చేపట్టి మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేఖరులకు కేసు వివరాలను వెల్లడించారు. ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాలెం గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. అదే గ్రామానికి చెందిన చమంది సుధీర్ అనే యువకుడు బాలిక వెంటపడి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మబలికాడు. ఆ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. 2016 మే నెలలో ఆ బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె సుధీర్‌తో ప్రేమలో పడిన విషయం తెలుసుకుని బాలికకు వేరే వివాహం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. దీంతో సుధీర్ ఆ బాలికను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం వారి ఆచూకీ కనుగుని వారిని గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామ పెద్దలతో చర్చించి ఇద్దరికీ వివాహం చేసేందుకు నిశ్చయించారు. సుధీర్ పెళ్లి చేసుకుంటానని గ్రామస్థుల ముందు అంగీకరించాడు. అనంతరం పెళ్లి విషయం ప్రస్తావించగా తప్పించుకు తిరగసాగాడు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు నిలదీయగా బాలికను కలం పేరుతో ధూషించి వివాహం విషయం ప్రస్తావిస్తే అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో బాలిక తన తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 2న ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును ఎస్సీ ఎస్టీ సెల్-2కు బదలాయించారు. వాస్తవాలు నిర్ధారణ కావడంతో మంగళవారం నిందితుడిని మైపాడుగేటు వద్ద అరెస్టు చేశారు. ఈ కేసును త్వరతగతిన పూర్తి చేయడంలో కృషి చేసిన ఏఎస్ఐ నాయబ్‌రసూల్, హెచ్‌సీ శ్రీనివాసలు, పీసీలు వై శ్రీనివాసులు, యు.చక్రవర్తి, ఎస్‌కే రసూల్‌ను ఆయన అధినందించారు.

## చిట్టమూరులో బెట్టింగ్ రాయుళ్లు?

**● జాబితా సిద్ధం చేస్తున్న పోలీసులు**

**చిట్టమూరు :** జిల్లాలో సంచలనం రేపిన క్రికెట్ బుకీల సెగ మండలానికి తాకింది. క్రికెట్ బెట్టింగ్, బుకీల వ్యవహారంలో చిట్టమూరు మండలంలో కొందరి పేర్లు పోలీస్ రికార్డుల్లో ఉన్నట్లు తెలిసింది. మండలంలోని కొంతమంది పేర్లతో జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా జిల్లాని కుదిపేస్తున్న బెట్టింగ్ వ్యవహారంపై పోలీసులు లోతుగా విచారణ సాగిస్తున్నారు. అయితే పట్టణాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాల్లో చాపకింద నీరులా క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌లు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. చిట్టమూరు మండలంలోని ఆరూరు, మల్లాం పలు ప్రాంతాల్లో కొందరు పేర్లు ఉన్నట్లు పుకార్లు వస్తున్నాయి. కాగా పోలీసులు మాత్రం తమకేమి సమాచారం రాలేదని అంటున్నారు.

## క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఐ కరిముల్లా

**నెల్లూరు (క్రైం):** క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఆరుగురిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కథనం మేరకు.. కరేబియన్ ఐపీఎల్ క్రికెట్‌మ్యాచ్ సందర్భంగా మూలాపేటలోని గొల్ల వీధిలో ఓ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందని ఒకటో పట్టణ ఎస్ కరిముల్లాకు సమాచారం అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ బెట్టింగ్ ఆడుతున్న బ్రాహ్మణ వీధికి చెందిన ప్రకాష్‌బాబు, డైకస్‌రోడ్డుకు చెందిన సయ్యద్‌ముజాహిద్, రొట్టెలవీధికి చెందిన అల్తాఫ్, కొండదిబ్బకు చెందిన రంగస్వామి సుబ్రహ్మణ్యం, పెద్దబజారుకు చెందిన జొరిగి చంద్రశేఖర్, సయ్యద్ సుల్తాన్‌అహ్మద్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక టీవీ, ఐదు సెల్‌ఫోన్‌లు, రూ.7,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గేమింగ్‌యాక్ట్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

**నెల్లూరు (క్రైం):** ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. 70 ఏళ్ల వృద్ధుడు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హెచ్‌సీ జోసఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఆధారాలేమీ లభ్యం కాలేదు. మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు.

## బాలికపై లైంగికదాడి : నిందితుడి అరెస్టు

**నెల్లూరు (క్రైం):** ఓ బాలికకు ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడడంతో బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును అట్రాసిటీ సెల్-2కు బదలాయించడంతో నిందితుడిపై ఫోక్సాయాక్ట్‌కింద కేసు నమోదు చేసిన డీఎస్పీ సుధాకర్ దర్యాప్తు చేపట్టి మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేఖరులకు కేసు వివరాలను వెల్లడించారు. ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాలెం గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. అదే గ్రామానికి చెందిన చమంది సుధీర్ అనే యువకుడు బాలిక వెంటపడి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మబలికాడు. ఆ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. 2016 మే నెలలో ఆ బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె సుధీర్‌తో ప్రేమలో పడిన విషయం తెలుసుకుని బాలికకు వేరే వివాహం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. దీంతో సుధీర్ ఆ బాలికను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం వారి ఆచూకీ కనుగుని వారిని గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామ పెద్దలతో చర్చించి ఇద్దరికీ వివాహం చేసేందుకు నిశ్చయించారు. సుధీర్ పెళ్లి చేసుకుంటానని గ్రామస్థుల ముందు అంగీకరించాడు. అనంతరం పెళ్లి విషయం ప్రస్తావించగా తప్పించుకు తిరుగసాగాడు. దీంతో ఆ బాలిక



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్

తల్లిదండ్రులు నిలదీయగా బాలికను కలం పేరుతో దూషించి వివాహం విషయం ప్రస్తావిస్తే అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో బాలిక తన తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 2వ తేదీన ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును ఎస్సీ ఎస్టీ సెల్-2కు బదలాయించారు. కేసు దర్యాప్తు చేపట్టిన డీఎస్పీ వాస్తవాలు నిర్ధారణ కావడంతో మంగళవారం నిందితుడిని మైపాడుగేటు వద్ద అరెస్టు చేశారు. ఈ కేసును త్వరతగతిన పూర్తి చేయడంలో కృషి చేసిన ఏఎస్ఐ నాయబ్‌రసూల్, హెచ్‌సీ శ్రీనివాసలు, పీసీలు వై శ్రీనివాసులు, యు.చక్రవర్తి, ఎస్‌కే రసూల్‌ను ఆయన అధినందించారు.

## లక్ష్మీ ఆశాజ్యోతి హత్యకేసులో నిందితుల అరెస్టు

**● డబ్బు కోసమే దారుణం**

**వెంకటగిరి(టౌన్):** ఈ నెల 8న పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో పట్టపగలు జరిగిన మహిళ దారుణ హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితులను ప్రవేశపెట్టి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తొట్టంబేడు మండలం చౌడవరం గ్రామానికి చెందిన ఎల్లసిరి అశోక్‌కు, స్థానిక ఎన్టీఆర్ కాలనీలో నివసిస్తున్న లక్ష్మీ ఆశాజ్యోతి(35)కు పరిచయం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో అశోక్ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా లక్ష్మిని డబ్బులు అడిగేందుకు చౌడవరం గ్రామానికి చెందిన పెంచలయ్య, ఓజిలి సురేష్‌లతో కలిసి బైకుపై వెంకటగిరికి ఈ నెల 8న వచ్చారు. లక్ష్మీ ఇంటికి వెళ్లి అశోక్ డబ్బులు అడుగగా లక్ష్మీ ఇవ్వలేదన్నారు. దీంతో ఆమెపై ఆగ్రహించి వారు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి హత్య చేశారు. లక్ష్మీ ఒంటిపై ఉన్న నాలుగున్నర సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. ఆభరణాలను శ్రీకాళహస్తిలోని ఓ కుదువ వ్యాపారి వద్ద కుదవ పెట్టి వచ్చిన నగదుతో కుమారుడి పుట్టిన రోజును జరుపుకున్నారు. పోలీసులు హత్యకేసును ఛేదించేందుకు సంఘటనా స్థలంలో దొరికిన మొబైల్ ఫోన్‌లోని నంబర్ల గురించి ఆరా తీయగా, తరచూ సంభాషించిన పలు నంబర్లపై నిఘా ఉంచి ప్రధాన నిందితుడైన అశోక్‌ను, పెంచలయ్యను వల్లిపేడు క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా మరో నిందితుడైన సురేష్‌ను శ్రీకాళహస్తి సమీపంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి దొంగలించిన ఆభరణాలను, బైకును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కొండపనాయుడు, సిబ్బంది వెంకటేశ్వర్లురాజు, రఫీ, శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు దుకాణంపై దాడి.. మద్యం సీసాల స్వాధీనం

**కొండాపురం:** మండల పరిధిలోని సాయిపేట, కొమ్మి పంచాయతీలో మద్యం బెల్టు దుకాణాలపై నెల్లూరు ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడిచేశారు. గ్రామాలలో మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో నెల్లూరు నుంచి ప్రత్యేక బృందం వచ్చి దాడిచేసి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదుచేసి వింజమూరు ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించి కోర్టుకు హాజరుపరుస్తామని వారు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్‌టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన బాలింత మృతి

**• వైద్యం అందలేదంటున్న భర్త**

**• అభాగ్యురాలైన చిన్నారి**



తల్లిని కోల్పోయిన చిన్నారి



సునీల (ఫైల్)

**నాయుడుపేట రూరల్ :** సకాలంలో సరైన వైద్యం అందక తన భార్య మృతి చెందిందని భర్త శ్రీనివాసులు విలపిస్తున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఆయన మంగళవారం ఆంధ్రజ్యోతి వద్ద వాపోయాడు. నాయుడుపేట మండలం పుదూరు పంచాయతీ గొర్రపల్లిగుంట గ్రామానికి చెందిన సునీల (20) గర్భందాల్చినాటి నుంచి సకాలంలో వైద్యపరీక్షలు చేయించామని, జూలై 11వ తేదీ నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రసవించినట్లు తెలిపారు. సునీల ప్రసవించిన మూడోరోజు స్వగ్రామానికి వెళ్లినప్పటి నుంచి తరచూ జ్వరంతో బాధపడుతూ ఉండేదని వాపోయాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం కనిపించలేదన్నాడు. దీంతో ఆగస్టు 16న నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి సునీలను తీసుకెళ్లగా పరిస్థితి విషమించిందని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు చెప్పారన్నాడు. నెల్లూరులోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్సలు అందిస్తుండగా 19వ తేదీ మృతి చెందిందన్నాడు. ప్రసవ సమయాలలో నిర్లక్ష్యం వల్లే భార్య మృతి చెందిందని శ్రీనివాసులు విలపించాడు.

## సీనియర్ సహాయకురాలి సస్పెన్షన్

**నెల్లూరు(కలెక్టరేట్):** కలిగిరి తహసీలాద్ర్ కార్యాలయం సీనియర్ సహాయకురాలు డి.జ్యోతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జ్యోతి వింజమూరు రెవెన్యూ ఇనస్పెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వటంలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు రుజువు కావటంతో సస్పెండ్ చేశారు.

# తప్పుడు నివేదికలు ఇస్తే చర్యలు

● ప్రత్యామ్నాయ పంటలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయండి ● వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల సమీక్షలో కలెక్టర్

**నెల్లూరు(కలెక్టరేట్):** సాయిల్ హెల్త్ కార్డుల విషయంలో తప్పుడు నివేదికలు ఇచ్చే వ్యవసాయశాఖ ఏడీలపై చర్యలు తీసుకొంటామని కలెక్టర్ ముత్యాలరాజు హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఆయన చాంబర్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను నూటికి నూరుశాతం పంపిణీ చేయాలన్నారు. పంపిణీ చేయకుండా తప్పుడు నివేదికలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరులేనందున రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయలన్నారు. విత్తనాల పంపిణీ సక్రమంగా చేయాలన్నారు. సీజేఎఫ్‌ఎస్ ల్యాండ్స్‌లో ఎవరైతే పొజీషన్‌లో ఉంటారో వారికి లోన్ ఎలిజిబుల్ కార్డులు పంపిణీ చేయాలని చెప్పారు. రైతులచే క్రాప్ ఇన్సూరెన్స్ తప్పని సరిగా చేయించాలన్నారు. జిల్లాలో సెప్టెంబరులో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వేసే పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు.



ఉద్యానవన అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

### ● కమిటీల పనితీరు మెరుగు పరచుకోవాలి

జిల్లాలో మార్కెట్ కమిటీల పనితీరు మెరుగు పరచుకోవాలని అన్నారు. మార్కెట్ ఫీజు వసూళ్లు సక్రమంగా చేయాలన్నారు. రైతు బంధు పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ వెంకటసుబ్బారెడ్డి, అగ్రికల్చర్ జేడీ చంద్రా నాయక్, మార్కెటింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ● రిజిస్ట్రేషన్‌లు నమోదు చేయాలి

ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్‌లు సంబంధిత శాఖ ద్వారా పొందిన కరెంటు బిల్లు ఆధారంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ లోని ఆయన చాంబర్‌లో మత్స్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాన్ రిలీఫ్, లావాదేవీలు జరపని బ్యాంకు ఖాతాల సవిషయంలో తిరిగి లావాదేవీలు జరిపే లా ఏయే చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో అకౌంట్లలో జమ అవుతున్నాదా లేదా వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈసమావేశంలో మత్స్యశాఖ జేడీ సాల్మన్‌రాజు, ఏడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ● నెలాఖరులోగా రిజిస్ట్రేషన్‌లు

ఉద్యానవనశాఖ ద్వారా చేయాల్సిన రైతుల రిజిస్ట్రేషన్‌లను డిసెంబరు నెలాఖరు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రైతుల రిజిస్ట్రేషన్‌లు నమోదు చేయాలన్నారు. పరిపాలనానుమతులు, బయోమెట్రిక్ తదితర విషయాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రమణరావు, డీఆర్‌డీఏ పీడీ లావణ్యవేణి, ఉద్యానవన శాఖ ఏడీ ఉమాదేవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత అభినందనీయం

● సీపీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సిరాజ్

**నెల్లూరు(వైద్యం):** గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం అభినందనీయమని కమ్యునిటీ పారామెడిక్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సిరాజ్ అన్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. 40 ఏళ్లుగా గ్రామీణ వైద్యులకు గుర్తింపు, చట్టబద్ధత లేక జీవనాధరం కష్టంగా మారిందన్నారు. ఈ పరిస్థితిల్లో గ్రామీణ వైద్యుల అలుపెరుగని పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వీరిని గుర్తించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆరోగ్యశాఖామంత్రి కామినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, రాయపాటి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ పరంగా చట్టపరమైన హక్కులు కల్పించేందుకు అంగీకరించారన్నారు. ఆరు నెలల పాటు కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ, మూడు నెలల పాటు 104 వాహనంలో, వైద్య కళాశాలలో శిక్షణ అనంతరం రాత పరీక్ష ద్వారా గుర్తింపు పత్రాలను ప్రభుత్వం అందచేస్తుందన్నారు. ప్రభుత్వ జీవోను తీసుకువచ్చేందుకు సీపీడబ్ల్యూఏ చైర్మన్ నాదెండ్ల కిషోర్‌కుమార్, నాంచరయ్య, ఫెడరేషన్ అధ్యక్షుడు రాజాసిద్ధార్థ, కార్యదర్శి గణపతి, స్వచ్ఛంద మిషన్ వైస్ చైర్మన్ వెంకట్రావ్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నారాయణ, డాక్టర్ మల్లికార్జున, గురువారెడ్డి, బాలకృష్ణ, ఆరీఫ్, చాంద్‌బాషా, హరిప్రసాద్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సిరాజ్

## వెలిగొండ అడవుల్లో పేకాట కేంద్రాలు!

● సత్ఫలితాలివ్వని దాడులు

**ఉదయగిరి రూరల్:** వెలుగొండ అడవి జూదరులకు స్వర్గధామంగా మారింది. నిర్వాహకులు పకడ్బందీగా కేంద్రాలు నిర్వహిస్తుండడంతో ఇతర జిల్లాల నుంచి పలువురు జూదమాడడానికి ప్రతిరోజూ వాహనాల్లో ఇక్కడికి చేరుకుంటున్నారు. ఈ కేంద్రాల్లో రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం

ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లో వెలుగొండ అడవులు విస్తరించాయి. ఆయా మండలాలు ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలకు సరిహద్దు ప్రాంతాలుగా ఉండడం, కేంద్రాల నిర్వాహకులకు అనుకూలంగా మారింది. జూద కేంద్రం ఎక్కడ నిర్వహిస్తున్నదీ నిర్వాహకులు ముందుగానే ఫోన్ ద్వారా జూదరులకు సమాచారం చేరవేస్తున్నారు. దీంతో వారు ఆ స్థావరం వద్దకు చేరుకుని ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు పేకాటలో నిమగ్నమవుతారు. స్థావరానికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో కొందరు కాపలాదారులను నియమించుకుని పోలీసు దాడుల నుంచి తప్పించుకునేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు

### సత్ఫలితాలివ్వని దాడులు

పోలీసులు ఈ స్థావరాలపై తరచూ దాడులు నిర్వహించి, పదుల సంఖ్యలో జూదరులను, లక్షల్లో నగదు స్వాధీనం చేసుకుంటున్నా వారు జంకడంలేదు. కింది స్థాయి సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి జూద కేంద్రాల సమాచారం తెలిసినా, నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటూ, వివరాలు ఉన్నతాధికారులకు తెలియచేయడంలేదనే విమర్శలున్నాయి. ఒకవేళ ఉన్నతాధికారులకు తెలిసి, వారు దాడులకు సిద్ధమవుతుండగానే, నిర్వాహకులు ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## బ్యాంకర్ల సమ్మె విజయవంతం

● ఆగిన 50 కోట్ల లావాదేవీలు
● 600 శాఖల మూత



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌కుమార్

**నెల్లూరు(సాంస్కృతికం):** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యుఎఫ్‌బీయూ)పిలుపు మేరకు ఆల్ ఇండియా బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా జిల్లాలో మంగళవారం చేపట్టిన బ్యాంకర్ల సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెతో 25 జాతీయ బ్యాంకులు, 4 ప్రైవేటు బ్యాంకులకు సంబంధించి సుమారు 600 శాఖలు మూత పడ్డాయి. దీనితో జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 కోట్లకు పైగా లావాదేవీలు స్తంభించాయి. అన్ని కేడర్ల అధికారులు, సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నగరంలోని అన్ని జాతీయ, 4 ప్రైవేటు బ్యాంకుల సిబ్బంది బృందావనంలోని ఆంధ్రాబ్యాంకు మెయిన్ బ్రాంచి వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఈ ధర్నాలో ఆల్ ఇండియా బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగుల వ్యతిరేక వైఖరిని ప్రజాస్వామ్య రంగాలన్నీ ఖండించాలన్నారు. ఉద్యోగులకు వ్యతిరేకంగా చేపడుతున్న సంస్కరణలను తిప్పి కొట్టాలని కోరారు. ఉద్దేశపూర్వకంగా బ్యాంకు రుణాలను ఎగవేసిన బడాబాబులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఎస్‌సీబీఈఏ ప్రాంతీయ కార్యదర్శి టి.శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న వర్క్‌మెన్ డైరెక్టర్ల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఏఐబీఓసీ సిండికేట్ బ్యాంకు కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ కార్యాలయాల్లో మితిమీరిన పనిభారం ఉందని, దీంతో ఒత్తిడికి గురై అధికారులు తప్పులు చేస్తున్నారని, అది వారి ఉద్యోగాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఏఐబీఓఏ ఆంధ్రా బ్యాంకు కార్యదర్శి రఘురాం కుమార్ మాట్లాడుతూ 11వ వేతన సవరణను త్వరితగతిన పూర్తి చేసి బ్యాంకు ఉద్యోగులకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి అంకయ్య, భాస్కర్‌రెడ్డి, ఆనందరామ్‌సింగ్, నాగభూషణం, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, సుహాన్ పాల్గొన్నారు.

## 55 ఏళ్ల గ్రామీణ వైద్యుల పోరాటం ఫలించింది

● స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షుడు ఈవీఎస్ నాయుడు

**నెల్లూరు (వైద్యం):** ది ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 55 ఏళ్లుగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని స్వచ్ఛంద సంస్థల జిల్లా అధ్యక్షుడు ఈవీఎస్ నాయుడు తెలిపారు. పీఎంపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పీఎంపీల సదస్సులో ఆయన మాట్లాడుతూ 1962లో డాక్టర్ భరద్వాజ్ ఢిల్లీలో పీఎంపీ అసోసియేషన్ స్థాపించి 2012లో స్వర్ణోత్సవాలు కూడా జరుపుకున్నారన్నారు. ప్రభుత్వ గుర్తింపు కోసం ఇతర గ్రామీణ సంఘాలతో కలిసి ఈ నెల 21వ తేదీన వెలగపూడిలోని సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావును, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సమస్యను తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ కొనసాగించేందుకు అంగీకరించారన్నారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంత వరకు 12వేల మంది గ్రామీణ వైద్యులకు కమ్యూనిటీ పారామెడిక్స్‌గా ప్రభుత్వం శిక్షణ ఇచ్చిందన్నారు. వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా నాయకులు శేషయ్య, వీరయ్య, ప్రసాద్, శ్రీనివాసులు, భార్గవ్ హెల్త్‌ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఈవీఎస్ నాయుడు




విచారణ కోసం ఎస్పీ కార్యాలయానికి వెళుతున్న ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, అనిల్

### ఈనెల 27న మరోసారి విచారణ

మంగళవారం వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, అనిల్‌లను విచారించిన పోలీసులు మరో సారి విచారించాలని నిర్ణయించారు. ఈనెల 27న 11 గంటలకు కోటంరెడ్డి, మధ్యాహ్నం 12 గంటలకు అనిల్ విచారణలకు హాజరు కావాలని ఏఎస్పీ శరత్‌బాబు కోరారు. ఆ రోజు విచారణ నిర్వహించి మరికొంత సమాచారాన్ని రాబడుతామని ఆయన వెల్లడించారు. ఈ విచారణలో ఏఎస్పీ శరత్‌బాబు, డీఎస్పీలు బాలసుందరరావు, రాఘవరెడ్డి, సీఐలు మంగారావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యేల విచారణను పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సాధారణ రోజుల కన్నా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన గేట్లు వద్దే వాహనాలు ఆపేసి ఎమ్మెల్యేలకు మాత్రమే ప్రవేశం కల్పించారు. మీడియాను గేటు దాటనీయలేదు. పోలీసు కార్యాలయం ఎదుట మీడియా హడావుడి ఉదయం నుంచే మొదలైంది. విచారణ తరువాత ఎమ్మెల్యేలను అరెస్టు చేస్తారన్న ప్రచారంతో వైసీపీ నేతల్లో ఉత్కంఠ కొనసాగింది. ప్రస్తుతానికి తొలి విచారణతోనే ముగింపు పలికి ఈనెల 27న జరిగే రెండో విచారణలో మరింతగా ప్రశ్నల పరంపర సాగించనున్నారు. ఆ రోజు పరిస్థితిని బట్టి ఎమ్మెల్యేల అరెస్టులు ఉండొచ్చని భావిస్తున్నారు.

# కృష్ణసింగ్ తెలుసా.. అతనితో మీ అనుబంధమేంటి?

- కార్పొరేటర్ల గోవా క్యాంపు ఖర్చు కృష్ణసింగ్‌దేనా?
- మూడున్నర గంటల పాటు ప్రశ్నల పరంపర
- ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు సమక్షంలో విచారణ
- కృష్ణసింగ్‌తో అనుబంధంపైనే ప్రధాన దృష్టి
- 27న మరోసారి విచారణకు పిలుపు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లాలో సంచలనం సృష్టించిన క్రికెట్ బెట్టింగ్‌ల కేసులో ఎమ్మెల్యేల పాత్రపై పలు ఆధారాలు సేకరించిన పోలీసులు నేరుగా ఎమ్మెల్యేలను విచారించాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం విచారణకు హాజరు కావాలని నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేశారు. ఉదయం 11 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డిని విచారణ జరుపుతామని ప్రకటించడంతో ఆయన జిల్లా పోలీసు కార్యాలయానికి 11 గంటలకు చేరుకున్నారు. ఏఎస్పీ శరత్‌బాబు సారథ్యంలో జరిగిన ఈ విచారణలో ఎన్నో ప్రశ్నలు సంధించారు. ప్రతి ప్రశ్నకు సమాధానం రాబట్టి వివరాలు నమోదు చేశారు. ఇలా మధ్యాహ్నం 2 గంటల వరకు విచారణ కొనసాగింది. క్రికెట్ బుకీలు ఇచ్చిన సమాచారంతోపాటు స్టేట్‌మెంట్లలో తమ పాత్ర ఉందని చూపాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. దీనికి పోలీసులు బుకీలు, పంటర్లు, బెట్టింగ్ రాయుళ్ల నుంచి సేకరించిన సమాచారం మేరకే ఈ విచారణ జరుపుతున్నామని అవసరమైనప్పుడు అన్నీ అందిస్తామని పేర్కొన్నారు. ఇక సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ 12 గంటలకే జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చినా, అప్పటికీ కోటంరెడ్డి విచారణ జరుగుతుండడంతో వేచిచూస్తూ ఉండిపోయారు. 2 గంటలకు కోటంరెడ్డి విచారణ ముగిశాక అనిల్‌ను విచారణకు ఆహ్వానించి పలు ప్రశ్నలు సంధించారు. ఒకటిన్నర గంట పాటు అనిల్‌ను విచారించిన తరువాత ఆయన ఇచ్చిన సమాధానాలన్నింటిని స్టేట్‌మెంట్‌గా రూపొందించి సంతకాలు తీసుకుని పంపేశారు.

### కోటంరెడ్డికి ప్రశ్నల పరంపర

మీ పేరేంటి.. మీ తండ్రి, భార్య పేరు ఏమిటి? ఎక్కడ కాపురం ఉంటారు.. అంటూ సాధారణ ప్రశ్నలతో కోటంరెడ్డి విచారణను ప్రారంభించారు. ఆ తరువాత అసలు ప్రశ్నల్లోకి దిగారు. క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధాలు ఉన్నాయా, క్రికెట్ బుకీలు తెలుసా.. కృష్ణసింగ్‌తో పరిచయం ఉందా.. అన్న ప్రశ్నలకు క్రికెట్ బెట్టింగ్‌లతో తనకు సంబంధాలు లేవని, బుకీలు ఎవరో తెలియదని కోటంరెడ్డి సమాధానం ఇచ్చారు. కృష్ణసింగ్‌తో మాత్రం కొద్దిపాటి పరిచయం ఉందని ఒప్పుకున్నారు. ఎల్‌ఎస్‌ఆర్ తెలుసా అన్న ప్రశ్నకు బాల్య స్నేహితుడని, బంధువు కూడా అవుతాడని కోటంరెడ్డి చెప్పారు. 2014లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లతో గోవాలో క్యాంపు నిర్వహించిన సందర్భంలో అయిన ఖర్చును కృష్ణసింగే భరించినట్టు సమాచారం ఉందని పోలీసులు అడిగిన ప్రశ్నకు మేయర్ అబ్దుల్ అజీజే ఆ ఖర్చులు భరించినట్టు పక్కా సమాచారం ఉందని కోటంరెడ్డి బదులిచ్చారు. అబ్దుల్ అజీజ్ పారిశ్రామికవేత్త అని కృష్ణసింగ్ నుంచి నగదు ఆశించే పరిస్థితి లేదని, దీనిపై ఏదైనా ఉంటే అజీజ్‌నే అడగాలని చెప్పారు. కృష్ణసింగ్‌తో మీకు ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ప్రశ్నకు అలాంటి ఏమీ లేదని తన బ్యాంకు ఖాతాలు, తన కుటుంబ సభ్యుల ఖాతాలన్నీ చూసుకోవచ్చునని, అవసరమైతే ఆ ఖాతాల వివరాలన్నీ ఇస్తానని అన్నారు. కృష్ణసింగ్‌తో తరచూ గంటల తరబడి ఫోన్‌లో ఏం మాట్లాడుతారో చెప్పాలని కోరగా, ముందే చెప్పాను కృష్ణసింగ్‌తో పరిచయం ఉంది.. మూడు లేదా నాలుగు సార్లు మాత్రం ఫోన్‌లో మాట్లాడిన మాట వాస్తవమే. అది టీవీలు, పత్రికల్లో వచ్చే కథనాలపై స్పందించి అన్నా... మీ స్టేట్‌మెంట్లు బాగున్నాయని కృష్ణసింగ్ ప్రశంసిస్తూ మాట్లాడడమే తప్ప మరే విధమైన సంభాషణలు లేవన్నారు. అది కూడా నిముషం లోపు సంభాషణలు తప్ప గంటల తరబడి కాదని, కావాలంటే కాల్ లిస్ట్ చెక్ చేసుకోవచ్చున్నారు. ఎల్‌ఎస్‌ఆర్, రూప్‌కుమార్ యాదవ్ ద్వారా నగదు ముట్టిందన్న ప్రశ్నకు అదంతా ఒట్టి అపోహేనని బ్యాంకు ఖాతాలు చూసుకోవచ్చునని చెప్పారు. ఎల్‌ఎస్‌ఆర్ ఆఫీస్‌కు ఎవరెవరు వస్తారు... అక్కడ ఏం జరుగుతుందన్న మరో ప్రశ్నకు.. ఆ ఆఫీసుకు మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, విజయా డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి, వైవీ రామిరెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు వస్తుంటారని, వారిలో ఒక్కడిగా తాను వెళుతుంటానన్నారు. బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిపై ప్రశ్నలకు తనకు ఆయన ముఖ్య అనుచరుడేనని ఆ తరువాత సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కూడా అత్యంత ముఖ్యుడని గత ఎన్నికల్లో కాకాణి గెలుపుకు ఎంతో కృషిచేసి పని చేశాడని చెప్పారు. ఇలా రెండు గంటల పాటు ప్రశ్నల పరంపర కొనసాగింది. ఈ సందర్భంగా కోటంరెడ్డి పోలీసులను ఓ ప్రశ్న వేశారు. ఇన్ని అడుగుతున్నారు.. సమాధానాలు చెబుతున్నా.. వీటికి ఆధారాలు ఏమిటి.. ఏ నిందితుడు మీకు సమాచారం ఇచ్చాడో ఆ స్టేట్‌మెంట్లు నాకు చూపాలని డిమాండ్ చేశారు. అవసరం వచ్చినప్పుడు ఆ వివరాలు కూడా చూపుతామని ప్రస్తుతానికి ఈ ప్రశ్నలకు మీరిచ్చిన సమాధానాల స్టేట్‌మెంట్లలో సంతకాలు చేయాలని పోలీసులు కోరారు.



ఆ.. వారడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలిచ్చేశా : విచారణ ముగిసిన తర్వాత కోటంరెడ్డి



హమ్మయ్య విచారణ ముగిసింది!

## కృష్ణసింగ్ ఎన్నికల ఫండ్ ఇచ్చాడా?

### అనిల్‌పై ప్రశ్నల వర్షం

కోటంరెడ్డిని అడిగినట్లే ఎమ్మెల్యే అనిల్‌ను కూడా తొలుత వ్యక్తిగత సమాచారం అడిగి వివరాలు నమోదు చేసుకున్న తర్వాత అసలు ప్రశ్నలు కొనసాగాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో కృష్ణసింగ్ ఎన్నికల ఫండ్ ఇచ్చాడా అన్న ప్రశ్నకు అనిల్ సమాధానం ఇస్తూ నాకు తెలిసి ఎవరి వద్ద రూపాయి కూడా తీసుకోలేదు.. ఎవరైనా మూడో వ్యక్తికి ఇచ్చినట్లు రుజువు చేస్తే ఆ వ్యక్తిని కూర్చోబెట్టి మాట్లాడితే నిజాలు బయటకు వస్తాయని అనిల్ సమాధాన మిచ్చారు. ఎల్‌ఎస్‌ఆర్ ఆఫీసుకు వెళుతుంటారా అన్న ప్రశ్నకు ఎల్‌ఎస్‌ఆర్ అనే వ్యక్తి పరిచయం ఉన్న మాట వాస్తవమే. అయితే ఆయన ఆఫీసుకు నేను వెళ్లిన సందర్భం లేదు. సోదరుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్కడ ఉన్నప్పుడు వెళ్లి వాహనంలో ఎక్కించుకుని వచ్చానే తప్ప ఆఫీసులోకి వెళ్లలేదని సమాధానం వచ్చింది. కృష్ణసింగ్ తెలుసా అన్న ప్రశ్నకు...నగర ఎమ్మెల్యేగా ఎన్నో కార్యక్రమాలకు వెళుతుంటాం.. వాటిల్లో కనిపిస్తే కృష్ణసింగ్‌తో మాట్లాడి ఉండవచ్చు. వ్యక్తిగత సంబంధాలైతే లేవు. నా తొమ్మిదేళ్ల రాజకీయ జీవితంలో ఏ నాడుకు కూడా కృష్ణసింగ్‌కు ఫోన్ చేసి మాట్లాడింది లేదని అనిల్ సమాధానమిచ్చారు. బెట్టింగ్‌ల ఆర్థిక లావాదేవీలపై అడిగిన ప్రశ్నకు తాను రాజకీయాల్లోకి వచ్చి రూ. 30 కోట్ల ఆస్తులు అమ్ముకుని ఇప్పటికి రూ. 2 కోట్లు బ్యాంకులకు అప్పు పడ్డానని, ఎవరి దగ్గరైనా సరే ఒక లక్ష తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేని అనిల్ వివరణ ఇచ్చారు. మరికొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టిన పోలీసులు ఇవన్నీ స్టేట్‌మెంట్లు రికార్డు చేసి ఆయన సంతకాలు తీసుకుని పంపేశారు.

### ఇది రాజకీయ ప్రత్యర్థుల కుట్ర

నెల్లూరు జిల్లా నుంచి క్రికెట్ బెట్టింగ్‌లను తరిమికొట్టేందుకు నేను ముందుంటాను. ఎస్పీ మూడు సార్లు ఎమ్మెల్యేల ప్రమేయం లేదని, చెప్పిన తరువాత నోటీసులు పంపించడం చూస్తుంటే ప్రభుత్వ పెద్దల పాత్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది. రాజకీయ ప్రత్యర్థులను ఇలా ఇబ్బంది పెట్టాలనుకుంటే ప్రజాపోరాటాలు, ప్రజా ఉద్యమాలు సాగిస్తాం. ఈ ప్రభుత్వంపై పూర్తిగా అనుమానం ఉంది. రాజకీయంగానే పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి విచారణలు సాగించి ఏదో చేయాలని చూస్తున్నారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. ఎలాంటి దాపరికం లేదు.

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

### తల్లి సాక్షిగా చెబుతున్నా, నాకు సంబంధం లేదు

క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారంలో నాకు సంబంధం లేదు. నా తల్లి సాక్షిగా చెబుతున్నా ఈ రోజు నాకు ఎంతో ముఖ్యమైన పెళ్లి రోజు. కాని పోలీసుల విచారణకు రమ్మంటే వచ్చాను. నెల్లూరు ప్రజలు, పార్టీ కార్యకర్తలు, మా నాయకులు నమ్మితే చాలు. ఎవరి దగ్గరైనా రూపాయి తీసుకోలేదు. రూ. 30 కోట్ల ఆస్తులను రాజకీయాల్లోకి వచ్చి పోగొట్టుకున్నా. ప్రధాన బుకీలలో సూళ్లూరుపేటకు చెందిన అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి ఒక్కడే వైసీపీ నేత. మిగిలిన ప్రధాన బుకీలంతా టీడీపీ అనుచరులే. ఆడి ఆస్తులు పోగొట్టుకున్న వారు వైసీపీ వారు.

**- అనిల్‌కుమార్ యాదవ్**



విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు



పోలీస్ కార్యాలయం బయట ఎమ్మెల్యేల అనుచరుల హడావుడి



కళాకృతులను రూపొందిస్తున్న మల్లి విష్ణువందన

కుక్కపిల్ల.. అగ్గిపుల్ల .. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం అన్నారు మహాకవి శ్రీశ్రీ.. కొబ్బరిచిప్ప... కాఫీ కప్పు... విరిగిన గాజు.. కావేవీ కళాకృతుల సృష్టికనర్హం అంటున్నారు ఈ గృహిణి. గృహాల్లోని వ్యర్థ వస్తువులతో అందమైన కళాఖండాలను రూపొందించి ఇంటిని కంటికింపుగా మార్చుకోవచ్చని నిరూపించారు సూళ్లూరుపేట కీర్తి ఎన్‌క్లేవ్ నివాసి చలువాది మల్లి విష్ణు వందన. - సూళ్లూరుపేట



పాత సీడీలతో వినాయక చవితికి పాలవల్లికి కట్టే తోరణం



నీళ్లబాటిల్, సీడీలతో

# వ్యర్థాలతో కళాకృతులు

● చవితికి ముస్తాబైన వివిధ వస్తువులు ● విష్ణువందన సృజనాత్మకత

● సూక్ష్మ కళాకారిణిగా కూడా రాణింపు

**● ప్రతిదీ పనికొచ్చేదే..**

విరిగిన చేతిగాజు ముక్కనూ, జ్యూస్ తాగే స్ట్రాను పడేయటం లేదు.. కొబ్బరి తీసేసిన చిప్పను విసిరేయడంలేదు.. చిన్న చిన్న చిట్కాలతో ఇలా వాడిపడేసిన అన్ని వస్తువులకు అద్భుత ఆకృతులను రూపొందిస్తున్నారామె.

**● వ్యర్థ వస్తువులతో అలంకారాలు**

వినాయక చవితిని దృష్టిలో పెట్టుకొని వ్యర్థ వస్తువులతో వినాయకుడి పూజామందిర అలంకరణలు రూపొందించారు. వీటిని ఆమె విలేఖరుల ఎదుట ప్రదర్శించారు.

**● పాలవెల్లికి తోరణం**

వినాయక చవితికి పూజామందిరంలో పాలవెల్లిని కడుతుంటారు.. ఆ పాలవెల్లి స్తంభాలకు అలంకరణగా సీడీలు, క్యాన్‌వాస్ గుడ్డలతో వేలాడే తోరణం రూపొందించారు.

**● గణపయ్యకు గొడుగు**


బెండుతో ఉండే డిస్‌పోజబుల్ ప్లేట్, జ్యూస్ తాగే స్ట్రాలు, వెల్‌వేట్ గుడ్డ, అందమైన పూసలతో గణపయ్యకు గొడుగును రూపొందించారు.

**● దీపస్తంభాల కింద అందమైన ఆకృతులు**

పూజామందిరంలో దీపస్తంబాల కింద పెట్టేలా అందమైన ఆకృతులను, పాత సీడీలు, క్యాన్‌వాస్‌గుడ్డ, మెటాలిక్ పెయింట్, కుందన్‌లతో రూపొందించారు.

**పూలబుట్ట :** కొబ్బరి తీసేసిన చిప్పలు.. పాత సీడీలు.. కూల్‌డ్రింక్ మూతలు, ముత్యాల పూసలు, లేస్‌లతో అందమైన పూలబుట్టను తయారు చేశారు. పచ్చిమాల వినాయకుడికి అలంకరించేందుకు పత్తివత్తులు, కుందన్, ఊలుతో పత్తిమాలను రూపొందించారు.

**అగరవత్తుల స్టాండ్ :** వంటగదిలో వాడే డీష్‌పేపర్ మధ్య ఉండే అర్థరోల్, పాతసీడీ, మెటాలిక్ పెయింట్, కుందన్, బ్లౌజ్ దారాలతో అగరబత్తీలను




క్యాన్‌వాస్ క్లాత్‌తో దీప స్తంభాల కింద అందమైన ఆకృతి

పెట్టుకునేందుకు స్టాండ్ రూపొందించారు.

**వినాయక మండపం :** వినాయక ప్రతిమ కోసం ప్రత్యేకంగా ఓ మండపాన్ని తయారుచేశారు. చిన్న ప్లాస్టిక్ బక్కెట్‌పై ఉండే మూతలు, జ్యూస్ బాటిల్ పైభాగం వాడిపడేసిన స్కేట్ పెన్నులు, క్యాన్‌వాస్ గుడ్డ, కుందన్, జెరీ అంటూ మెటాలిక్ పెయింట్, పెళ్లి పత్రికలపై అతికించి ఉండే దేవుళ్ల బొమ్మల ప్ర తిమలతో వినాయక మండపాన్ని తయారు చేశారు.

**గాజులతో కుంకుమ భరణిలు :** చేతి గాజులు, సీసా మూతలతో పసుపు, కుంకుమ భరణిలు తయారుచేశారు.ఇలా రకరకాల కళాకృతులను విష్ణువందన తయారు చేశారు. హారతిపళ్లెం, గుమ్మానికి వేలాడే తోరణాలు, ఫ్లవర్‌వాజు, విరిగిన గాజు ముక్కలతో తోరణాలు వంటివి





పగిలిన గాజులను అతికించి..

అనేక అందమైన ఆకృతులను తీర్చిదిద్దారు.

**● కాలం వృథా చేయకుండా..** టీవీల ముందు గంటలు గంటలు గడపకుండా, ఇరుగుపొరుగులతో ఊసుపోని కబ్బుర్లతో కాలం వృథా చేయకుండా ఇలా వినూత్నంగా వివిధ ఆకృతులను రూపొందించి ఇంటిని అలంకరించుకుంటే కలిగే సంతృప్తి అంతా ఇంతాకాదని మల్లి విష్ణువందన చెప్పారు. పైగా ఏదైనా అనుమానాలు కలిగితే గూగులమ్మ(గూగుల్) సాయంకూడా తీసుకోవచ్చన్నారు. అందులో ఎన్నో చిట్కాలు ఉన్నాయని తెలిపారు.

**● సూక్ష్మ కళాకారిణిగా**

మల్లి విష్ణువందన సూక్ష్మకళాకారిణిగా సైతం పేరుగడించారు. లక్ష యాభైవేలు బియ్యపు గింజలపై శ్రీరామనామాలు లిఖించి రికార్డు సాధించారు. వాటిని ఒంటిమిట్ట రామాలయంతోపాటు వివిధ ఆలయాలలో కల్యాణాలకు సవ౦ర్పి౦చార౦. అలాగే వివిధ ఆలయాలలో జరిగే ఉత్సవాలలో దేవతా మూర్తుల ప్రతిమలకు అలంకారాలను వివిధ వస్తువులతో రూపొందించి సవ౦ర్పి౦చడ౦ ఆమె భక్తి భావానికి తార్కాణం.



కొబ్బరిచిప్ప, బాటిల్ మూతలతో పూలకుండీ




విష్ణువందన రూపొందించిన కళారూపాలు

# రూ.1200కే కార్పొరేట్ వైద్యం

● అందుబాటులోకి 138 రకాల సేవలు

● డిసెంబర్ ఆఖరు వరకూ అవకాశం

**రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు బాసటగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఆరోగ్య రక్ష ప్రజల పాలిట వరంగా మారనుంది. ఒక వ్యక్తి రూ.1200 చెల్లిస్తే కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.2 లక్షల విలువైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టింది. ఏడాదిపాటు ఈ పథకంలో 138 రకాల వ్యాధులకు వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ప్రచారం కొరవడడంతో చాలా మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. - మనుబోలు**




రాష్ట్రంలోని నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం ఆరోగ్యరక్ష ప్రారంభించింది. 2017 జనవరి 1 నుంచి దీనిని అమల్లోకి తెచ్చింది. ఎన్టీఆర్ వైద్యసేవ, ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ, పాత్రికేయుల ఆరోగ్య సంరక్షణ తదితర పథకాల్లో లబ్ధిపొందని వారు ఈ పథకంలో చేరడానికి అర్హులు. ఈ పథకంలో చేరడానికి మొదట ఫిబ్రవరి 28వ తేదీకి గడువు పెట్టారు. అయితే ప్రజాసాధికార సర్వేలో పేర్లు నమోదవ్వకపోవడం, తెల్లకార్డుదారులు ఈ పథకంలో చేరేందుకు అనర్హులని ప్రకటించడంతో సభ్యత్వ నమోదు మందకొడిగా సాగింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 6వ తేదీ వరకూ గడువు పొడిగించారు. దీంతో మార్చి నుంచి ఏప్రిల్ మధ్యలో కలెక్టర్ ఈ పథకంపై దృష్టి పెట్టారు. ప్రతి మండలంలోని తహసీల్దార్లు, ఆరోగ్య మిత్రాలకు లక్ష్యాలు నిర్దేశించారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య రక్ష పథకాన్ని ప్రారంభించి వైద్యసేవలు అందిస్తున్నారు. పథకంలో చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపడంతో దరఖాస్తు గడువును ఈ ఏడాది డిసంబర్ ఆఖరు వరకూ పొడిగించారు. ప్రభుత్వం ఆరోగ్యరక్ష పథకం ప్రారంభించిన తొలినాళ్లలో మాత్రమే భారీ ఎత్తున ప్రచారం చేసి అనంతరం మిన్నకుండిపోయింది. దీని గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయకపోవడంతో చాలామంది పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2500 కుటుంబాలు, 5050 మంది మాత్రమే ఈ పథకంలో సభ్యులుగా చేరారు. అధికారులు చొరవచూపి ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది.

**దరఖాస్తు చేసుకోవడం ఇలా..**

పింక్ రేషన్‌కార్డు కలిగిన వారు ముందుగా మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులో పూర్తి వివరాలు నింపిన తరువాత రూ.1200 చెల్లించాలి. అరగంట తరువాత పథకంలో సభ్యత్వ నమోదు తెలపుతూ కార్డు వస్తుంది. వారం రోజుల తరువాత కార్డు యాక్టివేట్ అవుతుంది. ఎన్టీఆర్ వైద్యసేవలో ఒక కార్డులో ఎంతమంది సభ్యులున్నా అందరికీ రూ.2 లక్షల వరకే వైద్యసేవలు అందిస్తారు. అదే ఆరోగ్య రక్ష పథకంలో ఒక రేషన్‌కార్డులో నలుగురు సభ్యులుంటే నలుగురికి రూ.1200 చెల్లించితే ఒక్కొక్కరికి రూ.2 లక్షల వరకు మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం ఉంది.

**ప్రచారం చేయిస్తున్నాం**



పథకంపై ప్రజలలో విస్తృతంగానే ప్రచారం చేయిస్తున్నాం. పీహెచ్‌సీల వారీగా ఆరోగ్య మిత్రలకు, సీహెచ్‌వోలకు లక్ష్యాలను ఇచ్చాం. సినిమాహాలులో, కరపత్రాలు పంపిణీ ద్వారా ప్రచారం చేశాం. గడువు ముగిసేలోగా ఎక్కువ మందిని చేర్చేలా చర్యలు తీసుకుంటాం. వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఎన్టీఆర్ వైద్యసేవ.ఏపీ జీవోవి. ఇన్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చు. **- డా. దయాకర్, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ జిల్లా సమన్వయ కర్త**

**కార్పొరేట్ వైద్యం పొందవచ్చు**



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యరక్ష పథకం చాలా మంచిది. ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులు లేనివారు ఈ పథకంలో చేరవచ్చు. పింక్‌కార్డులు కలిగిన వారికి ఇది చాలా ఉపయోగం. పేదవాడు ఖరీదైన కార్పొరేట్ వేద్యసేవలు పొందే అవకాశం ఉంది.

**- సూరపనేని కిషోర్‌నాయుడు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్**

**ఆర్థిక భారం తగ్గుతుంది**



ఇలాంటి ఆరోగ్య పథకాలకు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులో వేల రూపాయులు చెల్లించాలి. అదే ప్రభుత్వం ద్వారా అయితే రూ. 1200లతో సభ్యత్వం నమోదు చేసుకున్నా. దీని వలన ఆర్థిక భారం తప్పడంతో పాటు ఆరోగ్యానికి భరోసా లభిస్తుంది. అందరూ చేరండి మంచి పథకం. **- పల్లి మల్లికార్జున**

# మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?

## మెంటల్ ఎబిలిటీ



Panditi Meenakshi Pavan
Senior Faculty

**Competitive Exams Special**

1. ఒక కోడ్ భాషలో PEACEను FEDIUగా రాశారు. అదే కోడ్‌లో FAITH ను ఎలా రాస్తారు?
ఎ) IVLEK బి) KLEVI
సి) EIKLK డి) ఏదీకాదు

2. ఒక కోడ్‌లో GENIUSను TVJOFHగా రాశారు. అదే కోడ్‌లో NATUREను ఎలా రాస్తారు?
ఎ) OBUSVF బి) FSVUBO
సి) UBOVFS డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో GOODను 76గా రాశారు. అదే కోడ్‌లో HEARను ఎలా రాస్తారు?
ఎ) 67 బి) 58 సి) 49 డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో STUDENTను FPWDRRRగా రాశారు. అదే కోడ్‌లో TEACHERను ఎలా రాస్తారు?
ఎ) XCUGISC బి) SCXCUGI
సి) IGUCSCX డి) ఏదీకాదు

(5 - 7) ఒక కోడ్ భాషలో
nic sac tic అంటే all are good
sac mic mec అంటే good luck people
tic mec rac అంటే all people nice
పై కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

5. sac నకు సరైన కోడ్?
ఎ) good బి) luck సి) are డి) ఏదీకాదు

6. rac నకు సరైన కోడ్?
ఎ) luck బి) nice సి) all డి) people

7. mec నకు సరైన కోడ్?
ఎ) all బి)good సి)people డి) luck

8. 10, 5.5, 6.5, 15, 64, ------
ఎ) 520 బి) 256 సి) 128 డి) 156

9. 600, 120, 30, 10, 5, ------
ఎ) 6 బి) 8 సి) 4 డి) 5

10. 68, 14, 85, 13, 93, 12, 89, ----
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18

11. 5, 6, 11, 17, 28, 45, ------
ఎ) 73 బి) 75 సి) 78 డి) 81

(12 - 14) భిన్నమైన దానిని తెలపండి?

12. ఎ) LOP బి) KPO సి) TGW డి) IRM

13. ఎ) 347 బి) 819 సి) 628 డి) 529


14. ఎ) రాగి బి) తగరం సి) తుత్తినాగం డి) జింక్

15. FAME : GOCH :: KING : --------
ఎ) IPKM బి) IKMP సి) PMKI డి) ఏదీకాదు

16. గడియారంలో సమయం గం7.30నిలు అయింది. నిమిషాల ముల్లు ఈశాన్యాన్ని చూపిస్తోంది అనుకొంటే గంటల ముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?
ఎ) పడమర బి) దక్షిణం సి) ఉత్తరం డి) తూర్పు

17. విజయ్ కాలేజీకి వెళ్లాలనుకొన్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు తూర్పున ఉంది. ఆ రోడ్డు కూడలికి వచ్చిన తరవాత ఎడమవైపున ఆడిటోరియం ఉంది. అతని ఇంటికి ఎదురు రోడ్డులో బ్యాంక్ ఉంది. అయితే కాలేజ్ ఏ దిశలో ఉంది?
ఎ) దక్షిణం బి) ఉత్తరం సి) పడమర డి) తూర్పు

18. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?





ఎ) 260 బి) 220 సి) 280 డి) 240

19. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?

| | | |
|---|---|---|
| $L_8$ | $N_4$ | $M_{80}$ |
| $M_4$ | $L_3$ | $N_{25}$ |
| $N_6$ | $M_8$ | ? |

ఎ) $L_{100}$ బి) $N_{80}$ సి) $M_{60}$ డి) $L_{120}$

20. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్య?




ఎ) 172 బి) 186 సి) 144 డి) 196

21. ఫొటోలో ఉన్న ఒక వ్యక్తిని చూపిస్తూ అజయ్ ఇలా చెబుతున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక కుమారుని ఏకైక సోదరి భర్తకు కుమార్తె కొడుకు'. అయితే ఫొటోలోని వ్యక్తి అజయ్‌కు ఏమవుతాడు?
ఎ) మేనమామ బి) మేల్లుడు
సి) అల్లుడు డి) సోదరుడు

22. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అవినాష్ ఇలా చెబుతున్నారు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కుమారుడి సోదరి భర్త భార్యకు ఏకైక సోదరుడు.' అయితే ఫొటో లోని వ్యక్తికి అవినాష్ ఏమవుతాడు?
ఎ) అల్లుడు బి) సోదరుడు సి) తండ్రి డి) కుమారుడు

23. AA, BE, FI, OO, -------------
ఎ) EU బి) EV సి)FU డి) FV

24. AZ, CX, FT, JN, --------------
ఎ) DE బి) OF సి) FO డి)EP

25. TE, SF, QI, NN, ----------
ఎ) JU బి) KU సి) IV డి) TV

26. a - c - cbc - b - ca - cbab - a -
ఎ) babacac బి) baaabcc
సి) ababacc డి) ఏదీకాదు

27. aab - dab - cdabc - d - bc - d
ఎ) abcdc బి) bcdcd సి) cbcad డి) ఏదీకాదు

28. వికాస్ దక్షిణానికి 7మీ. నడిచిన తరవాత ఎడమ వైపునకు తిరిగి 9 మీటర్లు నడిచాడు. చివరకు మరల కుడివైపునకు తిరిగి 5మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వికాస్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ నైరుతి బి) 15 మీ వాయవ్యం
సి) 15 మీ ఆగ్నేయం డి) 15 మీ ఈశాన్యం

29. ఒక వరసలో అనిల్ కుడివైపునుంచి 24వ స్థానంలోను, ఎడమవైపునుంచి 17వ స్థానంలోను ఉన్నాడు. అదే వరసలో సునీల్ ఎడమవైపు నుంచి 26వ స్థానంలో ఉంటే కుడి వైపు నుంచి సునీల్ స్థానమెంత?
ఎ) 15 బి) 18 సి) 16 డి) 19

30. ఒక వరసలో నిశాంత్ కుడివైపునుంచి 18వ స్థానంలోను, ఎడమవైపు నుంచి 13వ స్థానం లోను ఉన్నాడు. అదే వరసలో నిరంజన్ తన కుడివైపునకు 5 స్థానాలు జరిగాడు ప్రస్తుతం అతను ఎడమవైపు నుంచి 22వ స్థానంలో ఉన్నట్లయితే కుడివైపు నుంచి నిరంజన్ మొదటి స్థానం ఎంత?
ఎ) 16 బి) 14 సి) 18 డి) ఏదీకాదు

31. ఇంటర్వ్యూని నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 10 కంటే 15 నిలు ముందుగా వచ్చారు. ఈ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కంటే 30 నిలు ముందుగా వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 45నిలు ముందు వచ్చారు. అయితే ఆయన ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించదలచారు?
ఎ) గం. 11.00ని. బి) గం. 11.02ని.
సి) గం. 11.15 ని. డి) గం. 11.30ని.

32. అజయ్‌కు అతని తల్లిదండుల పెళ్లి రోజు నవంబరు 11, 15ల మధ్య అని గుర్తు. అతని సోదరి ఆర్తికి నవంబరు 13, 17ల మధ్య అని గుర్తు. అయితే వారి తల్లి దండ్రుల పెళ్లి రోజు ఎప్పుడు?
ఎ) నవంబరు 15 బి) నవంబరు 13
సి) నవంబరు 14 డి) ఏదీకాదు

33. (36 X 1/4) of 4 ÷ 6 x 2 - 8+6ను సూక్ష్మీకరించండి?
ఎ) 36 బి) 10 సి) 42 డి) ఏదీకాదు

34. P అంటే ÷, Q అంటే x, R అంటే -, S అంటే + అయితే 36P4Q5R8S4 విలువ ఎంత?
ఎ) 41 బి) 39 సి) 45 డి) ఏదీకాదు

35. కింది వానిలో సరైన దానిని తెలపండి
ఎ) 18 ÷ 3 X 4 - 5 + 3 = 20
బి) 25 ÷ 5X 3 - 6 + 4 = 15
సి) 35 ÷ 7X 6 - 4 + 7 = 33 డి) ఏదీకాదు

36. SHIPCYS పదంలోని అక్షరాల స్థానాలను మార్చగా ఒక పార్యాంశం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి అక్షరం ఏమిటి?
ఎ) H బి) P సి) I డి) ఏదీకాదు


37. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్య ఏర్పడే పదాన్ని తెలపండి?
1. Mango 2. Music 3. Margin
4. Marble 5. Medium
ఎ) Music బి) Mango సి) Medium డి) Margin

38. ఈ రోజు నవంబరు 29 ఆదివారం. ఇది లీపు సంవత్సరమైతే మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?
ఎ) బుధవారం బి) గురువారం
సి) మంగళవారం డి) ఏదీకాదు

39. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల ఏది?
ఎ) నవంబరు బి) డిసెంబరు
సి) జనవరి డి) ఏదీకాదు

40. గడియారంలో సమయం గం.2.30 నిలు అయితే గంటల ముల్లు, నిముషాల ముల్లు మధ్య కోణమెంత?
ఎ) $100^0$ బి) $90^0$ సి) $105^0$ డి) ఏదీకాదు

(41-45)




పై రేఖాచిత్రంలో దీర్ఘచతురస్రం భారతీయులను, వృత్తం సైనికులను, త్రిభుజం పురుషులను సూచిస్తుంది. పై రేఖాచిత్రం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

41. భారతీయులైన పురుషులను సూచించే అక్షరం?
ఎ) C బి) G సి) F డి) ఏదీకాదు

42. భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) G బి) D సి) E డి) ఏదీకాదు

43. పురుషులైన భారతీయ సైనికులను సూచించే అక్షరం?
ఎ) C బి) F సి) D డి) ఏదీకాదు

44. భారతీయులను సూచించే అక్షరం?
ఎ) F బి) B సి) A డి) ఏదీకాదు

45. కేవలం సైనికులను సూచించే అక్షరం?
ఎ) B బి) D సి) E డి) ఏదీకాదు

46. అద్దంలో చూసినపుడు సమయం గం.4.20 నిలు. అయితే అసలు సమయం?
ఎ) గం.7.30ని బి) గం7.40ని
సి) గం.8.40ని డి) ఏదీకాదు

**సమాధానాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | 15) ఎ | 23) ఎ | 31) ఎ | 39) బి |
| 1) ఎ | 8) ఎ | 16) డి | 24) బి | 32) సి | 40) సి |
| 2) బి | 9) డి | 17) బి | 25) ఎ | 33) బి | 41) సి |
| 3) ఎ | 10) సి | 18) బి | 26) బి | 34) ఎ | 42) బి |
| 4) సి | 11) ఎ | 19) ఎ | 27) సి | 35) సి | 43) ఎ |
| 5) ఎ | 12) సి | 20) సి | 28) సి | 36) బి | 44) బి |
| 6) బి | 13) డి | 21) బి | 29) ఎ | 37) డి | 45) సి |
| 7) సి | 14) సి | 22) డి | 30) బి | 38) ఎ | 46) బి |

## JOBS ఉద్యోగాలు

### బిహెచ్ఇఎల్

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బిహెచ్ఇఎల్)- టెక్నీషియన్ అప్రెంటిస్‌ల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
**మొత్తం ఖాళీలు:** 310
**అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ వ్యవధి:** ఏడాది
**క్యాంపస్:** బిహెచ్ఇఎల్, ఇడిఎన్, బెంగళూరు
**విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్/ సివిల్/ మెకట్రానిక్ ఇంజనీరింగ్
**అర్హత:** 2015 జనవరి 1 నాటికి సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**వయసు:** ఆగస్టు 1 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.
**ఇంటర్వ్యూలు పూర్తయ్యే తేదీ:** ఆగస్టు 31
**వేదిక:** Bharath Heavy Electricals Limited, Electronics Division, Mysuru Road, Bengaluru - 560026
**వెబ్‌సైట్:** www. bheledn.com
www.bheldn.com

### ఐఐటి మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)- జూనియర్ టెక్నీషియన్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 32
**పోస్టులు - ఖాళీలు:** రిజిస్ట్రార్ 1, సిస్టమ్స్ ఇంజనీర్ 1, సెక్యూరిటీ ఆఫీసర్ 1, జూనియర్ ఇంజనీర్ 3, స్టాఫ్ నర్స్ 4, జూనియర్ టెక్నీషియన్ 12, జూనియర్ అసిస్టెంట్ 10
**అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎంఇ/ ఎంటెక్(కంప్యూటర్ సైన్స్) + ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలి లేదా 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్) + పదేళ్ల అనుభవం ఉండాలి.
**వయసు:** 27 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఎంపిక:** రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
**దరఖాస్తు ఫీజు:** రూ.100
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 8
**దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 15
**చిరునామా:** The Assistant Registrar, Recruitment Section, Admin. Building(First Floor), IIT Madras, Chennai - 600036
**వెబ్‌సైట్:** www.recruit.iitm.ac.in

### డిఆర్‌డిఒ

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ)- జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**ఖాళీలు:** 11
**అర్హత:** ఫస్ట్ క్లాస్ మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఇన్ సైకాలజీ ఉత్తీర్ణత + నెట్ అర్హత పొంది ఉండాలి.
**వయసు:** 28 ఏళ్లు మించరాదు
**స్టయిపెండ్:** మొదటి రెండేళ్లు నెలకు రూ.25,000 మూడో ఏడాది నెలకు రూ.28,000 ఇస్తారు. హెచ్ఆర్ఏ + మెడికల్ ఫెసిలిటీస్ తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15000 ఇస్తారు.
**ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు రూ.10ల ఇండియన్ పోస్టల్ ఆర్డర్‌ను జతచేసి కింది చిరునామాకు పంపుకోవాలి.
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 7
**చిరునామా:** Director DIPR, Lucknow Road, Timarpur, Delhi - 110054

# గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?

## ఆదేశిక సూత్రాలు

1. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగ నిర్మాతలు ఏ దేశం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) అమెరికా సి) బ్రిటన్ డి) రష్యా

2. ఆదేశిక సూత్రాల ముఖ్య లక్ష్యం?
ఎ) సామ్యవాద వ్యవస్థను ఏర్పాటు చేయడం
బి) సంక్షేమ రాజ్యస్థాపన(లేదా) శ్రేయోరాజ్య స్థాపన
సి) పెట్టుబడిదారీ వ్యవస్థను రూపొందించడం
డి) కమ్యూనిస్ట్ వ్యవస్థను రూపొందించడం

3. ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్ ఏ దేశం నుంచి స్వీకరించింది?
ఎ) రోమ్ బి) అమెరికా సి) స్పెయిన్ డి) రష్యా

4. ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?
ఎ) రెండో భాగం 5 నుంచి 11 ఆర్టికల్ వరకు
బి) మూడో భాగం 12 నుంచి 35 ఆర్టికల్ వరకు
సి) నాలుగో భాగం 36 నుంచి 51 ఆర్టికల్ వరకు
డి) 4(ఎ) భాగం, 51(ఎ) ఆర్టికల్

5. ప్రభుత్వ విధానాలను రూపొందించడం, వాటిని అమలులో వేటిని ప్రాథమికాలుగా భావిస్తారు?
ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు డి) ఏదీకాదు

6. ఆదేశిక సూత్రాలకు చట్ట సంరక్షణ లేదు, వీటిని కోర్టుల ద్వారా అమలు పరచడానికి వీలు లేదు అని తెలిపే అధికరణం?
ఎ) 36వ బి) 37వ సి) 38వ డి) 39వ

7. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు వేటి ప్రభావ ఫలితం?
ఎ) సామ్యవాద భావాలు బి) ప్రాథమిక హక్కులు
సి) ప్రాథమిక విధులు డి) పైవన్నీ

8. మన రాజ్యాంగ పీఠికలో 'సామ్యవాద' అనే పదాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా చేర్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

9. సామ్యవాదాన్ని అమలుచేయడానికి రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు?
ఎ) విధివిధానాలు బి) ప్రాథమిక విధులు
సి) ప్రాథమిక హక్కులు డి) ఆదేశిక సూత్రాలు

10. ఆదేశిక సూత్రాలను ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు జవాబుదారిగా నిలవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది?
ఎ) గాంధీ బి) నెహ్రూ సి) పటేల్
డి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

11. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ ప్రవేశికలో ఉదహరించిన ఆశయాలను పోలి ఉంటాయని అన్నది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) బి.ఎన్.రావు
సి) ఎన్.గోపాలస్వామి డి) గాంధీజీ

12. ఆదేశిక సూత్రాలు శాసన వ్యవస్థకు కరదీపం వంటిదని పేర్కొనది?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బి) ఎన్.గోపాలస్వామి
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు

13. ఆదేశిక సూత్రాలను వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండీ అని ఎవరు అన్నారు?
ఎ) ఎం.సి.సెతల్వాడ్ బి) కె.ఎం.మున్షీ
సి) ఎం.సి.చాగ్లా
డి) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్

14. భారత ప్రభుత్వం నిర్దేశిక నియమాలను నిజాయతీగా అమలుచేస్తే భారతదేశం ఒక భూతల స్వర్గం అవుతుందని పేర్కొనది?
ఎ) గాంధీ బి) ఎం.సి.చాగ్లా
సి) అంబేద్కర్ డి) ఎం.సి.సెతల్వాడ్

15. బలహీనవర్గాల విద్య, ఆర్థిక స్థితిగతులు మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపే నిబంధన?
ఎ) 44వ బి) 45వ సి) 46వ డి) 47వ

16. ఆదేశిక సూత్రాల్లో ఏ అధికరణం గ్రామపంచా యతీల ఏర్పాటును సూచిస్తుంది?
ఎ) 40 బి) 41 సి) 42 డి) 43

17. స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి అని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 38 బి) 39 సి) 39(డి) డి) 39(ఇ)

18. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఏ రాష్ట్రానికి వర్తించవు?
ఎ)జమ్మూకశ్మీర్ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) సిక్కిం డి) అస్సాం

19. గోవధను నిషేధించిన రాష్ట్రాలు?
ఎ) ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక
సి) తమిళనాడు, జమ్మూకశ్మీర్
డి) మహారాష్ట్ర, తెలంగాణ

20. గోవధ నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ


కొమ్ము సుందర్‌రాజు
పొలిటీ ఫ్యాకల్టీ

## జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

21. మత్తుమందులు, మత్తు పానీయాలను నిషేధించి ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి అని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 47వ సి) 48వ డి) 50వ

22. సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తెలంగాణ డి) గుజరాత్

23. ఒకే శిక్షాస్మృతి అమల్లో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కేరళ సి) గోవా డి) తెలంగాణ

24. కార్మికులకు కనీస వేతనం, కనీస పనిగంటలు కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ

25. మహిళలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 42వ బి) 43వ సి) 44వ డి) 45వ

26. దేశంలోని పౌరులందరికీ ఒకే శిక్షాస్మృతిని అమలు చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 40వ బి) 44వ సి) 50వ డి) ఏదీకాదు

27. ఆరేళ్లలోపు బాలబాలికలకు అందించే బాలబడి విద్యను ఏ రాజ్యాంగ సవరణ ద్వారా 45వ అధికరణంలో చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1956, 7వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

28. చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను సంరక్షించాలని, జాతీయ వస్తువులను పరిరక్షించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 48వ బి) 49వ సి) 50వ డి) 51వ

29. ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆదేశిక సూత్రాల్లో అదనపు సూత్రాలను చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 2001, 85వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

30. యువతీయువకులు, బాలబాలికలు దురలవాట్లకు లోనుకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని తెలిపే నిబంధన?
ఎ) 39(ఎ) బి) 39(ఇ) సి) 39(ఎఫ్) డి) 39వ

31. రాజ్యాంగంలో ఏ అధికరణం నిరుద్యోగ భృతిని కల్పించాలని తెలుపుతుంది?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ

32. వృద్ధాప్య పెన్షన్ ఏ అధికరణం ప్రకారం కల్పించాలి?
ఎ) 40వ బి) 41వ సి) 42వ డి) 43వ

33. ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధాప్య పెన్షన్‌ను కల్పించిన మొదటి ముఖ్యమంత్రి?
ఎ) కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బి) నీలం సంజీవరెడ్డి
సి) వై.ఎస్.రాజశేఖరరెడ్డి డి) ఎన్.టి.రామారావు

34. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేనిది?
ఎ) ఆశ్రయ హక్కు బి) పని హక్కు
సి) విద్య హక్కు
డి) ప్రభుత్వ సహాయ హక్కు

35. ప్రపంచ శాంతికి కృషి చేయడం, అంతర్జాతీయ శాంతిభద్రతలను పెంపొందించుకోవాలని తెలిపే అధికరణం?
ఎ) 50వ బి) 51వ సి) 51(ఎ) డి) ఏదీకాదు

36. పేదలకు ఉచిత న్యాయసహాయం గురించి తెలిపే అధికరణం?
ఎ) 38వ బి) 39వ సి) 39(ఎ) డి) 43(ఎ)

37. యుపిఎ ప్రభుత్వం ఏ అధికరణం ప్రకారం 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని కల్పించింది?
ఎ) 41వ బి) 42వ సి) 43వ డి) 44వ

38. వెట్టిచాకిరి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1973 బి) 1974 సి) 1975 డి) 1976

39. నిరుద్యోగ భృతిని అందిస్తున్న రాష్ట్రాలు?
ఎ) పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్
బి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
సి) కర్ణాటక, తమిళనాడు డి) మహారాష్ట్ర, బీహార్

40. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వికలాంగులకు ఎంత పెన్షన్ ఇస్తున్నారు?
ఎ) రూ.500 బి) రూ.1000
సి) రూ.1200 డి) రూ.1500

41. వికలాంగులకు భృతిని కల్పిస్తున్న రాష్ట్రాలు?
ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, సిక్కిం
బి) మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యాన
సి) గోవా, కేరళ, నాగాలాండ్ డి) పైవన్నీ

42. నిర్దేశిక నియమాలు రాజ్యాంగానికి ప్రాణవాయువు వంటిది అని అన్న రాజ్యాంగ న్యాయకోవిదుడు ఎవరు?
ఎ) ఎల్.ఎం.సింఘ్వి బి) కె.టి.షా
సి) ఎం.సి.సెతల్వాడ్ డి) ఎవరూ కాదు

43. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కుల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు?
ఎ) 1956, 7వ రాజ్యాంగ సవరణ
బి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
సి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

44. యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలని తెలిపే అధికరణం?
ఎ) 39వ బి) 39(ఎ) సి) 43(ఎ) డి) 48(ఎ)

45. ఆదేశిక సూత్రాలను మూడు రకాలుగా వర్గీకరించిన పరిపాలన శాస్త్రవేత్త?
ఎ) ఎం.పి.శర్మ బి) జి.ఎన్.జోషి
సి) ఎ, బి డి) ఎవరూ కాదు

46. అడవులు, అటవీ జంతువుల సంరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తెలిపే అధికరణం?
ఎ) 39(ఎ) బి) 43(ఎ) సి) 48(ఎ) డి) 50

47. వ్యవసాయం, పశుగణాభివృద్ధిని శాస్త్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేయాలని తెలిపే అధికరణం?
ఎ) 48వ బి) 48(ఎ)వ సి) 49వ డి) 50వ

48. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరులకు పౌష్టికాహారం అందించాలని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 46వ బి) 47వ సి) 48వ డి) 49వ

### సమాధానాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) ఎ | 8) బి | 15) సి | 22) డి | 31) బి | 40) డి |
| 2) బి | 9) డి | 16) ఎ | 23) సి | 32) బి | 41) ఎ |
| 3) సి | 10) డి | 17) సి | 24) సి | 33) డి | 42) ఎ |
| 4) సి | 11) ఎ | 18) ఎ | 25) ఎ | 34) ఎ | 43) బి |
| 5) సి | 12) సి | 19) ఎ | 26) బి | 35) బి | 44) సి |
| 6) బి | 13) డి | 20) సి | 27) డి | 36) సి | 45) సి |
| 7) ఎ | 14) బి | 21) బి | 28) బి | 37) ఎ | 46) సి |
| | | | 29) ఎ | 38) సి | 47) ఎ |
| | | | 30) సి | 39) ఎ | 48) బి |

## అడ్మిషన్స్

### బిఐఆర్ఇడి

హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని బ్యాంకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (బిఐఆర్ఇడి)- గ్రామీణ యువకుల కోసం ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
**శిక్షణాంశాలు:** మొబైల్ సర్వీసింగ్/ యంయస్ ఆఫీస్/ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్ / ఎలక్ట్రీషియన్ & వ్యవసాయ పంపుసెట్ రిపెయిర్
**అర్హత:** శిక్షణాంశాన్ని అనుసరించి పదోతరగతి/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
**వయసు:** 19 నుంచి 30ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తారు.
**శిక్షణ కార్యక్రమాల తేదీలు:** సెప్టెంబరు 13 నుంచి నవంబరు 7 వరకు
ప్రస్తుతం చదువు కొనసాగిస్తున్నవారు, బిఇడి/ ఇంజనీరింగ్/ ఎంబిఏ/ ఎంసిఏ పూర్తిచేసినవారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.
**వెబ్‌సైట్:** www.bired.org

## JOBS ఉద్యోగాలు

### ఐటిబిపిఎఫ్

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపిఎఫ్)- సబ్ ఇన్‌స్పెక్టర్ (ఓవర్‌సీర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**ఖాళీలు:** 21(పురుషులకు 18, మహిళలకు 3 పోస్టులు కేటాయించారు)
**వయసు:** సెప్టెంబరు 22 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
**అర్హత:** మెట్రిక్యులేషన్ + డిప్లొమా(సివిల్) ఉత్తీర్ణులై ఉండాలి.
**ఎంపిక:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 22
**వెబ్‌సైట్:** www.recruitment.itbpolice.nic.in

### పారదీప్ పోర్ట్ ట్రస్ట్

పారదీప్ పోర్ట్ ట్రస్ట్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
**ఖాళీలు:** 8
**పోస్టులు:** చీఫ్ మేనేజర్ 4, సీనియర్ మేనేజర్ 2, మేనేజర్ 2
**విభాగాలు:** ఇన్వర్మేషన్/ కమ్యూనికేషన్ & ట్రేడ్ ఫెసిలిటేట్/ఎన్విరాన్‌మెంట్ & సేఫ్టీ/ బిజినెస్ డెవలప్‌మెంట్ & ట్రేడ్ ప్రమోషన్/ కార్పొరేట్ రిలేషన్ & కమ్యూనికేషన్స్
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 19
**చిరునామా:** Secretary, Paradip port Trust, Administrative Building, Paradip - 754142, Jagatsinghpur Dt, Odisha
**వెబ్‌సైట్:** www.paradipport.gov.in

### నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 173
**పోస్టులు - ఖాళీలు:** అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
**అర్హత:** పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
**వయసు:** 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
**దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 25, 2017
**వెబ్‌సైట్:** www.niti.gov.in

## టీడీపీ సభ్యత్వ కార్డుల అందజేత

**కొడవలూరు:** మండలంలోని పెయ్యలపాళెం గ్రామంలో టీడీపీ సభ్యత్వ కార్డులను మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి కార్యకర్తలకు అంద జేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా నియోజక వర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు.అందుకు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసు లురెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. దీంతో ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఎక్కడకు వెళ్లినా అక్కడ ప్రజలు నీరాజనాలు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, శరత్, తదితరులు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్‌కు దూరంగా అర్చకులు

● సిబ్బందికే పరిమితం ● నేడు ఆలయ కమిటీ సమావేశం

**బుచ్చిరెడ్డిపాళెంరూరల్:** జొన్నవాడ ఆలయంలో అర్చకులు, సిబ్బంది విధులు సరిగా నిర్వహించడంలేదన్న ఆరోపణలతో సుమారు గత ఒకటిన్నర నెల క్రితం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ అలంకారప్రాయంగా మిగిలిపోతుంది. ఆదిలోనే బయోమెట్రిక్ విధానాన్ని కొంతమంది ఉద్యోగులు, అర్చకులు వ్యతిరేకించారు. మిరాశీ అర్చకులు మాత్రం తాము నిత్యం విధులు నిర్వహిస్తే మిరాశీ పొలాలలో వచ్చే ఆదాయంతో కుటుంబాలు పోషించుకోలే మని అప్పట్లో ఆలయ కమిటీకి వివరించారు. ఆలయంలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగ అర్చకులతో కలిపి మిరాశీ అర్చక స్వాములు వారి వారి వంతులను బట్టి విధులు నిర్వహించేలా పట్టికను తయారు చేసే పని అర్చకస్వాములకే అప్పగించగా స్వాములు మాత్రం కమిటీ నిర్ణయానికే అప్పజెప్పినట్లు తెలిసింది. ఈ తంతు జరిగి సుమారు రెండు నెలలు కావస్తున్నా బయోమెట్రిక్‌లో మాత్రం అర్చకస్వాములు వేలిపెట్టింది లేదు. సరిగా విధులు నిర్వహించడమూ లేదని పలువురు సిబ్బంది, భక్తుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా బయోమె ట్రిక్ విధానం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి నెల నిర్వహించాల్సిన ఆలయ కమిటీ సమావేశమే కరువైంది. దీంతో బయోమె ట్రిక్ విధానానికి సిబ్బందే పరిమితం అర్చకులు దూరం అన్నట్లు తయారైంది. ఈ విషయంపై ఆలయ కమిటీ చైర్మన్‌ను వివరణకోరగా మరో రెండుమూడు రోజుల్లో అందరూ బయోమెట్రిక్ విధానం పాటించేలా నిర్ణమముంటుందన్నారు.

**నేడు ఆలయ కమిటీ సమావేశం :** జొన్నవాడ ఆలయ కమిటీ సమావేశం నేడు జరగనుంది. ఈ సమావేశంలో ముఖ్యంగా బయోమెట్రిక్ విధానంపై చర్చించనున్నట్లు సమాచారం. అదే విధంగా నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే అర్చకులు, సిబ్బందితోపాటు హారతి కానుకలకు అడ్డ తగలుతున్న వైనంపై కూడా చర్చకు రానున్నట్లు తెలిసింది. ఆలయ ఆదాయానికి గండికొడుతున్న అర్చకులపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

# నాసిరకంగా కొమరిక కాలువ పనులు

**ఇందుకూరుపేట :** ఉన్న నాలుకకు మందెస్తే కొండ నాలుక పోయిందనే చందంలా ఇందుకూ రుపేట మండలంలో పెన్నా డెల్టా ఆధునికీకరణ పనులు ప్రజలను ఇబ్బందిపాలు చేస్తున్నాయి. మండ లంలోని కొమరిక గ్రామం వద్ద 1.6 కిమీ కాలువ పనులు నాసిరకంగా చేపడుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పాతికే ళ్ల పోరాడి కోటి 65లక్షలతో నిర్మిం చుకున్న రోడ్డు కూడా దెబ్బతినడం గ్రామస్థులను కలవర పరుస్తుంది. కొమరిక వద్ద 1.6 కిమీ రోడ్డు నెల్లూ రుకు చెందిన ప్రముఖ సంస్థకు కాంట్రాక్టు రాగా, వారు చేయ కుండా వెంచేడుకు చెందిన బినామీ కాంట్రాక్టరుకు అప్పగించారు. తూతూ మంత్రంగా నిర్మిస్తున్న కాలువ పనులతో గ్రామంలో నిర సన వ్యక్తమవుతుంది. దీనిపై మండల, జిల్లా అధికారులకు

**పట్టించుకోని అధికారులు**

ఫిర్యాదు చేశారు. కాలువ అడుగు భాగంలో కాంక్రీటు వేసే ముందు, రెండు లేదా మూడు అడుగుల గ్రావెల్‌ను చేస్తేనే కాంక్రీటు నిలబ డుతుంది. కానీ గ్రావెల్ వేయకుం డానే మట్టి, దుమ్ము, ధూళి, గడ్డి మీదనే కాంక్రీటు పోయడంతో పగుళ్లు పలకలుగా లేసి వస్తుందని గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారు. కాలువ పనులు ప్రస్తుతం ఉన్న రోడ్డు పక్కనే నిర్మాణం చేయడం, ఉన్న రోడ్డును కోత కోయడం, కాలు వ పనులు కాగానే కాంక్రీటుతో నింపకపోవడంతో సగం రోడ్డు కుంగిపోయే అవకాశం ఉంది. వచ్చేది వర్షాకాలం కాబట్టి రెండు జల్లులకు ఈ రోడ్డు నాశనమవు తుందని స్థానికులు వాపోతు న్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.1.65కోట్లతో నిర్మించుకున్న రోడ్డు దెబ్బతింటుందని మరోవైపు గ్రామస్థులు ఆందోళనలు వ్యక్తపరు స్తున్నారు. కొమరిక, తంగిరాల వారి కండ్రిగ, గంగపట్నంకు చెందిన ఈ రోడ్డు పాడైపోతుందని, దీంతో ఈ మూడు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

కాలువ రెండు వైపులా నిర్మించే గోడలు, రోడ్డు మీద నిర్మించే వంతెన కూడా నాసిరకంగా ఉందని బినామీలు ఇష్టానుసారం చేస్తున్నారని గ్రామస్థులు చెబు తున్నారన్నారు. ఒక్క సీజన్ దాటితే ఈ కాలువ పనికి రాదని, దిగువకు, గంగపట్నం చెరువుకు నీరు చేరే ప్రశ్నేలేదని, దీనిపై జిల్లా అధికా రులు, విజిలెన్స్ అధికారులు తక్షణం చర్యలు చేపట్టి శాశ్వత ప థకంగా నిర్మించాలని కోరుతు న్నారు.



అధ్వాన స్థితిలో రోడ్డు పనులు

**ఎంతకాలం ఉంటుందో..**



కాంట్రాక్టర్ల పనులు చూస్తుం టే రైతులు కోసం కాదు, కేవలం డబ్బు కోసమే. నాణ్యత లేదు, చేసి వెళ్లిపోదామనే ఆత్రుతే కనిపి స్తుంది. ఈ విషయంపై అధికారు లకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

- పి రామచంద్రనాయుడు

**రోడ్డు పాడైపోతుంది**



ప్రపంచ బ్యాంకు నిధులతో ని ర్మించిన రోడ్డుకు మరమ్మతులు లేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు వేయించుకున్న రోడ్డు కూడా పాడై పోతుంది. కాలువ పనులు అంత మాత్రమే.

- ఆర్ వెంకటేశ్వరరావు

**చర్యలు తీసుకుంటాం**

కాలువ పనులపై ఫిర్యాదులు అందాయి. రోడ్డు పనుల డిజైన్ కూడా మార్పిస్తాం. కాలువ పనుల నాణ్యతను కూడా పర్యవేక్షిస్తున్నాం. నాణ్యత లోపిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- విజయభాస్కర్ (ఇంజనీరు)

## 'విశ్వజననీ'లో అన్నదానం



అనాథలకు మిఠాయిలు పంచుతున్న పవన్ కుటుంబ సభ్యులు

**కొడవలూరు:** నార్తురాజుపాళెంలోని విశ్వజననీ అనాథాశ్రమంలో చిన్నారులకు అన్నదానం జరిగింది. విడవలూరు గ్రామానికి చెందిన గుమ్మడి రమేష్ కుమారుడు పవన్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం అనాథ పిల్లల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్స్, పండ్లు పంచిపెట్టారు. అనంతరం చిన్నారులకు విందుభోజనం వడ్డించారు. ఈ సందర్భంగా గుమ్మడి రమేష్ మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలు అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పుట్టిన రోజు వేడుకలు విలాసవంతంగా జరుపుకోవడం కంటే ఇలా అనాథ పిల్లల మధ్య జరుపుకుంటే ఆ పిల్లకు తల్లిదండ్రులు లేని లోటు కొంత వరకైనా తీర్చిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు గుర్రా శ్రీలక్ష్మీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు మద్యం దుకాణాలపై కేసుల నమోదు

**ఇందుకూరుపేట :** ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు మండలాలకు చెందిన ఐదు మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై ఆసిఫ్‌బేగ్ తెలిపారు. మంగళవారం ఆయా దుకాణాల్లోని సరుకు నిల్వలు, రికార్డులు అన్నింటిని తనిఖీ చేయగా ఐదు షాపుల్లో తేడాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ ఐదు దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# కోవూరులో అధ్యాపకుల ఆందోళన

**కోవూరు:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అధ్యాపకుల విషయమై 7వ వేతన సంఘం ఇచ్చిన నివేదికను వెంటనే బహిరంగ పరచి అమలుచేయాల్సిందిగా కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని వైకెఆర్‌అండ్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సందర్భంగా జీసీజీటీఏ యూనిట్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జయప్రసాద్ మాట్లాడుతూ జాతీయస్థాయి అధ్యాపక సంఘాల పిలుపు మేరకు ఆందోళన చేపట్టామన్నారు. యుజీసీ వేతనాలు పొందుతున్న లెక్చరర్లకు వేతన సంఘం నివేదిక ఆధారంగా జీతాలు చెల్లించాల్సిందిగా డిమాండు చేశారు. నివేదికను బహిరంగ పరచాల్సిందిగా



ఆందోళన చేస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

కోరారు. డిగ్రీ కళాశాల లెక్చరర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధు లకు హాజరయ్యారు.

## అగ్నిప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

**విడవలూరు:** అగ్నిప్రమాదాలు జరిగినపుడు పారిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని అగ్నిమాపక జిల్లా అధికారి జ్ఞానసుందరం అన్నారు. విడవలూరు లోని డిగ్రీకళాశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా ప్రాథమిక చర్యలు తీసుకోవాలన్నారు. నిప్పులు చెల రేగిన వెంటనే ఇంట్లోని కరెంటును ఆపటం, గ్యాస్ బండను బయటకు తీసుకురావడం, మంటల్లో చిక్కుకున్న వారిని త్వరితగతిన రక్షించడం చేయాలన్నారు. తదుపరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు నిర్లక్ష్యంగా ఉంటే మరింత నష్టం వాటిల్లే అవకాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరి, మనసేవాసంస్థ నిర్వాహ కులు శ్రీనివాసులురెడ్డి, యానాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రేపు లబ్ధిదారుల ఎంపిక

**కోవూరు:** వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణ సహాయం కోరుతూ దరఖాస్తు చేస్తున్న నిరుద్యోగులకు గురువారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాలిరెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు లబ్ధిదారుల్ని ఎంపిక చేయను న్నట్లు వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరగ నున్న ఎంపిక ప్రక్రియకు నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావాల్సిందిగా కోరారు.

**కొడవలూరు:** ప్రభుత్వ రుణాల కోసం దరఖాస్తులు చేసు కొన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ,కాపులకు ఈ నెల 24న తన కార్యా లయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో వసుంధర మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న 1,519 మంది 24వ తేదీ జరిగే ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని కోరారు.

## భారీగా రుణాలు మంజూరు

**ఇందుకూరుపేట :** పలు కార్పొరేషన్ ద్వారా భారీగా రు ణాలు మంజూరయ్యాయని, లబ్ధిదారుల ఎంపిక గురువారం చేయనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 72, ఎస్టీలకు 24, బీసీలకు 40, మైనార్టీలు 34, కాపులు 20, ఉప్పర కులానికి 15, బ్రాహ్మణులు 15, కల్లుగీత కులానికి 60 మంది లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు.

## భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ

**కోవూరు:** శ్రీ వరసిద్ధి వినాయక ఆల యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విఘ్నేశ్వరునికి పల్లకీసేవ, ప్రభాతసేవ, రుద్రాభిషేకపూజల్ని ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం రాఘవాచా ర్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయ కచవితి సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీ పాలతో అలంకరించారు. పూలంగిసేవ, పల్ల కీసేవ కార్యక్రమాల్ని అర్చకులు శ్రీకాంతాచా ర్యులు, శేఖర్ పూర్తిచేశారు. ఉభయకర్త లుగా ఎన్.రఘురామయ్య దంపతులు వ్యవ హరించారు.

## వరిలో బీజామృతంతో విత్తనశుద్ధి

**బుచ్చిరెడ్డిపాళెంరూరల్ :** బీజామృతం తో విత్తనశుద్ధి వలన చీడపీడలను కొంతమేర తట్టుకునే అవకాశముంటుందని నెల్లూరు రైతుశిక్షణకేంద్రం వ్యవసాయాధికా రిణి ఇందిరావతి రైతులకు తెలియజేసింది. మంగళవారం మండలంలోని జొన్నవాడ, శ్రీపురంధరపురం గ్రామాల్లో పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అజొల్లా వినియోగం, జీవన ఎరువులైన అజొటా బాక్టర్, అజోస్పైరిల్లమ్, మొదలైన వాటిని పశువుల పేడతో వాడే విధానం, తదితర అంశాలను రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డీపీఎం కార్యాలయం నుంచి డేవిడ్, బుచ్చిరెడ్డిపాళెం వ్యవసాయ విస్తరణాధికారి జి ఎస్‌కే. ఆశిమా, ఎంపీఈఓలు పర్వీన్, మాధురీ, వినోద, లక్ష్మీ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నేడు పోస్టల్ ఉద్యోగుల సమ్మె

**వింజమూరు:** ఏడో వేతన సంఘ సిఫార్సులు, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలంటూ బుధవారం ఒక్క రోజు సమ్మెకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చిం దీంతో ఒక్కరోజు తపాలా సేవలు నిలిచిపోనున్నాయి.

## డీడీలు సకాలంలో చెల్లించాలి

**సీతారామపురం:** డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలని తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లతో సమీక్షించారు. ఈపాస్ యంత్రాలు సక్రమంగా వినియోగించాలని,. తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



బినామీ మస్టర్

# అవినీతికి ఉపాధి!

- నకిలీ కూలీలు, బినామీ మస్టర్లు ● అవసరం లేకున్నా పనులు
- బినామీలు, సిబ్బంది 30:70 స్వాహా
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

**ఉదయగిరి రూరల్:** పేదలకు ఉపాధి కల్పించి వలసలు నివారించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి కాసులు వర్షం కురిపిస్తోంది. పనులకు రాని వారి పేర్లతో మస్టర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్న విషయం సంబంధిత అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### బినామీ మస్టర్ల జోరు

ఉదయగిరి నియోజకవర్గంలో పలువురు ఉపాధి నిమిత్తం హైదరాబాదు, గోవా, విజయవాడ, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లారు. వీరి పేర్లతో ఉపాధి సిబ్బంది మస్టర్లు వేస్తూ నిధులు స్వాహా చేస్తున్నారన్న విమర్శలు అధికంగా ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించేవారు, వృద్ధ మహిళలు, ఇతర పనులు చేసుకుంటూ ఉపాధి పనులపై కన్నెత్తి చూడని వారి పేర్లు కూడా మస్టర్లలో ప్రత్యక్షమవుతున్నాయి కూలీలు ఆరోపిస్తున్నారు. వీరి పేర్లతో బిల్లులు చేసుకుని అందు లో 30 శాతం ఆయా వ్యక్తులకు ఇచ్చి, మిగతా మొత్తం సిబ్బంది స్వాహా చేస్తున్నారని అంటున్నారు. ఉదయగిరి మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు సుమారు 200 మందికి బినామీ మస్టర్లు వేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై పలుమార్లు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకొన్న దాఖలాలు లేవు. గతంలో పోస్టాఫీసులో కూలి మొత్తం జమ అవుతుండడంతో, బినామీ మస్టర్ల వ్యవహారం బహిర్గతమయ్యేది. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో , బినామీ మస్టర్ల వ్యవహారం జోరుగా సాగుతోంది. పని చేయకున్నా మస్టర్లు వేయడం కారణంగా, తమకు అందాల్సిన కూలి తగ్గిపోతోందని కూలీలు సిబ్బందితో వాగ్వాదానికి దిగిన సందర్భాలున్నాయి. మరి కొన్ని సార్లు పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేస్తున్నట్లు తెలిసింది.

### కొరవడిన పర్యవేక్షణ

ఉపాధి పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవుతున్నారు. కూలీలు చేసిన పనులు గుర్తించి, కొలతలు, మస్టర్లు తనిఖీలు చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడడంలేదు. మస్టర్లలో హాజరు, కొలతలు అన్నీ కిందిస్థాయి సిబ్బందే పూర్తి చేసి, వారానికోసారి కార్యాలయానికి అందజేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిధులు స్వాహా చేస్తున్నారు.

### విచారించి చర్యలు తీసుకుంటాం

సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి బినామీ మస్టర్లపై విచారణ చేస్తాం. వాస్తవమని తేలితే చర్యలు తీసుకొంటాం.

- శ్రీహరిరెడ్డి, ఏపీడీ

### అవసరం లేకున్నా పనులు

మండల పరిధిలోని నేలటూరు పిల్లాపేరు వాగు పైభాగంలో ఉన్న ఇసుకదిబ్బలో కూలీలు నీటికుంట తవ్వుతున్నారు. దీని వల్ల ఏ ఉపయోగం ఉందో అధికారులకే తెలియాలని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రతిఒక్కరికి పని కల్పించడంతోపాటు, కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిని వేధిస్తుండడంతో అవసరం లేకున్నా, ఎలాంటి ఉపయోగం లేని పనులు సైతం చేపడుతున్నారు. చేసిన పనులే అరకొరగా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.



వాగులోని ఇసుకలో తవ్వుతున్న నీటికుంట

● ఇంటర్వ్యూ



## ఎంఆర్ వ్యాక్సినేషన్ లక్ష్య సాధనకు కృషి

**మంజులమ్మ, వైద్యాధికారిణి**

**?. ఎంఆర్ వ్యాక్సిన్ లక్ష్యం చేరుకున్నారా.**

!. మండలంలో 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు 8,157 మంది ఉన్నారు. 6,617 మందికి వ్యాక్సిన్ వేశాం. ఇంకా 1900 మందికి వేయాల్సి ఉంది. సెప్టెంబర్ 8వ తేదీలోపు లక్ష్యం పూర్తి చేస్తాం.

**?. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా.**

!. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతోపాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం

**?. సిబ్బంది కొరత ఉందా.**

!.గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అరకొర సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నాం.

- ఉదయగిరి

## రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

**ఉదయగిరి రూరల్:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకొన్న వారికి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈవో ఎల్.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

## రేపు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

**వింజమూరు:** కర్నూలులో ఇటీవల కట్టమంచి పాఠశాలలో జరిగిన దౌర్జన్యానికి నిరసనగా గురువారం ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నేతలు తెలిపారు. మంగళవారం స్థానిక రవి పాఠశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేసి బంద్‌కు మద్దతుగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రవి పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలో గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులను పరామర్శించడానికి వెళ్లిన రాష్ట్ర నాయకులు పుల్లయ్య, శ్రీనివాసులరెడ్డిలపై విద్యార్థి సంఘాల ముసుగులో కొన్ని అసాంఘిక శక్తులు దాడి చేశాయన్నారు. విద్యాసంస్థలను దౌర్జన్యంగా మూయించడం, బలవంతపు చందాలు వసూలు చేయడం, పాఠశాల ఆస్తులకు నష్టం కలిగించడంలాంటి సంఘటనలతో నిర్వాహకులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇందుకు నిరసనగా గురువారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ రత్నం, ఎం.గోపాల్‌రెడ్డి, ఐజాక్, మహేష్, బ్రహ్మానందారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## చిరంజీవి జన్మదిన వేడుకలు

**వింజమూరు:** మెగాస్టార్ చిరంజీవి 63వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనంలో చిరు అభిమాన సంఘ సభ్యుడు డేగా మధుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూర్జహాన్, కె.కిశోర్, నవీన్, జీ.శ్రీనివాసులు, సీహెచ్ శేషు, భాగ్యలక్ష్మి, దొరబాబు తదితరులున్నారు.

## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

**ఉదయగిరి రూరల్:** సస్యరక్షణ చర్యలు చేపడితే, పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ సూచించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కుర్రపల్లి, నేలటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సజ్జ, ప్రొద్దుతిరుగుడు పంటలను పరిశీలించారు. సజ్జ పంటకు ఎకరాకు 50 కిలోల యూరియా వేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. పొద్దుతిరుగుడు పంటలో పచ్చపురుగు నివారణకు థయోడికార్డ్ ఒక గ్రాము ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈవో రాజారెడ్డి, ఎంపీఈవో చైతన్య, రైతులు తదితరులున్నారు.

## పేదల చెంతకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

**వింజమూరు:** కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలను గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో డాక్టర్ కె.మాశిలామణి తన వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చిన్న పిల్లల్లో గుండె, మూత్రపిండ వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందచేశారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా అపోలో ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారన్నారు. ఈ సందర్భంగా మాశిలామణి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించేందకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఢిల్లీ నుంచి డాక్టర్ దీపక్‌ఠాకూర్, జమ్ముకాశ్మీర్ నుంచి డాక్టర్ ఐనీ, అపోలో వైద్యులు మహేష్‌బాబు, రాజ్‌కుమార్‌లు రోగులు పరీక్షలు నిర్వహించారు. .



చిన్నారికి స్కానింగ్ చేస్తున్న వైద్యులు

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె



వింజమూరు: నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

**వింజమూరు:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు స్థానిక ఎస్‌బీఐ సిబ్బంది మంగళవారం విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీన ప్రక్రియ ఉపసంహరణ, జీఎస్టీ పేరుతో సేవల పెంపును నిరసించారు. పన్ను ఎగవేతదారులను నేరస్థులుగా ప్రకటించడం, ఎన్‌పీఏ వసూళ్లకు పార్లమెంటరీ కమిటీ సూచించిన సిఫార్సులను అమలు చేయడం, బ్యాంకు సిబ్బంది పెంపుతదితర డిమాండ్ల పరిష్కారానికై సమ్మె చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.రజనీకాంతారావు, అనూరాధ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** పట్టణంలోని స్టేట్ బ్యాంక్, సిండికేట్ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

## గుడినరవలో వైద్యశిబిరం

**ఉదయగిరి రూరల్:** గుడినరవ గ్రామంలో మంగళవారం గండిపాళెం వైద్యాధికారిణి మంజులమ్మ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వర పీడితుల నుంచి రక్తపూతలు సేకరించి, మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు

## ఉపాధ్యాయులకు సన్మానం

**వరికుంటపాడు:** దక్కనూరు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీ అయిన ఎం.సుబ్బారావు, శ్రీనివాసులను మంగళవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి వారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు హరిశ్చంద్ర, వెంగళరావు, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హజరత్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో గిట్టుబాటు ధర

**దుత్తలూరు:** రైతులు పండించిన పంటలను ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా విక్రయించుకుంటే గిట్టుబాటు ధరలు వస్తాయని నాబార్డు ఏజీఎం రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కాయధాన్యాల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన పంటలను ఆన్‌లైన్‌లో ధరలను గుర్తించి విక్రయించుకుంటే గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు. రైతులు సమష్టి కృషితో ఉత్పత్తిదారు సంఘాలుగా ఏర్పడి వ్యవసాయం చేస్తే మార్కెట్‌లో రైతులు మోసపోకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఎంపీడీవో నరసింహారావు, నాబార్డు అధికారులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రవికుమార్, దుత్తలూరు రైతు సంఘం అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు. .

# దినఫలాలు

## అదృష్టసంఖ్యలు: 5, 7

**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** విందు వినోదాలు, వేడుకలకు ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆరోగ్యం, ఆహార విషయాలపై శ్రద్ధ చూపించాలి. రిటైల్, హోటల్, వైద్య రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** చిన్నారులు, ప్రియతములతో ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొంటారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. పెట్టుబడుల్లో నిదానం అవసరం. లాభిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

**మిథునరాశి: (మే21-జూన్21):** ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. రియల్ ఎస్టేట్, రిటైల్, గృహనిర్మాణ రంగాలు పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది.

**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** సోదరీ సోదరులు, బంధుమిత్రులను కలుసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాల్లో కొంత అసౌకర్యానికి గురవుతారు. ఒక సమాచారం కలవరపెడుతుంది. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు.

**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పెట్టుబడుకు సంబంధించిన నిర్ణయాలు వాయిదా వేయండి. షాపింగ్‌లో వస్తువుల నాణ్యత గమనించండి.

**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. వ్యక్తిగత అవసరాల కోసం ఖర్చు చేస్తారు. కీలక నిర్ణయాలు వాయిదా వేయండి. మీ నిర్ణయాలను సమీక్షించుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.

**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రయాణాల్లో చికాకులు తప్పకపోవచ్చు. సినీ రాజకీయ రంగాలవారికి ప్రోత్సాహకరం.

**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. బృంద కార్యక్రమాల్లో అసౌకర్యానికి గురవుతారు. స్నేహితులు, ప్రియతముల కోసం ఖర్చులు అధికం.

**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ మర్యాదలకు భంగం కలిగే అవకాశంఉంది. కుటుంబ పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** సమావేశాలు, బృందకార్యక్రమాలు, వేడుకల్లో పాల్గొంటారు. ప్రయాణాలు,చర్చలు సత్ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఒక సమాచారం ఆందోళన కలిగిస్తుంది. న్యాయ,బోధన, కన్సల్టెన్సీ రంగాల వారికి శుభప్రదం.

**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మనసును ఏదో వెలితి వెంటాడుతుంది. పూజలు, వేడుకలు, సంస్మరణల్లో పాల్గొంటారు. క్రయవిక్రయాలలో నాణ్యత గమనించండి.

**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** బంధుమిత్రులతో వేడుకలు, విందుల్లో పాల్గొంటారు. కొత్త పరిచయాలు లాభిస్తాయి. సాహస ప్రయత్నాలకు, పందాలకు అనుకూల సమయం కాదు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

**-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ**

## నేడు తపాలా ఉద్యోగుల సమ్మె

**నెల్లూరు (సాంస్కృతికం) :** దేశవ్యాప్తంగా బుధవారం జరిగే సమ్మెలో తపాలా ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ డివిజన్ నాయకులు ఏవీ కృష్ణయ్య, సీహెచ్ వెంకయ్య, వీ సంపత్‌కుమార్‌లు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. తపాలా శాఖలోని జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, జీడీఎస్ కమిటీ నివేదికలోని సానుకూల అంశాలను తక్షణం అమలు చేయాలని గత మార్చి 16 నుంచి దశల వారీ పోరాటాలు చేస్తున్నామని అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. తపాలా శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని , కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి, పాత విధానం అమలు చేయాలని, కాజువల్ కంటిజెంట్, పార్ట్‌టైం ఉద్యోగుల వేతనాలు 6, 7వ వేతన సవరణల ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

## టంగుటూరి ప్రకాశం జయంతి..

**నెల్లూరు (సాంస్కృతికం):** ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం నిర్వహించనున్నట్లు నగర కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు ఏసీ మార్కెట్‌కి ఎదురుగా ఉన్న పంతులు విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొంటారని తెలిపారు. ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందుకు జిల్లాలోని బ్రా హ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. నగరంలో ఆయన విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమానికి నగరంలోని బ్రాహ్మణులంతా తరలి రావాలని సమాఖ్య నాయకులు వాసుదేవరావు, కామేశ్వర ప్రసాద్‌లు కోరారు.

## ప్రిన్సిపాళ్ల సమావేశం..

**నెల్లూరు (క్యాంపస్) :** జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు బుధవారం నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో సమావేశం నిర్వహిస్తున్నామని ఆర్‌ఐవో బాబూజాకబ్ ఒక ప్రకటనలో తెలిపారు. జ్ఞానభూమి, ఆన్‌లైన్ అడ్మిషన్లు వంటి వాటిపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఉదయం 10గంటలకల్లా డీకేడబ్ల్యూ కళాశాలకు హాజరుకావాలని కోరారు.

## డీఎఫ్‌వోగా రామ్మోహన్‌రావు

**నెల్లూరు (వెంకటేశ్వరపురం):** అటవీ శాఖ జిల్లా అధికారిగా (డీఎఫ్‌వో) ఐఎఫ్ఎస్ అధికారి పీ రామ్మోహన్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఒంగోలు సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వో బాషా ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా ఉంటున్నారు. కొద్దకాలంగా ఖాళీగా ఉన్న జిల్లా అటవీ శాఖ అధికారి పోస్టుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలువురు సీనియర్లు పోటీ పడ్డారు. ఎట్టకేలకు రామ్మోహన్‌రావును నియమించారు. ఈయన ప్రస్తుతం గుంటూరు సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వోగా పని చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

## ఏపీపీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ సురేష్‌బాబు



**నెల్లూరు (వైద్యం) :** ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెల్లూరుకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సురేష్‌బాబు ఎంపికయ్యారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మంగళవారం ఈ ఎంపికను ప్రకటించారు. ఈనెల 21వ తేదీన విజయవాడలో జరిగిన సైకాలజిస్టు ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ సురేష్‌బాబును నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ఆత్యహత్య ధోరణి, వ్యసనాలు, మూఢనమ్మకాల నివారణ; మానసిక వ్యసనాలు, చెడు అలవాట్ల నుంచి విముక్తికి, పాఠశాల, కళాశాలల్లో స్టడీ స్కిల్స్, బిహేవియర్ మాడిఫికేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, విద్యాసంస్థల్లోనూ తగిన శిక్షణను ఇచ్చామన్నారు. సమాజంలో మార్పు కోసం, వ్యక్తి చైతన్యం కోసం చేసిన కృషి ఫలితంగా తనను ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు (వేదాయపాళెం) :** జిల్లాలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అందించే ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్ ద్వారా మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈడీ కే నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం 1-10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ చేసి, ఆ కాపీలను పాఠశాలలో సమర్పించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ చేసి, సదరు కాపీలను కళాశాలల్లో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ ఉపకార వేతనాల కోసం www.scholarsipps.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98499 01154, 90007 74858 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# నీరు-ప్రగతికి రూ.418 కోట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

**నెల్లూరు(కలెక్టరేట్):** నీరు-ప్రగతి పథకం కింద 3,765 పనులకు రూ.418 కోట్లతో అనుమతించామని, ఈ పనులన్నింటిని సెప్టెంబరు ఆఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండలాల వారీగా, కేటగిరీ వారీగా ఈ పనుల వివరాలు సిద్ధం చేయాలన్నారు. ఈ పనుల పురోగతిపై నాలుగు రోజులలో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. పనులు నిబంధనల మేరకు ఉండాలన్నారు. అలా చేపట్టని పనులు వెంటనే రద్దుచేయాలన్నారు. ఇక మీదట పనులు ప్రతి పాదించే సమయంలో వాటి ఆవశ్యకత పరిశీలించిన తరువాత మాత్రమే అనుమతి మంజూరుకు సమర్పించాలన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు కాలువల మిగిలిపోయిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్‌కు భూసేకరణ పూర్తి చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు ఉత్తర కాలువ, కావలి కాలువ పనులు, వాటి భూసేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీ, కండలేరు ఎడమకాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు.

ఆక్రమణలకు గురైన డాటెడ్ ల్యాండ్స్ క్రమబద్ధీకరణకు గ్రామీణ ప్రాంతాలలో టాంటాం వేయించాలని కోరారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను రికార్డు చేయాలన్నారు. ఈ సమావేశంలో గంగ స్పెషల్ కలెక్టర్ పీ ప్రశాంతి, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్‌రావు, డిప్యూటీ ఎస్ఈ వీరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రేపు విద్యా సంస్థల బంద్ : అపస్మా



మాట్లాడుతున్న అపస్మా జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

**నెల్లూరు (క్యాంపస్) :** విద్యార్థి సంఘాల ముసుగులో కొన్ని అసాంఘిక శక్తులు విద్యా సంస్థల ప్రశాంతతకు భద్రతకు భంగం కలిగిస్తున్నారని, ఇలాంటి వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యా సంస్థలను బంద్ చేస్తున్నామని అపస్మా అధ్యక్షుడు బీ మనోహర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని అపస్మా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. కర్నూలులోని ఓ పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా వారి తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైద్యశాలకు వెళ్లిన రాష్ట్ర అసోసియేషన్ నాయకులపై దాడి చేయడం, అపస్మా రాష్ట్ర కార్యదర్శి జీ పుల్లయ్య కారును ధ్వంసం చేసి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిపై విద్యార్థి సంఘం నాయకులు హత్యాయత్నం చేశారన్నారు. ఈ చర్యలకు నిరసనగా రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా విద్యా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని విద్యా సంస్థలను 24వ తేదీ మూసివేస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 9గంటలకు నెల్లూరులోని ఏబీఎం కాంపౌండ్ నుంచి ఐదువేల మంది విద్యార్థులతో డీఈవో కార్యాలయం వరకు ర్యాలీ చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీ అనంతరం విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందిస్తామన్నారు. కర్నూలులో హత్యాయత్నం చేసిన ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ, ఎస్టీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ.సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి వై.వెంకటరామయ్య, నగరాధ్యక్షుడు సౌరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

| | | |
|---|---|---|
| గ్రాము ధర | - | 2,778 |
| సవర (8 గ్రాములు) | - | 22,224 |
| వెండి కిలో ధర | - | 42,000 |
| వెండి గ్రాము ధర | - | 42.00 |

### చికెన్ ధరలు

**వెన్‌కాబ్..**

| | |
|---|---|
| బాయిలర్ రైతు ధర | 84 |
| లేయర్ | 82 |
| స్కిన్ చికెన్ | 139 |
| స్కిన్‌లెస్ చికెన్ | 163 |
| లేయర్ మాంసం | 140 |

**నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..**

| | |
|---|---|
| బాయిలర్ లైవ్ | 92 |
| లేయర్ లైవ్ | 82 |
| స్కిన్ చికెన్ | 152 |
| స్కిన్‌లెస్ | 178 |
| లేయర్ | 140 |

### నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,500 నుంచి రూ. 3,200 వరకు

పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,000 వరకు

### జలాశయాల్లో నీటిమట్టాలు

**సోమశిల**

| | |
|---|---|
| పూర్తి సామర్థ్యం: | 78 టీఎంసీలు |
| ప్రస్తుత నీటినిల్వ: | 6.283 టీఎంసీలు |
| ఇన్‌ఫ్లో : | ------------ |
| అవుట్‌ఫ్లో : | 50 క్యూసెక్కులు |
| ఆవిరి : | 45 క్యూసెక్కులు |

**సంగం ఆనకట్ట**

| | |
|---|---|
| నీటిమట్టం : | ------------- |
| కనిగిరికాలువ : | ------------- |
| ఎడమ కాలువ : | ------------- |
| కనుపూరు కాలువ: | ------------- |
| బీపీఆర్ కాలువ : | ------------ |
| నెల్లూరుచెరువుకాలువ : | ----------- |

## సూక్తి

మనకోసం చేసే పని మనతోనే అంతరించిపోతుంది. పరుల కోసం చేసేది శాశ్వతంగా నిలుస్తుంది.

## జంబ్లింగ్ వర్డ్స్

1. LMIK ▸ ..................
2. DYUT ▸ ..................
3. ALTS ▸ ..................
4 RCKO ▸ ..................

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

## ఔనా!

2007లో ఓ గూఢచర్యం కేసులో 14 ఉడతలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు.



# పాండాలకు ఓ ఆసుపత్రి



నలుపు, తెలుపు రంగుల్లో ముద్దుగా కనిపించే పాండాలంటే.. చాలామందికి ఇష్టం. పాండాలను అంతరించిపోతున్న జాతులలో ఒకటిగా గుర్తించారు. వీటిని పరిరక్షించడానికి పర్యావరణవేత్తలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే 'చైనా కన్జర్వేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ది గెయింట్ పాండా (సీసీఆర్‌సీజీపీ) పనిచేస్తుంది. రోజు రోజుకీ తగ్గిపోతున్న పాండాల సంఖ్యను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైనా ప్రభుత్వం 'డుజియాంగ్యాన్' నగరంలో పాండాల కోసమే ప్రత్యేకంగా ఓ ఆసుపత్రిని 2012లో ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే తొలి పాండా ఆసుపత్రి.

జలుబు చేసినా.. జ్వరం వచ్చినా.. డాక్టరు దగ్గరకు వెళుతుంటాం. మరి పాండాలకు జబ్బు చేస్తే? అనారోగ్యంతో అవి బాధపడుతుంటే? అందుకే వాటికోసం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రి ఉంది. అందులో పాండాలను ఎంతో బాధ్యతగా చూసుకుంటారు. ప్రతి రోజూ హెల్త్ చెకప్‌లు చేస్తారు.. మంచి భోజనాన్ని అందిస్తారు. ఇది పాండాల పునరావాస కేంద్రం కూడా. అంతేకాదు ఇక్కడ పాండాలపై పరిశోధనలు చేస్తారు.

పాండాలపై పరిశోధన చేసిన తొమ్మిదిమంది వైద్యులు ఈ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఈ వైద్య బృందం పాండాలకి ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. పాండాలు వ్యాధుల భారినా పడితే తక్షణమే వాటికి వైద్యం చేస్తారు. పాండాల సంతతిని అభివృద్ధి చెందేలా ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తారు. అత్యున్నత సాంకేతిక వ్యవస్థ ఈ ఆసుపత్రిలో ఉంది. ఇది కేవలం పాండాల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఆసుపత్రి మాత్రమే కాదు ఇది పాండాల ఉనికిని కాపాడే సంస్థగా కూడా పనిచేస్తుంది. ఈ ఆసుపత్రిలో మొత్తం 33 పాండాలు ఉన్నాయి. 'పాన్ పాన్' అనే పాండా అన్నింటికన్నా వయసులో పెద్దది. దాని వయసు 33 సంవత్సరాలు. పాండాల కోసం ఈ ఆసుపత్రి చేసిన కృషి వల్లే పాండాల సంఖ్య 17 శాతానికి పెరిగింది.

- పాండాల కోసం క్యారెట్లు, పాలు, కార్న్ బ్రెడ్ వంటి ఆహారపదార్థాల్ని అందిస్తారు.
- మనుషులతో ఎలా ప్రవర్తించాలో పాండాలకు చక్కగా నేర్పుతారు.
- అడవుల్లో ఒంటిరిగా సంచరించే పాండాలను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కష్టాల్లో పడిన పాండాలను ఆసుపత్రికి తీసుకువచ్చి వాటిని సంరక్షిస్తారు.
- పాండాలకి ఇష్టమైన ఆహారం వెదురు చెట్లని తెలుసు కదా. పాండాల ఆహారం కోసమే ఆసుపత్రి యజమాన్యం వేల వెదురు చెట్లను పెంచుతుంది. పాండాలు హాయిగా అందులో విహరిస్తాయి. చక్కగా ఆడుకుంటాయి.



### మీకు తెలుసా

- పాండా బరువు 100 నుంచి 120 కేజీల మధ్యలో ఉంటుంది.
- వీటి సగటు వయస్సు 20 సంవత్సరాలు.
- ఇప్పటి వరకూ 'బసి' అనే పాండా గరిష్ఠంగా 37 సంవత్సరాలు జీవించింది.
- పాండాలు తమ పిల్లలకి పాలిచ్చి పెంచుతాయి.
- ప్రపంచ వ్యాప్తంగా 1,864 పాండాలు మాత్రమే ఉన్నాయి.

## పదాలు కనుక్కోండి

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| F | I | E | L | K | C | U | S | Y | E | N | O | H |
| N | P | B | C | A | G | Z | Q | T | T | P | F | Y |
| G | B | N | L | R | Z | I | Q | D | A | I | S | Y |
| P | O | I | F | G | O | Y | T | E | L | O | I | V |
| R | L | G | D | I | H | C | R | O | L | J | B | Q |
| H | E | A | E | L | Q | B | U | G | X | I | B | X |
| H | Y | W | V | R | O | V | Q | S | Q | Y | L | I |
| Q | S | F | O | E | A | G | M | P | F | S | Y | Y |
| U | L | U | S | L | N | N | I | R | Q | N | X | A |
| M | R | Q | W | X | F | D | I | R | O | A | C | S |
| L | T | U | L | I | P | N | E | U | A | P | E | T |
| C | K | V | C | E | X | S | U | R | M | M | X | E |
| D | A | F | F | O | D | I | L | S | D | M | S | R |

ASTER, CROCUS, DAFFODIL, DAISY, GERANIUM, HONEYSUCKLE, LAVENDER, LILAC, LILY, MARIGOLD, ORCHID, PANSY, SUNFLOWER, TULIP, VIOLET

## దారి కనుక్కోండి



## మీకు తెలుసా?



మీరు చంద్రుడి పైకి వెళితే.. మీరు మీ బరువులో 16.5 శాతమే ఉంటారు.

## టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

## చెప్పగలరా?

మందులో ఉన్నా
కానీ మందులో లేను
దాతలో ఉన్నా
కానీ పీతలో లేను
రంగులో ఉన్నా
కానీ చెంగులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

## జంతర్‌మంతర్

1. వృభవిత్తు ▸ ..................
2. మాణంరాయ ▸ ..................
3. వృఅభిద్ధి ▸ ..................
4. సంవరంత్స ▸ ..................


## నవ్వుల్ నవ్వుల్

టీచర్ : కోడి మాంసాహారా? శాకాహారా?
బిట్టు : మాంసాహారికి ఆహారం టీచర్ !
టీచర్ : !!!!!!!!

## జవాబులు

చెప్పగలరా? :
మందారం
జంతర్‌మంతర్ :
1. భవిష్యత్తు
2. రామాయణం
3. అభివృద్ధి
4. సంవత్సరం
జంబ్లింగ్ వర్డ్స్ :
1. MILK
2. DUTY
3. SALT
4 ROCK

## బొమ్మ గీయండి




## రంగులు వేయండి



# ఆశ్వారూఢుడైన వెంకయ్యస్వామి

**వెంకటాచలం:** ఆరాధనోత్సవాల్లో భాగంగా వెంకయ్యస్వామి అశ్వవాహన రూఢుడై మంగళవారం ఉదయం గొలగమూడి గ్రామంలో విహరించారు. నిత్య పూజలతో పాటు ఉదయం 9 గంటలకు అశ్వవాహనసేవ ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. మనిషి కోరికల గుర్రాలకు కళ్లెం వేయాలన్న సంకేతాన్ని ఇస్తూ తన స్వామి వారు అశ్వవాహనం అధిరోహించి వామన హస్తంతో గుర్రం కళ్లాలను చేబూనారు. నేనుండగా మీకు చింత ఏల అన్నట్లుగా దక్షిణ హస్తం పైకెత్తి భక్తులను ఆశీర్వదిస్తూ చిరుదరహాసంతో గ్రామంలో ఊరేగారు. భజన బృందాలు, కోలాటాలు, పలు రకాలు వాయిద్యాలు స్వామిని కీర్తిస్తూ ముందు సాగాయి. ఈ సేవకు ఉభయకర్తలుగా వేమూరు కిషోర్‌కుమార్, గుదె శ్రీధర్ వ్యవహరించారు.

## పెదశేష వాహన సేవ

మంగళవారం రాత్రి అవధూత వెంకయ్యస్వామికి పెదశేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కర్పూర నీరాజనాలు అందించి తీర్థ ప్రసాదాలను స్వీకరిచారు. ఈ వాహన సేవకు ముత్తుకూరు వాసి ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, సుప్రియ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భవానీ బాయి భాగవతారిణి భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర గానంచేసి అలరించారు. బాలాజీ నాట్యమండలి వారు పలు పౌరాణిక నాటక ఘట్టాలు ప్రదర్శించారు.

## ఉత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సింహవాహనసేవ నిర్వహిస్తామని ఈ సేవకు కాకుటూరు సూర్య ప్రతాప్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరిస్తారని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. రాత్రికి గరుడవాహనసేవ ఉంటుందని ఈ సేవకు బీవీ లక్ష్మి ఉభయకర్తగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు.



అశ్వవాహనంపై కొలువైన వెంకయ్య స్వామి



స్వామి సమాధి మందిరానికి విశేష అలంకారం



వాహన సేవ ముందు భజన చేస్తున్న భక్తులు

# సేంద్రియ ఎరువులతోనే లాభసాటి వ్యవసాయం

● జిల్లా కోఆర్డినేటర్ సరళ

**కావలిరూరల్:** సేంద్రియ ఎరువులతోనే రైతులు లాభసాటి వ్యవసాయం చేయవచ్చని సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ జిల్లా కోర్డినేటర్ సరళ పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం రాజువారిచింతలపాలెంలో సర్పంచు గుంటూరు మల్లికార్జున అధ్యక్షతన మంగళవారం చెత్త నుంచి సంపద తయారీపై కావలి, కలిగిరి, జలదంకి, కొండాపురం మండలాల అధికారులకు, నాయకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. డివిజనల్ పంచాయతీ అధికారి ఎన్ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణారావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వర్మికంపోస్టు ఎరువుతో పండించిన పంటలతో అధిక దిగుబడితో నాణ్యమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటికి మూడు రీసోర్స్ సెంటర్లు ఉన్నాయని కొత్తగా ఏడు ఏర్పాట్లు చేసి చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్పంచు మల్లికార్జున మాట్లాడుతూ 2015లో చెత్త నుంచి సంపద తయారీ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, దీనిని పంచాయతీలు ఆదాయ వనరులుగా మార్చుకోవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలను 100 శాతం సద్వినియోగపర్చుకొవడంతో ఆర్సీపాలెం మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా నిలిచిందన్నారు. అనంతరం వర్మి కంపోస్టు బెడ్ తయారీ, చెత్త నుంచి ఎరువు తయారీ విధానం, సేంద్రియ ఎరువుల వాడకాన్ని వివరిస్తూ ఆ ఎరువుతో పండించిన పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలదంకి, కలిగిరి, కొండాపురం తహసీల్దార్ జాన్ ప్రభాకర్, ప్రసాద్, ప్రమీల, కావలి, జలదంకి, కొండాపురం ఎంపీడీవోలు ఎల్. జ్యోతి, రవీంద్ర, నాగరాజకుమారి, లింకు అధికారి ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ఆదినారాయణ, అన్ని అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సేంద్రియ ఎరువులతో శ్రీవరి సాగువిధానాన్ని వివరిస్తున్న సర్పంచు మల్లికార్జున

## రేపు న్యాయవాదుల
# కోర్టు విధులు బహిష్కరణ

**నెల్లూరు(లీగల్):** రాష్ట్ర హైకోర్టు కేసుల విషయమై 2012లో ఇచ్చిన సర్క్యులర్‌ను పునః సమీక్షించాలని రాష్ట్రంలోని 13 జిల్లాల బార్ ప్రెసిడెంట్లు (జేఏసీ) ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 24తేదీన కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ పధాన కార్యదర్శి రోజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అత్యవసరంగా సమావేశమైన బార్ అసోసియేషన్ కమిటీ విధులను బహిష్కరించాలని తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. న్యాయవాదులందరూ 24వ తేదీన కోర్టు విధులను బహిష్కరించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయ దినోత్సవాన్ని
# ఘనంగా నిర్వహించాలి

● ఎంఈవోలతో డీఈవో రామలింగం సమీక్ష

**నెల్లూరు(కలెక్టరేట్):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని సెప్టెంబరు 5న జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం ఎంఈవోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ సమావేశ మందిరంలో ఎంఈవోలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవానికి ఉత్తమ ఉపాధ్యాయులను మండలానికి ఇద్దరిని ఎంపిక చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుకు సంబంధించి 3,250 ప్రధానోపాధ్యాయుల నిధుల నుంచి గ్యాస్ కనెక్షన్లను ఏర్పాటు చేయాలన్నారు. డీఈవో పూల్‌లోని ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో నియమిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల రద్దీని బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామలింగం

# విజయ గణపతిగా సంకట హరగణపతి

**నెల్లూరు,(సాంస్కృతికం):** నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేట ఎన్‌డీఆర్‌లేఅవుట్‌లోని శ్రీబాల సమేత సంకటహరగణపతి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి విజయగణపతి అలంకారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, అలంకార దర్శనం పూజలు నిర్వహించారు. సాయంత్రం మూలవర్లకు ప్రత్యేక పుష్పాలంకారం, ఉత్సవమూర్తికి అలంకారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయదాతలుగా చిన్ని వెంకటశేషయ్య, వెంకట రాజేంద్ర ప్రసాద్, చిన్నిమస్తాన్, దంపతులు వ్యవహరించారు. మాజీ కార్పొరేటర్ సాయిలలిత, ఎన్‌డీఆర్‌లేఅవుట్ మిత్ర మండలి సభ్యులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

## కన్నుల పండువగా లక్ష్మీగణపతి అలంకారం

నవాబుపేట బీవీఎస్ స్కూల్ సెంటర్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి లక్ష్మీ గణపతి అలంకారం జరిగింది. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అలంకారం పూజలు, సాయంత్రం మూలవరులకు విశేష పూలంగిసేవ, ఉత్సవమూర్తికి అలంకారం, ఊంజల్‌సేవలు జరిగాయి. ఉభయదాతలుగా ప్రసన్నలక్ష్మి, రాజా నాగేంద్ర, శిరీష, మంజునాథ్, సుప్రియ వ్యవహరించారు.



వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో లక్ష్మీ గణపతి అలంకారం



ఎన్‌డీఆర్‌లేఅవుట్‌లోని సంకటహరణ ఆలయంలో అలంకారం

## నేడు కల్యాణం

వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం 10వ కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకుడు బైరిపోగు బుజ్జయ్య తెలిపారు. ఈ కల్యాణోత్సవానికి ఉభయదాతలుగా నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముంగమూరు కృష్ణారెడ్డి దంపతులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. రాత్రి 8 గంటలకు జరిగే ఈ వేడుకలకు భక్తులందరూ తరలి రావాలని కోరారు.

## రుణాల మంజూరుకు నేడు ఇంటర్వ్యూలు

**సంగం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ముస్లిం మైనార్టీ రుణాలకు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఫీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు వారి కుల, విద్యార్హతకు చెందిన ఒరిజనల్ సర్టిఫికేట్‌లు తీసుకుని ఉదయం గం. 10- 00 లకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వారి ఏరియా బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గతంలో మంజూరై బ్యాంకులో పెండింగ్ ఉన్నవారు రావలసిన అవసరం లేదన్నారు.

● ఇంటర్వ్యూ



సెప్టెంబర్ నుంచి

## బ్యారన్ల రిజిస్ట్రేషన్

**మురళీధర్**
**పొగాకు వేలం నిర్వహణాధికారి**

**?. 2017-18కు సంబంధించి పొగాకు బ్యారన్ల రిజిస్ట్రేషన్లు ఎప్పుడు ప్రారంభమవుతాయి**

!. సెప్టెంబర్ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. ఈ నెలాఖరులో రైతులకు అవగాహన కల్పించనున్నాం.

**?. ఈ ఏడాది రిజిస్ట్రేషన్లు తగ్గే అవకాశం ఉందా**

!. గత ఏడాది గరిష్ట ధరలు ఆశాజనకంగా ఉన్నా, దిగుబడి లేకపోవడం దురదృష్టకరం. రెండేళ్లుగా గిట్టుబాటు ధరలు లభించక పోవడం, వర్షపాతం లేనందున బ్యారెన్ల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఈ ఏడాది కూడా వర్షపాతం మీదే రిజిస్ట్రేషన్లు ఆధారపడి ఉంటాయి

**?. లోగ్రేడ్ పొగాకుకు ఆశించిన ధర లభించకనే సాగుకు తగ్గిపోవడానికి కారణమంటున్నారు**

!. వ్యాపారులు మేలురకం పొగాకు వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో లోగ్రేడ్ ధరలు దిగజారుతున్నాయి.

- మర్రిపాడు

# పారిశుధ్యానికి పాతర

● చిరుజల్లులకే అధ్వానంగా మారుతున్న రహదారులు
● పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు

**మర్రిపాడు:** మెట్టప్రాంతమైన మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

మర్రిపాడు మండలంలో 46 గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగానే ఉంది కొద్దిపాటి వర్షానికే అంతర్గత రహదారుల్లో వర్షపునీరు చేరి నిల్వ ఉంటుంది. ప్రధాన గ్రామాల్లో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేసినా, మార్జిన్లలో మట్టి వేయడం విస్మరించారు. దీంతో ఇరువైపుల వర్షపునీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి పోతోంది. సంబంధిత అధికారులు గ్రామాలను సందర్శించి పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మర్రిపాడు మిక్సడ్‌కాలనీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి


### పట్టించుకునే వారే లేరు



ఎస్సీ కాలనీలో ఎక్కడ చూసినా మురుగు గుంతలే దర్శనమిస్తున్నాయి. వీటిని పట్టించుకునే నాథులే లేరు. దీంతో వ్యాధులు సంభవించే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

- కన్నయ్య, రాజులపాడు

### పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు



బాట, యేనేపల్లి, నాగినేని గుంట, తదితర గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. చర్యలు తీసుకుంటున్నా మార్పు రావడం లేదు. వెంటనే సిమెంట్‌రోడ్లు మంజూరు చేయాలి.

- నాగేశ్వరరావు, సర్పంచు నాగినేనిగుంట

### చర్యలు తీసుకుంటాం



పారిశుధ్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం దోమల నివారణ చర్యల్లో భాగంగా బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయిస్తున్నాం.

- వెంకటకిషోర్, వైద్యాధికారి

## వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

**ఆత్మకూరు:** రాష్ట్రంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగీకరించడం హర్షణీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లా నాగరాజారావు, మున్సిపల్ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్‌బాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు కృషి ఫలితంగా వైశ్యుల చిరకాల స్వప్నం నెరవేరుతోందన్నారు. అందుకు సహకరించిన ఎంపీ టీజీ వెంకటేష్, రాష్ట్ర మంత్రి సిద్దా రాఘవరావుకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆలయాలు ముస్తాబు

**చేజర్ల:** మండలంలో 23, 24 తేదీల్లో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. వెంకయ్యస్వామి జన్మస్థలం నాగలవెళ్ళటూరు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మయ్యనాయుడు స్వగ్రామమైన పుల్లనీళ్ళపల్లి, గొలిపాళెం గ్రామాల్లో ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

## పంటకు సంజీవని... పంటకుంట

**ఏఎస్‌పేట:** పంటకుంటలు సంజీవని లాంటివని ఏపీవో శిరీష తెలిపారు. మంగళవారం ఆమె చిరమన గ్రామంలో రెమెడీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ యాజమాన్యం, పశుసంపద నిర్వహణపై ఒంటరి మహిళలకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పంట కుంటలతో సాగుకు అవసరమైన నీరు సమకూరుతుందన్నారు.మామిడి, నిమ్మ, బత్తాయి మొక్కలు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీష మాట్లాడుతూ పశువులకు అందించాల్సి దాణా, పాల ఉత్పత్తి పెరగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులు వ్యాపించ కుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. తదనంతరం ఎంపీఈవో మాధవి మాట్లాడుతూ రైతులు పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించి అవసరమైన మోతాదులో ఎరువులు ఉపయోగించాలన్నారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. అనంతరం సుమారు 10 మంది రైతులకు సాంప్రదాయ వ్యవసాయానికి అవసరమయ్యే డ్రమ్ములను రెమెడీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు.

# ఓబీసీల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

**ఆత్మకూరు:** ఓబీసీల సంక్షేమమే లక్ష్యంగా దేశప్రధాని నరేంద్రమోదీ ఓబీసీకి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారని ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి గెట్టబోయిన పెద్దరోశయ్య, జిల్లా అధ్యక్షుడు బత్తల కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో ఓబీసీ మహాసదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28న విజయవాడలో జరుగు రాష్ట్ర ఓబీసీ సదస్సుకు జాతీయ బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగభద్రతతో కూడిన స్వయంప్రతిపత్తి లభించిందన్నారు. దేశంలో ఎవరూ కుల, ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా వెనుకబడి ఉండకూడదన్న ఆశయంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. విజయవాడలో జరిగే సదస్సుకు జిల్లాలోని అన్ని ఓబీసీ సంఘాలు, బీసీ కులసంఘాలు, బీసీ విద్యార్థి, ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు, మహిళాసంఘాలు, దివ్యాంగ సంఘాలు, ఇతర ఓబీసీ నాయకులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.సి.పెంచలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగట్ల శ్రీహరి, జిల్లా కార్యదర్శి చల్లా లక్ష్మయ్య, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కుడుముల సుధాకర్‌రెడ్డి, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఓబీసీ నేతలు

# రేపు విద్యాసంస్థల బంద్

**ఆత్మకూరు:** విద్యా సంస్థలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని కోరుతూ ఈ నెల 24న ప్రైవేట్ విద్యాసంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపస్మా) నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు ఈగా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కేతా రవిగోపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలి ప్రభాకర్ తెలిపారు. మంగళవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల కర్నూలు జిల్లాలోని కట్టమంచి పాఠశాలలో జరిగిన ఉదంతంతో విద్యార్థి సంఘాల దౌర్జన్యం పరాకాష్టకు చేరుకుందన్నారు. తల్లిదండ్రులను పరామర్శించేందుకు కర్నూలు సర్వజన వైద్యశాలకు వెళ్ళిన అపస్మా రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్య, కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇతర నాయకులపై విద్యార్థిసంఘాలు దాడి చేయడం అనైతికమన్నారు. విద్యాసంస్థలను దౌర్జన్యంగా బంద్ చేయించడం, బలవంతపు వసూలు లాంటి చర్యలతో అసాంఘిక శక్తులు విద్యాసంస్థల యాజమాన్యాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు గురువారం చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు సహకరించాలని పిలుపు నిచ్చారు. అపస్మా నియోజకవర్గ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, డివిజనల్ కార్యదర్శి రమణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అపస్మా నేతలు

## చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

**చేజర్ల:** వినాయకచవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బాచిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవకమిటీ ముందస్తుగా పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. వీటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులు తీసుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మైనార్టీ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువు పెంపు

**ఏఎస్‌పేట:** మైనార్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు ఈ నెల 30వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీటీసీ మస్తాన్‌బీ, మాజీ మండల కో-ఆప్షన్‌సభ్యులు ఖాదర్‌బాషా తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## దళితుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**అనంతసాగరం:** ఆత్మకూరు పట్టణానికి చెందిన దళితుడు వీధి వెంకటేశ్వర్లుపై గత నెల 27న మర్రిపాడు మండలానికి చెందిన వెంకటేశ్వర్లునాయుడు అకారణంగా దాడి చేశాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని అనంతసాగరం చెందిన దళిత నాయకుడు టి.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ నాయకులు శేషయ్య, చిన్న తిరుపాల్, గురవయ్య డిమాండ్ చేశారు. వృత్తిరీత్యా నెలకొన్న వివాదంలో దళితుడైన వెంకటేశ్వర్లును అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేసినా, పోలీసులు మాత్రం నామమాత్రపు సెక్షన్లు పెట్టి నిందితుడిని తప్పించే ప్రయత్నాలు పోలీసులు చేస్తున్నారని వారు ఆరోపించారు. దళితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు

**అనంతసాగరం:** ఉపాధిపనుల్లో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తప్పవని ఏపీడీ మృదుల హెచ్చరించారు. మంగళవారం పాతదేవరాయపల్లి, కొత్తదేవరాయపల్లెల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఉపాధికూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీడీపల్లిలో చాలా రోజుల క్రితం తవ్విన సేద్యపు నీటిగుంటల బిల్లులు మంజూరు కాలేదని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె అనంతసాగరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిసిబ్బందితో సమావేశం నిర్వహించి పురోగతిపై చర్చించారు. ఏపీవో దయానంద్, సిబ్బంది ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ

## గొల్లపల్లిలో పల్లెనిద్ర

**చేజర్ల:** గొల్లపల్లిలో మంగళవారం తహసీల్దారు హమీద్ పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. దీని ద్వారా సమస్యలు సత్వరం పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్ రావి రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు ఉడతా హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చైనా ఉత్పత్తులు బహిష్కరిద్దాం


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, అనుబంధ సంఘాల నేతలు

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల

**ఆత్మకూరు:** చైనా వ్యవహార శైలికి నిరసనగా ఉద్యమం చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆత్మకూరులోని సత్రంసెంటర్ నుంచి చైనా ఉత్పత్తులకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను ప్రజలకు పంచుతూ ర్యాలీ బీఎస్ఆర్ సెంటర్ మీదుగా ఆర్డీవో ఆఫీస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశాన్ని చైనా కబంధహస్తాల నుంచి రక్షించేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 1962లో జరిగిన యుద్ధంలో 42,700 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించిందని, ప్రస్తుతం అరుణాచలప్రదేశ్‌ను ఆక్రమించేందుకు కుయుక్తులు పన్నుతోందన్నారు. భారతసైన్యం చైనాకు తగిన గుణపాఠం నేర్పుతుందన్నారు. అనంతరం బీజేపీ పట్టణాధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, రూరల్ అధ్యక్షుడు నలిశెట్టి శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు గున్నం నారసింహారెడ్డి మాట్లాడుతూ చైనా తయారు చేసే వస్తువులన్నింటికీ భారతదేశం అతిపెద్ద మార్కెట్‌గా మారిందన్నారు. చైనా వస్తువులను బహిష్కరిస్తే ఆ దేశ ఆర్థిక బడ్జెట్‌లో 40 శాతం లోటు ఏర్పడుతుం దన్నారు. కావున భారతీయులందరూ చైనా వస్తువులను బహిష్కరించి, ఆ దేశంతో పరోక్షయుద్ధం చేసే సైనికులుగా మారాలన్నారు. అనంతరం వారు ఆర్డీవో బాపిరెడ్డికి వినతిపత్రం అందచేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చెర్లో శ్రీనివాసులురెడ్డి, పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు ఉదయగిరి ప్రతాప్, ఏబీవీపీ నాయకులు రాజశేఖర్, ప్రశాంత్, ఆర్ఎస్ఎస్ నాయ కులు సుసర్ల శ్రీనివాసులు, దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీజేవైఎం రూరల్ అధ్యక్షుడు శాగం ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ఎంఆర్ జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్


పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

**ఏఎస్‌పేట:** ఏఎస్‌పేటలోని టీఎస్ఎంఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని చెత్తాచెదారాలను , పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అంకమ్మ, కరస్పాండెంట్ పద్మావతి, అధ్యాపకులు లక్ష్మయ్య, హరికృష్ణ, తిరుపతినాయుడు, శ్రీనివాసులురెడ్డి, వెంగళరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతినగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

**ఆత్మకూరు:** మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతినగర్‌లో రోడ్డుకు ఇరువైపులా మురుగుకాలువల్లో చెత్తను సకాలంలో తొలగించడం లేదన్నారు. కొద్దిపాటి వర్షానికే కొన్ని వీధుల్లో రోడ్లపై నడవలేని పరిస్థితి ఉందన్నారు. పాఠశాల ఆవరణ పక్కనే ఉన్న మురుగు కాలువలో పూడికతీయకపోవడంతో దోమల బెడద అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

## విద్యార్థులకు వక్తృత్వ పోటీ

**మర్రిపాడు:** మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛ భారత్ అంశంపై మండలంలోని విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థు లు పాల్గొన్నారు. మొదటి బహుమతి మేఘన (మోడల్ స్కూల్, నందవరం), రెండ వ బహుమతి మస్తానమ్మ(మర్రిపాడు ఉన్నత పాఠశాల), మూడవ బహుమతి మహేంద్ర(పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల) సాధించారు.

## వెంకయ్యస్వామి ఆరాధనకు ఆలయాల ముస్తాబు


సంగంలోని వెంకయ్యస్వామి ఆలయం

**సంగం:** ఈ నెల 24న నిర్వహించనున్న భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలకు మండలంలోని సంగం, వెంగారెడ్డిపాళెం, జండాదిబ్బ, మర్రిపాడు, వీర్లగుడిపాడు తదితర గ్రామాలోని ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలకు రంగులు వేశారు. కొన్నిచోట్ల విద్యుత్‌దీపాలంకారణలు చేస్తున్నారు. గురువారంఉదయం అభిషేకాలతోపాటు పూజాకార్యక్రమాలు, ఓమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు


మనోజకు జ్ఞాపిక అందచేస్తున్న ఉపాధ్యాయులు

**అనంతసాగరం:** ఉన్నత ఆశయంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని అనంతసాగరం శాంతినికేతన్ పాఠశాల డైరెక్టర్ గోలి ప్రభాకర్ తెలిపారు. ఆ పాఠశాలలో చదివి 10s పాయింట్లు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ సీటు సాధించిన మనోజను ప్రత్యేకంగా అభినందించారు. ఆ విద్యార్థినిని, ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మనోజకు జ్ఞాపిక, బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నిర్మలాదేవి

**ఆత్మకూరు:** గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, పారిశుధ్యం మెరుగుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మండల అభివృద్ధి అధికారి ఎ.నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా కొన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయాల్సి ఉందన్నారు. త్వరితగతిన ఆత్మకూరు మండలాన్ని బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రకటించాల్సి ఉందన్నారు. అనంతరం ఉపాధిపనులు, శ్మశానవాటికల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తోట కృష్ణయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

**చేజర్ల:** గ్రామాల్లోని రైతులు వ్యవసాయశాఖా .దికారులు ఇచ్చిన సూచనల మేరకు పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖాధికారిణి శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని చిత్తలూరు, ఆదురుపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి తగు సలహాలు, సూచనలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాల పంపిణీ

**గూడూరు(రూరల్):** మండల పరిధిలోని కందలి, తుంగపాళెం, తిరువెంగళాయపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంగళవారం తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన బత్తల సుబ్బారెడ్డి దాతృత్వంతో రూ.50 వేలు విలువ చేసే నోటు పుస్తకాలను లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ రూ.5 లక్షలు విలువ చేసే విద్యాసామాగ్రిని అందజేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో బత్తల సుబ్బారెడ్డి, క్లబ్ కార్యదర్శి జీ చంద్రశేఖర్, కోశాధికారి కడివేటి చంద్రశేఖర్, హెచ్‌ఎంలు భ్రమరాంబ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి శస్త్రచికిత్సకు చేయూత



విద్యార్థికి నగదు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

**గూడూరు:** స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సుబ్రమణ్యం శస్త్ర చికిత్సకు విద్యార్థులు 44,500 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేయడం స్ఫూర్తిదాయకమని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో ఆదిశంకర అగాగ్ అలయన్స్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలోని విద్యార్థి సంఘం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ సేకరించిన రక్తపు నిల్వలను స్థానిక బ్లెడ్ బ్యాంకుకు అందజేస్తుందన్నారు. సహచర విద్యార్థి శస్త్రచికిత్సకు విరాళాలు సేకరించి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో మూతపడిన బ్యాంకులు



మూతపడిన ఆంధ్రాబ్యాంకు




షట్టర్ వేసి ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా



తాళం వేసి ఉన్న యూనియన్ బ్యాంకు

**గూడూరు:** బ్యాంకు ఉద్యోగులు తలపెట్టిన సమ్మె కారణంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు మూత పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక సంస్కరణలను నిరసిస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో పట్టణంలో ఎక్కడా బ్యాంకులు తెరుచుకోలేదు. కంపెనీల మొండి బకాయిల వసూలు కోసం పార్లమెంటరీ కమిటీ వేసిన సిఫార్సులను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు సమ్మెకు దిగారు. అదేవిధంగా ఏకంగా బకాయిలను రద్దు చేయడంపై బ్యాంకు ఉద్యోగుల సంఘాలను ఆందోళనకు గురి చేశాయి. విధాన పరమైన నిర్ణయాలలో బ్యాంకులపై కర్రపెత్తనం చేస్తున్న బ్యాంక్స్ బోర్డు బ్యూరోను రద్దు చేయాలని, ప్రతిపాదిత ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లును వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండు చేస్తూ ఉద్యోగులు సమ్మెకు దిగారు. దీంతో బ్యాంకు లావాదేవీలన్ని స్థంభించాయి.



మూతపడి ఉన్న ఎస్‌బీఐ

## ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు యాదగిరి

**గూడూరు(టౌన్):** మండల పరిధిలోని మేగనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బయోమెడ్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి యాదగిరి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ స్థాపన సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే ఏర్పాట్లు చేశారన్నారు. ఫ్యాక్టరీలో బయోప్రొడక్ట్‌లు తయారు చేస్తామని చెప్పి జంతువుల కళేబరాలతో రోజుకు మూడు టన్నుల మేర నూనె తయారు చేస్తున్నారన్నారు. దీంతో ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు, గోపాల్, మణి, ముత్యాలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు బాగు చేయాలంటూ రాస్తారోకో

**గూడూరు:** స్థానిక రెండో పట్టణ పరిధిలోని తిలక్‌నగర్ వద్ద ఉన్న రహదారి రోడ్డును అభివృద్ధి పరచాలని స్థానికులు డిమాండు చేశారు. మంగళవారం స్థానిక తిలక్‌నగర్‌లో స్థానికులు, విద్యార్థులు కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రహదారి ద్వారా 16 గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో మూడు ప్రభుత్వ కళాశాలలు నడుస్తున్నాయన్నారు. రోడ్డు ధ్వంసమై ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా గుంటలలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయన్నారు. అధికారులకు ఎన్ని సార్లు నివేదించినా చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో ఉడుతా శరత్‌యాదవ్, గౌస్ బాషా, ఆనంద్, శ్రీధర్, సయ్యద్, కిషోర్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేస్తున్న స్థానికులు, విద్యార్థులు

## సిబ్బంది సమ్మెతో బ్యాంకుల మూత

**చిల్లకూరు:** బ్యాంకుల సిబ్బంది మంగళవారం వారి డిమాండ్ల పరిష్కారం కోరుతూ సమ్మె చేశారు. దీంతో మండలంలోని బ్యాంకు లన్ని మూత పడ్డాయి. బ్యాంకు సిబ్బంది జీతాలు పెంచడంతో పాటు తాత్కాలికంగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, చనిపోయిన వారి కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలంటూ సమ్మెకు దిగారు. రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. కాని బ్యాంకర్లు సమ్మెకు దిగడంతో ఇంటర్వ్యూలు బుధవారానికి మార్చారు.



చిల్లకూరులో మూతపడిన కార్పొరేషన్ బ్యాంకు

## అభివృద్ధిలో ముందున్నాం

### గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

**కోట :** అలుపెరుగకుండా పనిచేస్తున్నా.. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నా.. తనను ఆశీర్వదిస్తున్న నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానే తప్ప పసలేని ఆరోపణలు చేస్తే ఒప్పుకోను, ఎక్కడి నుంచో గూడూరుకు వచ్చి రాజకీయాలు చేయడం లేదు. ఇక్కడే పుట్టా.. ఇక్కడే రాజకీయాలు చేస్తున్నా.. సద్విమర్శలు స్వీకరిస్తా.. ఆరోపణలు తిప్పి కొడుతానంటూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సుతిమెత్తంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పరోక్షంగా వైసీపీ నాయకుల విమర్శలపై మండి పడ్డారు. కోటలోని బీసీ గురుకుల బాలుర పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్‌రూమ్‌లోకి వెళ్లి నిల్వఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలను ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా డైనింగ్ హాల్‌కు వెళ్లి విద్యార్థులకు వండిన భోజనం, కూరలను పరిశీలించారు. వండిన భోజనాన్ని తిని రుచిగా ఉందంటూ ప్రిన్సిపాల్, వర్కర్లను, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది వలస రాజకీయ నాయకులు తనపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు సహించరన్నారు. ఇక్కడ ఉన్న బీసీ గురుకులాన్ని జూనియర్ కళాశాలగా మార్చడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇక్కడి పాఠశాలలో రూ 21లక్షల వ్యయంతో సోలార్‌సిస్టమ్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా రూ 90లక్షలతో క్వాటర్స్‌ను బాగుచేశామన్నారు. రూ9 కోట్ల నాబార్డ్ నిధులను పాఠశాల అభివృద్ధికి మంజూరు చేయించానన్నారు. సిబ్బంది, భవనాల కొరత వల్ల ఈ ఏడాది ఇక్కడ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయలేక పోయామన్నారు. ఈ ప్రాంతంలో నల్లప్పరెడ్లు, నేదురకుమల్లి కుటుంబాలు విద్యా సంస్థల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి వాటి ఎదుగుదలకు అహర్నిశలు పాటు పడ్డామన్నారు. దాతల సహకారంతో ఇక్కడి డైనింగ్ హాల్ మరమ్మతులకు శ్రీకారం చుడుతామన్నారు. రూ35 కోట్ల వ్యయంతో కోట, తూపిలిపాళెం ఆర్ అండ్‌బీ రోడ్డును డబుల్‌రోడ్డుగా మారుస్తున్నామన్నారు. అదే విధంగా గూడూరు పంబలేరు కాజ్‌వే నిర్మాణానికి రూ14 కోట్ల వ్యయంతో త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. తనపై ఆరోపణలు చేసే వ్యక్తులు దమ్ముంటే ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాదర్తి కోటేశ్వరరెడ్డి, నెల్లూరు మోహన్ రెడ్డి, మధుయాదవ్, కిరణ్‌కుమార్, దారా సురేష్, దారా వల్లయ్య, రవీంద్రనాధ్‌రెడ్డి, గురుస్వామి, కోటారెడ్డి, ఎంపీటీసీ సురేంద్ర, రాంబాబు తదితరులు ఉన్నారు.



బీసీ గురుకులంలో భోజనం రుచి చూస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

## ఏబీవీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**గూడూరు(టౌన్):** ఏబీవీపీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున అన్నారు. మంగళవారం స్థానిక స్వర్ణాంధ్ర భారతి కళాశాలలో ఏబీవీపీ కళాశాల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ యూనియన్‌లోని విద్యార్థినీలు కావ్య అనే విద్యార్థినీ చదువులకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించి కళాశాల యాజమాన్యం సహకారంతో విద్యార్థిని చదువులకు అవసరమైన ఫీజులు చెల్లించేలా సహకరించారన్నారు. అనంతరం విద్యార్థినికి విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థులలో దేశభక్తిని పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్, ఖలీల్, చిన్నా, శిరీష, ప్రశాంత్, తేజ తదితరులు పాల్గొన్నారు.



## భూముల స్థిరీకరణలో జాగ్రత్తలు తీసుకోవాలి

**కోట :** భూముల స్థిరీకరణలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని తప్పుల తడకలు లేకుండా చూడాలంటూ తహసీల్దారు కేఎం రోజ్‌మాండ్ కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం భూముల ప్యూరిఫికేషన్‌పై వీఆర్వోలతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రధానంగా అడంగల్‌లో పట్టాదారు బదులు అనుభవ దారుడి పేరు నమోదు కావడం, విస్తీర్ణంలో తేడాలు రావడం వంటివి జరుగుతున్నాయన్నారు. అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐలు రమ్య, వేణు, వీఆర్వోలు ఉన్నారు.

## మట్టి విగ్రహాలను పూజించాలంటూ విద్యార్థుల ర్యాలీ


వినాయక మాస్కులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**రెడ్డిపాళెం(వాకాడు):** మండల పరిధిలోని రెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వినాయక చవితిని పురస్కరించుకుని భక్తులు మట్టి విగ్రహాలనే పూజించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆత్మకూరు భారతి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను వాడకుండా వినాయకుడి మట్టి ప్రతిమలనే వాడాలని గ్రామస్థులకు సూచించారు. విషపూరిత రసాయనాలతో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యాయుడు మల్లికార్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను కోల్పోయాం

**కోట :** పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించిన మర్రిగున్నయ్య మృతిచెందడం పార్టీకి తీరని లోటని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. కోట దళితవాడలో గుండెజబ్బుతో బాధపడుతూ మృతిచెందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు మర్రి గున్నయ్య భౌతికకాయాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులు అర్పించారు. గున్నయ్య కుటుంబాన్ని ఆదుకుంటానని తనవంతుగా రూ10 వేలను సహాయంగా ఎమ్మెల్యే అందజేశారు. సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్ నల్లప్పరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిలతో పాటు మండల టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు.

## పేదలకు భూములు అందించాలి

**చిల్లకూరు:** మండలంలోని పలు గ్రామాల్లో గతంలో పేదలకు అందించిన సీజేఎఫ్ఎస్ భూములను వారికే ఇవ్వాలంటూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మందా కృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మందా కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను పెద్దలు స్వాధీనం చేసుకున్నారన్నారు. దీంతో పేదవారికి సెంటు భూమి కూడా లేకుండా పోయిందన్నారు. అధికారులు చర్యలు తీసుకుని పేద వారి భూములను పేదలకే దక్కేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దారు రమణయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గోవిందు, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడికి చర్యలు

**గూడూరు(రూరల్):** మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు పంచాయతీ నిధులతో గిరిజన కాలనీ, ఆరుంధతీయ వాడ, హరిజనవాడ, కామాక్షినగర్‌లలో మంగళవారం బోర్లు ఏర్పాటు చేస్తున్నామని సర్పంచు తోడేటి శివకుమార్ తెలిపారు. రెండో హరిజనవాడలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నిధుల నుంచి ఓ బోరును మంజూరు చేయడంతో ఏర్పాటుకు చర్యలు చేపట్టా మన్నారు.

## ప్రకృతి పరిరక్షణకు మట్టి ప్రతిమలు వాడండి

**గూడూరు(టౌన్):** ప్రకృతి పరిరక్షణకై వినాయకచవితి నాడు మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని మైఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాహుల్ అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని పలు కళాశాలల్లో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్యాస్టో ప్యారిస్‌తో తయారు చేసి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. కార్యక్రమంలో హరి, విష్ణు, మోహన్, హర్ష, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బీకేఆర్‌లో రెండో రోజు ఉద్రిక్తత


ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న పోలీసు బలగాలు

**విద్యానగర్(కోట) :** కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాలేజీ కరస్పాండెంట్, చైర్మన్ విషయంలో నేదురుమల్లిరామ్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డిల మధ్య వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పద్మనారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ తానేనని కళాశాలలోకి ప్రవేశించడం, చైర్మన్‌కు సంపందించిన కోర్టు ఉత్తర్వులను చూపాలని రామ్‌కుమార్‌రెడ్డి బహిరంగంగా కోరడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పద్మనాభరెడ్డితో పాటు ఆయన కుమారుడు రంజన్‌రెడ్డి, మనుమడు గౌరవరెడ్డిలు కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రయత్నాలు చేశారు. సెక్యూరిటీ లోపలికి వెళ్లేందుకు వారిని అనుమతించక పోవడంతో వారు గేటు వద్దే కూర్చున్నారు. ఈ సమావేశంలో రెండు వర్గాలకు చెందిన వారు ఎక్కడ ఘర్షణలకు తలపడుతారోనన్న భయాందోళనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాకాడు, గూడూరు అర్బన్ సీఐలు సత్యనారాయణ, సుబ్బారావుల ఆధ్వర్యంలో చిట్టమూరు ఎస్ఐ వేణుగోపాల్, పలువురు పోలీసులు పహారా కాశారు. కళాశాల ప్రాంగణంతో పాటు పలు చోట్ల 144 సెక్షన్ విధిస్తున్నామని పోలీసులు హెచ్చరించడంతో రెండు వర్గాలకు చెందిన వారు మెల్లగా జారుకున్నారు. పద్మనాభరెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డిలను జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ హుటాహుటీనా నెల్లూరుకు రావాలని ఫోన్ సమాచారం ఇవ్వడంతో ఇద్దరు హుటాహుటిన వెళ్లిపోయారు. దీంతో ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో వివాదం సర్దుమణిగి ప్రశాంత వాతావరణం నెలకొంది.

## రేపు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

**గూడూరు:** విద్యార్థి సంఘాల దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు గూడూరు నియోజకవర్గ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం చైర్మన్ పసుపులేటి కిషోర్ అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ భవన్‌లో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులో ఓ ప్రైవేటు విద్యాసంస్ద యాజమాన్యంపై విద్యార్థి సంఘ నాయకులు దాడి చేశారన్నారు. విద్యార్థి సంఘాల పేరుతో విద్యాసంస్థల యాజమాన్యాలను బెదిరిస్తున్నారన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను నిర్వహించడంతో పాటు జిల్లా కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు వినతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బాల చెన్నయ్య, నరసింహారెడ్డి, కేఆర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంసకర చర్యలు చేపట్టడం దారుణం


మాట్లాడుతున్న ఆయా విభాగాధిపతులు

**విద్యానగర్(కోట) :** కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంత వాతావరణంలో ఉన్న ప్రదేశంలో నేదురుమల్లి పద్మనాభరెడ్డి, ఆయన కుమారుడు ఉదయశేఖర్‌రెడ్డి, మనుమడు గౌరవ్, వారి అనుచరులు ఉద్దేశపూర్వకంగా విధ్వంసకర చర్యలకు పాల్పడడం దారుణమని కళాశాలకు చెందిన ఆయా విభాగాధిపతులు తెలియజేశారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం ఆయా విభాగాధిపతులు విలేకరులతో మాట్లాడారు. పద్మనాభరెడ్డితో పాటు వారి అనుచరులు బయట వ్యక్తులను తీసుకువచ్చి కళాశాల డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి చాంబర్‌లోకి ప్రవేశించి రాజీనామా చేయాలంటూ బెదిరించి దాడి చేయడం జరిగిందన్నారు. డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డికి గతంలో గుండె ఆపరేషన్ జరిగి ఉందన్నారు. గుండె ఆపరేషన్ జరిగి ఉందని చెప్పినా కూడా బలవంతంగా బయటకు గెంటివేశారన్నారు. దీంతో ఆయన ఆరోగ్యం దెబ్బతిని ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ సంఘటనపై తమ కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది ఎంతో బాధపడుతున్నామన్నారు. తమ కళాశాలలో అందరూ కలిసిమెలిసి కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రశాంతం గా పనిచేస్తున్నామన్నారు. పద్మనాభరెడ్డి ఎలాంటి కోర్టు ఉత్తర్వులు లేకుండా కళాశాలలోకి ప్రవేశించి భయానక వాతావరణం సృష్టించారన్నారు. కళాశాలలోని విద్యార్థుల చదువులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి చెడు సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఉండాలని కళాశాల సిబ్బందికి ఇన్‌చార్జి డైరెక్టర్ వెంకట్రావు తెలిపారు.

## పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న దువ్వూరు మధుసూదనరెడ్డి

**వల్లమేడు (వాకాడు):** పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీడీపీ మాజీ మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదనరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వల్లమేడు - నిడిగుర్తి రోడ్డు మార్గంకు ఇరువైపులా పొదుపు మహిళల ఆధ్వర్యంలో మంగళవారం ఆయన 4 వందల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, పర్యావరణాన్ని కాపాడేందుకు చెట్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయని, నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, సీసీ నరశింహులు, సంఘ బంధం అధ్యక్షులు తీపలపూడి సుజాతమ్మలు పాల్గొన్నారు.

## చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

**కోట :** పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను తీసుకువచ్చి అభిమానుల సమక్షంలో కట్ చేసి పంచి పెట్టారు. మెగాస్టార్ చిరంజీవి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మీజూరు మల్లిఖార్జున్‌రావు, పాలమల్లిఖార్జున్, అల్లం బాబు, మీజూరు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



## 26న జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

**గూడూరు(రూరల్):** గూడూరు సీఆర్‌రెడ్డి కళ్యాణమండపంలో ఈ నెల 26న నిర్వహించనున్న నియోజకవర్గ వైసీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం విజయవంతంపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాశిన నాగులు, మల్లు విజయకుమార్, మెట్టా రాధాకృష్ణారెడ్డి, గూడూరు రాజారెడ్డి, ఎల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్‌పాస్‌ల కోసం నగదు అందజేత

**పెళ్లకూరు :** బంగారంపేట పంచాయతీలోని పాఠశాల విద్యార్థుల బస్‌పాస్‌ల నిమిత్తం తెలుగుదేశంపార్టీ నాయకుడు దేవారెడ్డి నాగేంద్రరెడ్డి మంగళవారం నగదు అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం విద్యార్థులతో రాయితీతో అందజేస్తున్న బస్‌పాస్‌లకోసం 100 మంది విద్యార్థులకు 4వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కె. ప్రతాప్ కుమార్, యూనియన్ నాయకులు పోలయ్య, వెంకటేష్, భాస్కర్, తదితరులు అక్కడకు చేరుకుని విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు నాగేంద్రరెడ్డిని అభినందించారు.

# దర్జాగా కబ్జా..!

- లక్షలు విలువ చేసే భూమి ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



చెరువులోకి వెళుతున్న పంట కాలువ

పొలంగా మారిన పంట కాలువ



**దొరవారిసత్రం:** కబ్జాకు కాదేది అనర్హం...అది పంట కాలువ కావచ్చు.. శ్మశానం భూమి కావచ్చు...పది మందికి ఉపయోగపడే భూమి కావచ్చు.. లక్షలు పలికితే చాలు కబ్జాకోరులు వాలిపోయి కబ్జా చేసేస్తారు. ఇది జిల్లాలో కబ్జాదారులు ఆక్రమణల పర్వం. ఈ రకమైన ఆక్రమణే దొరవారిసత్రం మండలంలో కూడా చోటు చేసుకొని ఉంది. లక్షలు విలువచేసే భూమి కావడంతో ఓ ప్రబుద్ధుడు ఏకంగా పంట కాలువను కబ్జాచేసేశాడు. తన పొలంలో కలుపుకొనేశాడు.

దొరవారిసత్రం మండలంలోని కృష్ణాపురం వద్ద 5వ నెంబర్ జాతీయరహదారి పక్కన పంట కాలువ కబ్జాకు గురై ఉంది. హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి పక్కన గల కాలువను కబ్జాచేసి పొలంగా మార్చుకునేశారు. ఈ కాలువ కుప్పారెడ్డి పాళెం మద్దెలగుంట చెరువులోకి వెళ్లే పంట కాలువ. ఈ కాలువ రహదారికి తూర్పు వైపున గల అడవిలో పడే వర్షపు నీరు మద్దెలగుంట చెరువులోకి చేర్చుతోంది. ఈ కాలువ అడవిలో నీరు చెరువులోకి తీసుకెళ్లేలా అక్కడ ఉన్న రైల్వే ట్రాక్‌పై కూడా వంతెన ఏర్పాటు చేసి ఉన్నారు. అలాగే జాతీయరహదారిని దాటేందుకు కాలువపై కల్వర్టును ఏర్పాటు చేసి ఉన్నారు. మద్దెలగుంట చెరువుకు ఈ కాలువ ఒక్కటే ప్రధాన నీటి వనరు. అయితే ఈ కాలువ రహదారికి తూర్పువైపున పూర్తిగా కబ్జాకు గురై ఉంది. కాలువ ఆనుకుని ఉన్న పొలం యజమాని కాలువను కనుమరుగు చేసేశాడు. సుమారు 40 అడుగుల వెడల్పుతో ఉన్న పంట కాలువ దాదాపు 500మీటర్లు మేర కబ్జాకు గురైంది. ఇక్కడ ఎకరా భూమి విలువ 30 లక్షలుపైన పలుకుతుండటంతో పంట కాలువ కబ్జాకు గురైంది. రహదారికి తూర్పువైపున పంట కాలువ కబ్జాకు గురై పడమరవైపున కాలువ ఉన్నా ప్రస్తుతం ఉపయోగం లేకుండా పోయింది. వర్షాకాలంలో వర్షపు నీరు చెరువులోకి చేరడం లేదు. వర్షాధారం మీద ఆధారపడి పంటలు సాగుచేసే రైతులు ప్రతి సంవత్సరం చివరి తడిలో ఈ చెరవుకింద అవస్థలు పడుతున్నారు. ఆక్రమణకు గురైన కాలువను తిరిగి తవ్వించ కలిగితే అడవిలో పడే వర్షపు నీరు చెరువులోకి సమృద్ధిగా చేరుతాయి. రైతులకు అవస్థలు తప్పి పంటలు పండుతాయి.

**పట్టించుకోని రెవెన్యూ అధికారులు :** లక్షలు విలువ చేసే పంట కాలువ భూమి కబ్జాకు గురైనప్పటికి రెవెన్యూ అధికారులు అటువైపుగా కన్నెత్తిచూడటం లేదు. కాలువను కబ్జాచేసి తన పొలంలో కలుపేసుకొన్న భూ యజమాని రాజకీయ పలుకుబడిన వ్యక్తి కావడంతో అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ పంట కాలువ ఆక్రమణలపై గతంలో రైతులు ఫిర్యాదులు చేసినా అధికారుల నుంచి చర్యలు లేవు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

## సంబరమే.. తరువాయి..!



చిన్నా,పెద్దలు ఎంతో సంబరంగా చేసుకునే వినాయక చవితి మరో రెండు రోజుల్లో రానుంది. దీంతో వినాయక విగ్రహాల కొను గోళ్లలో యువత ఉత్సాహం చూపుతున్నారు. విభిన్నంగా, పెద్దదిగా పెట్టాలంటూ పోటీ పడి మరీ నగదు వెచ్చిస్తున్నారు. దీంతో రెండు రోజుల ముందుగా పట్టణం చవితి సంబరాలు మొదలైనట్లు కనిపిస్తోంది. సమీప ప్రాంతాల యువకులు విగ్రహాలను తరలించుకు వెళ్తుంటే.. పట్టణంలోని యువత డెకరేషన్‌పై శ్రద్ధ చూపిస్తున్నారు.

**- నాయుడుపేట/నాయుడుపేట రూరల్**



మురళీలోలుడిలా.. వినాయక విగ్రహం



రథసారధిగా..



నందిపై విఘ్నేశ్వరుడు



పూజలకు తరలుతున్న విగ్రహాలు

## చవితికి ఆలయాల ముస్తాబు

**నాయుడుపేట :** హిందువులకు వచ్చే మొట్టమొదటి పండుగ వినాయకచవితి కావడంతో ఎంతో విశిష్ఠతను సంచరించుకుంది. ఈ నెల 25వతేదీ శుక్రవారం వినాయకచవితి కావడంతో నాయుడుపేటలోని పిళ్లారిగుడి, పిచ్చిరెడ్డితోపులోని శ్రీ విజయగణపతి దేవస్థానం, శంకరాపురంలోని శ్రీ వినాయకస్వామి ఆలయం, కలగూరపేటలోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం, అగ్రహారపేటలోని శ్రీ వినాయకస్వామి ఆలయాలు రంగులతో ముస్తాబవుతున్నాయి.



ముస్తాబవుతున్న పిళ్లారిగుడి

## సివిల్ వ్యవహారాల్లో పోలీసుల జోక్యం తగదు

- సీఐకి నాయుడుపేట బార్ అసోసియేషన్ వినతి

**నాయుడుపేటరూరల్ :** కోర్టుకు సంబంధించిన అంశాలు, సివిల్ వ్యవహారాలలో పోలీసుల జోక్యం తగదని నాయుడుపేట బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం రాత్రి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వీరు మాట్లాడుతూ పెళ్లకూరు మండలం దిగువచావాలి గ్రామానికి చెందిన పాలేటి శ్యామ్‌సుందర్ అతని కుటుంబసభ్యుల మధ్య ఆస్తి వివాదాలు ఉన్నాయన్నారు. న్యాయవాది పార్థసారధిరెడ్డి కక్షిదారుడైన శ్యామ్‌సుందర్‌పై పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అమానుషంగా ప్రవర్తించడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. సివిల్ వ్యవహారాలలో, కోర్టు వ్యవహారాలలో రాజ్యాంగం ప్రకారం జోక్యం ఉండరాదని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.



సీఐకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

## వైభవంగా మహావీర్ జన్మదిన వేడుకలు

**నాయుడుపేట :** జైన్‌ల దైవమైన మహావీర్‌స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక జైన్ దేవాలయంలో వైభవంగా జరిగాయి. నాలుగు రోజులుగా మహావీర్‌స్వామి ముందస్తు జన్మదిన వేడుకలు జరుగుతున్నాయి. ఆలయంలో 14 స్వప్నాలకు సంబంధించిన అంశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైనులు ఉత్సాహంగా మహావీర్‌స్వామి జన్మదినానికి రంగులు అద్దుకొంటూ కేరింతలు కొట్టారు.



ప్రత్యేక పూజల్లో జైనులు

## ఆక్రమిత భూములు విడిపించండి

**పెళ్లకూరు :** అర్ధమాల పంచాయతీలోని ఆక్రమిత భూములను విడిపించి బాధితుడికి అందజేయాలని నాయుడుపేట సివిల్‌జడ్జి ఆదేశాలు ఇచ్చారు. మండల పరిధిలోని అర్ధమాల పంచాయతీలో ఉన్న యర్రగుంట గ్రామంలో 10 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన పిల్లా శ్రీనివాసులుకు కౌలుకు అప్పగించారు. కొంతకాలం అనంతరం ఆ భూములు నావేనంటూ సంబంధిత పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకురావడంతో కౌలుకు భూములు ఇచ్చిన రైతులు నాయుడుపేట సివిల్‌కోర్టుకు దావా వేయడంతో విచారించిన జడ్జి సరస్వతి ఆ భూములను బాధితులకు అప్పగించాలంటూ తహసీల్దార్ నాగరాజలక్ష్మికి ఆదేశాలు అందజేశారు.

### సినిమాగైడ్

**నాయుడుపేట**

సీఎస్‌తేజ : జయ జానకి నాయక
మురారి : ఫిదా
శ్రీవెంకటేశ్వర : నేనే రాజు..నేనే మంత్రి

**సూళ్లూరుపేట**

శ్రీలక్ష్మి : జయ జానకి నాయక
ఎన్‌వీఆర్ : నేనే రాజు..నేనే మంత్రి

ఆంధ్రజ్యోతి
12
సూళ్లూరుపేట
బుధవారం, 23 ఆగస్టు 2017
సూళ్లూరుపేట । తడ । దొరవారిసత్రం । పెళ్లకూరు । ఓజిలి । చిట్టమూరు

## రోడ్లను పట్టించుకోవాలి

సూళ్లూరుపేటలోని పలువార్డులో రోడ్లు బురదమయంగా మారిపోయాయి. మురుగు కూడా రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోంది.

# చినుకు పడిందా..?

**● బురదమయమవుతున్న గ్రామాలు ● సిమెంటు రోడ్లకు నోచుకోని కాలనీలు**


కొత్తగుంట ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు


బురదమయంగా కొత్తగుంట వీధి

**చిట్టమూరు :** ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాలు బురదమయంగా మారుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంటు రోడ్లు లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అడుగు లోతు బురదలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడి రోడ్లన్నీ ప్రగతి కోసం ఎదురు చూస్తున్నాయి. మల్లాం, ఎల్లూరు, వెలుగాజులపల్లి, కోగిలి వడ్డికండ్రిగ, ఈశ్వరవాక, చిట్టమూరు పంచాయతీల్లోని కాలనీలన్నీ బురదమయంగా మారిపోయాయి. వర్షం పడిన వారం రోజుల వరకు ఈ గ్రామాల్లో అడుగు వేయాలంటే చికాకు పుట్టిస్తుంది. పలు కాలనీల్లోని రోడ్లకు డ్రైనేజి లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ చేరిపోతుంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో నీరు నిల్వ ఉండకూడదంటూ వైద్యాధికారులు హెచ్చరిస్తున్నా పంచాయతీ పాలకులు మాత్రం ఇవేమి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ విడుదల చేసి గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలోని రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 'ఆచార్య' ఇదేమి రోడ్డయ్యా..!

**● బురదమయంగా ఆత్రేయ రోడ్డు**



మనసు కవి ఆచార్య ఆత్రేయ పేరుతో ఉన్న రోడ్డు ఇది.. సూళ్లూరుపేట కోళ్లమిట్ట నుంచి రైల్వేగేట్ వరకు ఉన్న ఈ రోడ్డు చిన్న వర్షం వచ్చినా అధ్వానంగా మారిపోతుంది. మురుగుకాలువల్లోని నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంటుంది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లేవాళ్లు మున్సిపాలిటీని తిట్టుకొంటూ పయనిస్తున్నారు. ఆచార్య ఆత్రేయ వంటి మహోన్నత కవి పేరుపై ఉన్న ఈ రోడ్డును ప్రజలు ఛీకొట్టడం ఆయనను అవమానించినట్లేనని సాహిత్య అభిమానులు ఆవేదన చెందుతున్నారు. మున్సిపాలిటీ పాలకులు ఈ రోడ్డును బాగుచేయాలని లేదా ఆత్రేయ పేరైన తీసేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ అధికారులూ, పాలకవర్గ పెద్దలు ఆత్రేయ మన ప్రాంతీయుడయ్యా... ఆయనకిచ్చే గౌరవం ఇదా... ఆలోచించండిసార్లూ...

**- సూళ్లూరుపేట**

## మల్లాం ఆలయంలో హుండీ లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

**చిట్టమూరు :** మల్లాంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ పాపారెడ్డి వెంకటసుబ్బారెడ్డి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈవో రమణారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఈ ఏడాది మార్చి 31 నుంచి స్వామికి భక్తులు సమర్పించగా వచ్చిన కానుకల్లో 1.79 లక్షలరూపాయలు హుండీ రాబడి వచ్చింది. వెండి నాగ పడగలు, బంగారు కానుకలు రావడంతో స్వామి వద్ద ఉన్న హుండీలో వేశారు. వచ్చిన నగదును బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఈ నెల 31 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగునున్న నేపథ్యంలో హుండీ లెక్కించినట్లు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు చిన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మూలం భానుపకాష్ శర్మ, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## చిరంజీవి జన్మదిన వేడుకలు

**నాయుడుపేట :** మాజీ కేంద్రమంత్రి, సినీహీరో చిరంజీవి జన్మదిన సందర్భంగా మంగళవారం నాయుడుపేట తుమ్మూరు ప్రభుత్వ పాఠశాలలో జనసేన సేవాదళ్ సభ్యులు కేక్ కట్ చేశారు. విద్యార్థులకు కేక్, మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమగు నోట్‌పుస్తకాలు, సామగ్రి అందజేశారు. పాఠశాలలోని విద్యుద్దీకరణ మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన సేవాదళ్ సభ్యులు శెట్టిపల్లి యశ్వాంత్‌కుమార్, కదూరు శరత్‌బాబు, లీలామోహన్, గౌస్, రహెమాన్, సాగర్, అంబు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జనసేన యూత్

## ఎద్దు బెదిరి... టైరుబండి బోల్తా


క్షతగాత్రుడు వెంకటరత్నం

**సూళ్లూరుపేట :** బండిపై దర్జాగా కూర్చొన్న యజమాని ఎద్దును విపరీతంగా కొట్టడంతో బెదిరిపోయింది. మెడపై కాడిని విసిరేసి వెనుతిరిగి బండిని కుమ్మేసింది. దీంతో ఆ టైరుబండి బోల్తాకొట్టింది. బండిపై ఉన్న యజమాని కిందపడిపోవడంతో బెదిరి ఉన్న ఎద్దు అతడిని తొక్కేసింది. సూళ్లూరుపేట గురుకుల పాఠశాల వద్ద మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. కాళంగినది నుంచి ఇసుకను టైరుబండిలో తరలించుకువెళ్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో బండి యజమాని మానేరికి చెందిన పిట్టి వెంకటరత్నం తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని ఓ ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో హుటాహుటిన నెల్లూరుకు తరలించారు.

# మద్యం షాపుల మధ్య రగడ

**● స్థలం సమస్యతో తలలు పట్టుకుంటున్న వ్యాపారులు ● ఒకేచోట వెలుస్తున్న దుకాణాలు**

**తడ :** సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో నూతనంగా ఏర్పాటైన మద్యంషాపుల మధ్య రగడ మొదలైంది. రెండు నెలలు గడుస్తున్నా... నేటికి మద్యంషాపులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసుకోలేని పరిస్థితిలో పడ్డారు మద్యం వ్యాపారులు. వివరాలలోకి వెళితే... సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారికి 500 మీటర్లు, సర్వీస్ రోడ్డుకు 200 మీటర్ల దూరంలో మద్యంషాపులు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశం ఇచ్చింది. ఈ క్రమంలో జూలై 1 నుంచి నూతనంగా ఏర్పాటు చేయాల్సిన మద్యం షాపులను ఆ నిబంధనలతోనే ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులను ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో తడ మండలానికి 14 మద్యం షాపులను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులను మంజూరు చేశారు. ఆ ప్రకారం షాపు ఏర్పాటు చేసే స్థలం నిబంధనలకు అనుకూలంగా ఉంటేనే ఎక్సైజ్‌శాఖ అధికారులు అనుమతులను మంజూరు చేస్తున్నారు. అయితే తడలో జాతీయ రహదారికి ఆనుకొని ఇంచుమించుగా గ్రామాలన్నీ ఉండటంతో వ్యాపారులు వాటికి సమీపంలోనే ఈ మద్యంషాపులను ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో షాపుల ఏర్పాటు కోసం స్థలాల సమస్య ఏర్పడింది. దీంతో వ్యాపారుల మధ్య మనస్పర్థలు ఏర్పడి పోటీతత్వం నెలకొంది. దీంతో ఒకరు పెట్టిన ప్రదేశంలో మరొకరు మద్యంషాపు నెలకొల్పాలని ఏర్పాటు చేసుకొంటుండటంతో గొడవలు పెద్దవయ్యాయి. దీంతో పెరియవట్టు, రామాపురం, కారూరు వంటి ప్రాంతాలలో ఈ సమస్యలు తలెత్తాయి. ఈప్రాంతాలలో షాపులు పెట్టవద్దంటూ ప్రజలు సైతం ధర్నాలకు దిగారు. రామాపురంలో అయితే రెండు షాపులు ఏర్పాటు చేసుకొంటున్నామని, మూడో షాపు అవసరం లేదంటూ ఏకంగా కలెక్టర్‌కు, ఎక్సైజ్‌శాఖ అధికారులకు కొందరు వినతిపత్రాలను సైతం సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో రెండు నెలలు గడుస్తున్నా.. నేటికి పూర్తిస్థాయిలో మద్యంషాపులను ఏర్పాటు చేసుకోలేక వ్యాపారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే తడ మండలంలో అంతా ఒక యూనిట్‌గా పరిగణిస్తున్నామని ప్రభుత్వం మంజూరుచేసిన 14 షాపులను ఎక్కడైనా నిబంధనల ప్రకారం ఎక్కడైనా పెట్టుకోవచ్చని అవసరమైతే ఒకే చోట 14 షాపులు సైతం పెట్టుకోవచ్చని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇలా మద్యంషాపుల ఏర్పాటులో వ్యాపారుల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో ఈ దఫా మద్యంషాపులు ఏర్పాటుపై రగడ జరుగుతుంది.

## వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

**నాయుడుపేటరూరల్ :** నాయుడుపేట జువ్వలపాళెం కట్టమీద వెలసి ఉన్న శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీభగవాన్ వెంకయ్యస్వామి ద్వితీయ ఆరాధన మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం విఘ్నేశ్వరస్వామిపూజ, జెండావిష్కరణ స్వామివారికి అభిషేకాలు, పుష్పాలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఆలయంలో చెంచయ్యస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జె. సుబ్రహ్మణ్యం, మద్దు నవీన్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

**నేటి కార్యక్రమాలు :** శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా బుధవారం కలశస్థాపన, ప్రత్యేక భజనలు, మధ్యాహ్నం అన్నదానం, అష్టోత్తర పూజలు నిర్వహించబడునని నిర్వాహకులు కోప్పోలు సుబ్రహ్మణ్యం తెలిపారు.


అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

## అగ్నిప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

**విడవలూరు:** అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పారిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని అగ్నిమాపక జిల్లా అధికారి జ్ఞానసుందరం అన్నారు. విడవలూరులోని డిగ్రీకళాశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా ప్రాథమిక చర్యలు తీసుకోవాలన్నారు. నిప్పులు చెలరేగిన వెంటనే ఇంట్లోని కరెంటును ఆపటం, గ్యాస్ బండను బయటకు తీసుకురావడం, మంటల్లో చిక్కుకున్న వారిని త్వరితగతిన రక్షించడం చేయలన్నారు. తదుపరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నిర్లక్ష్యంగా ఉంటే మరింత నష్టం వాటిల్లే అవకాలు ఉన్నాయన్నారు.

## సేవా కార్యక్రమాలకు ఊతం

**వెంకటాచలం :** సేవా కార్యక్రమాలకు ఊతమిస్తామని జడ్పీటీసీ సభ్యుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. ఉషా కార్తిక్ బాబు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వారు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని కార్యక్రమాలను నిర్వహించలేదన్నారు. అందువల్ల స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా అభివృద్ధి పనుల్లోనూ, సేవా రంగాల్లోనూ సహకరించాలన్నారు. శిబిరంలో విద్యార్థులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవీఎస్ నాయుడు, ఎన్ వేణుగోపాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురంలో వైద్యశిబిరం

**తోటపల్లిగూడూరు :** మండలంలోని అనంతపురం గ్రామంలో ఎన్‌సీసీ, సిమ్‌క్రాప్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ వైద్యులు గ్రామంలోని ప్రజలకు సాధారణ చికిత్సలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిమ్‌క్రాప్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫసల్ బీమాపై ప్రచారం చేయాలి

**మనుబోలు:** అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రచారం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు బోలా శ్రీనువాసులు కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం పదాధికారుల సమావేశంలో నాయకులు కనుపూరు కాలువలో ఆమంచర్ల నుంచి బండిపల్లి వరకు పూడిక తీయాలని, ఫసల్ బీమాను నిర్లక్ష్యం చేస్తున్నారని, ముద్ర రుణాలను పేదలకు పారదర్శకంగా అధికారులు మంజూరు చేయాలని తదితర అంశాలపై తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్, కామంచి వెంకయ్య, సీతారామిరెడ్డి, శ్రీనివాస్, వీరప్రతాప్ పాల్గొన్నారు.

## రేపు ప్రయివేట్ విద్యాసంస్థల బంద్

**పొదలకూరు:** అసాంఘిక శక్తులను ఎదుర్కొనేందుకు విద్యా సంస్థలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని కోరుతూ ఈ నెల 24వ తేదీన చేపట్టదలచిన రాష్ట్ర బంద్‌కు తల్లిదండ్రులు సహకరించాలని ప్రయివేట్ విద్యాసంస్థల నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పిల్లల మధ్య జరిగే చిన్న చిన్న ఘటనలు సాకుగా తీసుకొని కొన్ని సంఘాలు స్వప్రయోజనాల కోసం విద్యాసంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నారు. ఇటీవల కర్నూలు కట్టమంచి పాఠశాలలో జరిగిన ఘటనలో విద్యార్థి సంఘాల దౌర్జన్యం పరాకాష్టకు చేరిందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో దౌర్జన్యంగా బంద్ చేయించడం, బలవంతపు వసూళ్లకు పాల్పడడం, కక్షసాధింపులో భాగంగా పాఠశాలల ఆస్తులకు నష్టం కలిగించే చర్యలకు విద్యార్థి సంఘాలు పాల్పడుతున్నాయన్నారు. ఇలాంటి అసాంఘిక ఘటనలను ఎదుర్కొనేందుకు చేపట్టిన ప్రయివేట్ విద్యాసంస్థల బంద్‌కు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

## పరిశుభ్రతే స్వచ్ఛ భారత్ లక్ష్యం

**మనుబోలు :** గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్నదే స్వచ్ఛభారత్ లక్ష్యమని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కాగితాలపూరు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ గ్రామంలో నాలుగురోజులుగా జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్) శిబిరం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వీధులన్నింటిని శుభ్ర పరిచారు. ఈ కార్యక్రమంలో శిబిరం పీవో వినోద్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల ఇబ్బందులు

**మనుబోలు :** స్థానిక ఎస్‌బీఐ శాఖ సిబ్బంది సమ్మెతో మంగళవారం మూతపడింది. ఖాతాదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాంకు ఉద్యోగులు వారి డిమాండ్లు నెరవేర్చాలని దేశవ్యాప్త సమ్మెతో మనుబోలు శాఖ మూసివేశారు. వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు రుణాలకోసం, నగదు ఉపసంహరణ కోసం పలువురు బ్యాంకుకు వచ్చి వెనుదిరగడం కనిపించింది.

# రేపు రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

**మనుబోలు :** 2017-18 ఆర్థిక సంవత్సరానికి కన్వెర్జెన్సీ యాక్షన్ ప్లాన్ పరిధిలో రాయితీ రుణాలకు ఈనెల 24న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో ముజిబున్నీసా మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో రుణం కోసం దరఖాస్తు చేసుకుని రానివారి దరఖాస్తులను ఈ ఇంటర్వ్యూలలో పరిగణనలోకి తీసుకుంటారన్నారు. ఇప్పటివరకు రాయితీ రుణాలకోసం ఎస్సీ కార్పొరేషన్ కింద 672 మంది, ఎస్టీ కార్పొరేషన్ కింద 138మంది, కాపు కార్పొరేషన్ పరిధిలో 154 మంది, బీసీ కార్పొరేషన్ కింద 352 మంది, రజక సొసైటీ తరపున 21 మంది, వడ్డెర సొసైటీ నుంచి 116 మంది, గీత కార్మిక సొసైటీ నుంచి 57 మంది, మైనార్టీ సొసైటీ నుంచి 61మంది, క్రిస్టియన్ మైనార్టీ నుంచి ఒక్కరు దరకాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మండలానికి ఎస్సీ కార్పొరేషన్‌కు 83 యూనిట్లు, ఎస్టీ కార్పొరేషన్‌కు 16, కాపు కార్పొరేషన్‌కు 47, బీసీ కార్పొరేషన్‌కు 30, వడ్డెర సొసైటీకి 6, గీతకార్మిక సొసైటీకి 25, మైనార్టీల సొసైటీకి 10, క్రిస్టియన్ మైనార్టీకి ఒక్క యూనిట్లు మంజూరు చేసిందన్నారు. రాయితీ రుణాలకోసం మండలంలో 1572 మంది దరఖాస్తులు చేసుకోగా 218 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఓబీఎంఎస్ ద్వారా వచ్చిన రసీదు, కుల, ఆదాయ ధ్రువీకరణలు వెంట తీసుకురావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వివరించారు.

**పొదలకూరు:** మండలంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో మండల స్క్రీనింగ్ కమిటీ, బ్యాంకు మేనేజర్లు, మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవోలు పాల్గొంటారన్నారు. కావున మండలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం , క్రిష్టియన్ మైనారిటీ, కాపు కార్పొరేషన్, కుమ్మరి, వడ్డెర, బత్రాజు, గీత సొసైటీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులు తప్పక హాజరుకావాలని కోరారు.

**తోటపల్లిగూడూరు :** మండలంలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు అభ్యర్థులకు లబ్ధిదారుల ఎంపిక 24న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో హేమలత తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ కుల, ఆదాయ, నివాస, విద్యార్హతల పత్రాల ధ్రువీకరణలు ఇంటర్వ్యూ చూపించాల్సి ఉంటుందన్నారు.

## భూసార పరిరక్షణ రైతు బాధ్యత

**వెంకటాచలం:** భూసార పరిరక్షణ రైతు బాధ్యతని మండల వ్యవసాయాధికారి చక్రవర్తి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఈదగాలి, శ్రీకాంత్ కాలనీల్లో నిర్వహించారు. చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రసాయనిక ఎరువులను వాడడం, పంట మార్పిడి లేకపోవడం తదితర కారణాలతో సారం తగ్గిపోయి భూమి నిస్సారమవుతోందన్నారు. తద్వారా తెగుళ్ల విజృంభించి రైతుకు ఆర్థికంగా కుంగదీస్తున్నాయన్నారు. రైతులు ఇకనైనా భూసారాన్ని పరిరక్షించుకోవాలన్నారు. పంట మార్పిడి చేయడం, సేంద్రీయ ఎరువు వాడడం, పచ్చి రొట్ట ఎరువులు సాగు చేయడం తదితర చర్యలకు శ్రీకారం చుట్టాలన్నారు. భూమిలో ఏర్పడిన ధాతు లోపాన్ని సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

## విజ్ఞాన పర్యటనకు పొదలకూరు విద్యార్థినులు


విద్యార్థిని నందిని

**పొదలకూరు:** రాష్ట్ర స్థాయి విజ్ఞాన పర్యటనకు స్థానిక చైతన్య విద్యాలయం విద్యార్థి ఓ నందిని, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని రావుల జ్యోతి ఎంపికయ్యారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీవీ సురేష్, కేవీఎస్ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 17వ తేదీన జిల్లా స్థాయిలో ఆంధ్రప్రదేశ్ విభజనానంతరము అనే అంశంపై నెల్లూరులో జరిగిన వ్యాసరచన పోటీలో చైతన్య విద్యార్థిని నందిని మొదటి స్థానం, అలాగే ఆంధ్రప్రదేశ్ విభజన లాభాలు, నష్టాలు అనే అంశంపై జరిగిన డిబేట్‌లో పొదలకూరు బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆర్ జ్యోతి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులకు విద్యాశాఖ వారు ఈ నెల 23, 24వ తేదీలలో ఏపీ రాజధాని అమరావతిలో అన్ని వసతులతో కూడిన విజ్ఞాన పర్యటన ఏర్పాటు చేశారు. ఈ విద్యార్థినులు మంగళవారం బయలుదేరి వెళ్లారు.

## రైతులు వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి పెట్టాలి

**పొదలకూరు:** రైతులు వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి యూ గీతాకుమారి పేర్కొన్నారు. మండలంలోని చాటగొట్ల, మరుపూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు రాయితీపై ట్రాక్టర్ పనిముట్లు, రొటోవేటర్, స్ప్రేయర్లు అందజేస్తోందన్నారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ విధానాలపై నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన రైతులు స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 8 నుంచి 12వ తేదీ వరకు అనంతపురం జిల్లాలో జరిగే కార్యక్రమంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక రైతు చొప్పున శిక్షణకు వెళ్లి ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు తెలుసుకొని గ్రామ స్థాయిలో రైతులకు వివరించాలన్నా. ఈ కార్యక్రమంలో మరుపూరు సర్పంచు కే దయాకరయ్య, ఎంపీటీసీ కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి ఆర్ ఏడుకొండల నాయక్, ఎంపీఈవో గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గీతాకుమారి

## వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

**పొదలకూరు:** విద్యార్థులు వృత్తి విద్యలో కూడా నైపుణ్యం సాధించాలని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రఫీ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు విద్యార్థులకు వృత్తి విద్యపై అందించిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వృత్తి విద్య శిక్షణకు ప్రభుత్వం 30 ల్యాప్‌టాప్‌లు, 30 ట్యాబ్‌లు అందించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు క్రాంతికుమార్, భార్గవి, కాకతీయ కళాశాలల డైరెక్టర్ ఎస్ శివశంకర్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజనుల శ్మశానాన్ని అభివృద్ధి చేయిస్తాం


శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

**మనుబోలు :** స్థానిక చంద్రమౌళినగర్ గిరిజన కాలనీ శ్మశాన వాటికను మంత్రి సోమిరెడ్డి కృషితో అభివృద్ధి చేయిస్తామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సూరపనేని కిషోర్‌నాయుడు అన్నారు. మంగళవారం గిరిజన శ్మశాన వాటికలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సూరపనేని మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యుడు తిరువీధి రమేష్ 2017-1813వ ఆర్థిక సంఘం మిగుల నిధుల నుంచి 65 వేలు బోరు వేసేందుకు మంజూరు చేయించారన్నారు. శ్మశాన వాటిక ప్రహరీని, కాలనీ నుంచి శ్మశానానికి రహదారిని మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంగర విజయభాస్కర్ రెడ్డి, గిద్దంటి రమణయ్య, రాజాగౌడ్, సాని వెంకటరమణయ్య, కిరణ్‌కుమార్, ముంగర దశరథరామిరెడ్డి, చెరెడ్డి కోదండరామిరెడ్డి, పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాల వినియోగంపై కళాజాతా

**వెంకటాచలం :** వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించడానికి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, రాపో స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మంగళవారం వెంకటాచలంలో కళాజాతా నిర్వహించారు. సర్వేపల్లి రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన ఈ జాతాలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నీటిలో వేసినపుడు కలిగే దుష్పరిణామాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో భూగర్భ జలం విషతుల్యమవుతుందన్నారు. మట్టితో చేసిన విగ్రహాలనే ఇళ్లల్లో పూజించాలన్నారు. కార్యక్రమంలో రాపో సంస్థ సభ్యులు రమణ, మురళి, శివకుమార్, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కళాజాతాలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

**పొదలకూరు:** మండలంలోని తోడేరు జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులను మంగళవారం గ్రామస్థులు సన్మానించారు. తోడేరు ఎంపీటీసీ ఏనుగు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడెనిమిదేళ్లుగా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన పది మంది ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీ కావడం బాధకలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు శేఖర్‌రెడ్డి, అట్ల రవీంద్ర, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పంచాయతీ రికార్డుల పరిశీలన

**సైదాపురం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ రికార్డులను ఆడిటర్ బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 22పంచా యతీలకు రికార్డులను ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు రికార్డులను అప్పగించి ఆడిట్‌కు సహకరించాలని కోరారు.

### ఘనంగా ఎన్‌ఎంయూ
## గోల్డన్ జూబ్లీ సంబరాలు



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

**వెంకటగిరి:** నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం డిపో ఎదుట గోల్డన్ జూబ్లీ సంబరాలను యూనియన్ నాయకులు, కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నాయకులు మాట్లాడుతూ ఎన్‌ఎంయూ ఆవిర్భవం నుంచి కార్మిక సమస్యల సాధన కోసం చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కే. రమణరాజు, జోనల్ కార్యదర్శి ఎంవీ రావు, రీజినల్ కార్యదర్శి కే. లుక్సన్, రీజినల్ అధ్యక్షుడు పీఎస్‌రెడ్డి, డిపో కార్యదర్శి కేవీ. రత్నం తదితరులు ఉన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**వెంకటగిరి:** పట్టణంలో మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరి అంత్యక్రియలకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. 1వ వార్డు బంగారుపేటకు చెందిన కే. అమ్మణి, 25వ వార్డు కాంపాళెంకు చెందిన ఎం పోలయ్య మృతి చెందడంతో వారి మృత దేహాలకు నివాళులర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అత్యక్రియల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగినేని భవాని శంకర్, సాయి తేజా, మేరిగ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల ధర్నా




మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

**వెంకటగిరి:** అపరిష్కృతంగా ఉన్న కార్మిక సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సామాజిక హక్కుల వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికులు కడుపు కొట్టే రీతిలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 279ని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. కార్మిక శ్రమ దోపిడీ చేసే దళారి వ్యవస్థను పెంచి పోషించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనతా ఆసుపత్రి డాక్టర్ మారం సుధాకర్, నాయకులు శివకుమార్, కోటేశ్వరావు, సుబ్బరత్నమ్మ, సుబ్బమ్మ, సుబ్రమణ్యం, సుబ్బయ్య, కాటయ్య, గిరి, శ్రీహరి, ఆదిశేషయ్య తదితరులు ఉన్నారు.

## స్మగ్లింగ్‌పై సమాచారం అందించండి

**రాపూరు:** ఎర్రచందనం స్మగ్లింగ్‌పై సమాచారం అందించి సహకరించాలని తిరుపతి టాస్క్‌ఫోర్సు అధికారి రామకృష్ణ కోరారు. ఓబులాయపల్లి గ్రామంలో మంగళవారం ఎర్రచందనం నీకు వందనమంటూ రోడ్‌షో, లఘుచిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఎర్రచందనం విలువైందని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, రమేష్, పాపారావు, సుబ్రమణ్యం, స్తానిక అటవీ అధికారులు ప్రసాద్, రాంబాబు, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా సాగుతున్న రోడ్ల నిర్మాణం

**రాపూరు:** రాపూరు దళితవాడలో అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు జోరుగా చేపడుతు న్నారు. రూ.30లక్షల వ్యయంతో మేజర్ పంచాయతీ పరిధిలోని కాలనీల్లో రోడ్లకు నిధులు మంజూరైనట్లు టీడీపీ నాయకుడు తుమ్మలపల్లి మధుసూదనరావు తెలి పారు. దళితవాడలో నిర్మాణంలో ఉన్న పనులను మం గళవారం ఆయన పరిశీలించారు. రోడ్లను నాణ్యతగా చేపడుతున్నట్లు వివరించారు. స్థానిక తుమ్మలడొడ్డి, కొత్తపేటల్లో సిమెంటు రోడ్లుకు నిధులు మంజూరైనట్లు మధుసూదనరావు తెలిపారు.



దళితవాడలో నిర్మాణంలో ఉన్న సిమెంటు రోడ్డు

## రిజర్వాయరు నిర్మాణంతో భూములు కోల్పోతున్నాం

**డక్కిలి :** ఆల్తూరుపాడు వద్ద రిజర్వాయరు నిర్మాణంతో భూములు కోల్పోతున్నామని, తమకు తగిన పరిష్కారం చూపాలంటూ ఆల్తూరుపాడు గ్రామానికి చెందిన రైతులు మంగళవారం తహసీల్దారు మునీర్ బాషాను కోరారు. రిజర్వాయరు నిర్మాణంతో ఆల్తూరుపాడు, హరిజనవాడ, ఆల్తూరుపాడు వెల్లంపల్లి తదితర గ్రామాల్లో సుమారు 150 ఎకరాలు భూములను తాము కోల్పోతున్నామని రైతులు తెలిపారు. వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు ఉన్న భూములు ప్రభుత్వం లాగేసుకుంటే తాము ఎలా బతకాలంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న తమ భూములకు ఎలాంటి పట్టాలు ఇవ్వక పోగా కనీసం సాగు చేసుకోవడానికి కూడా లేకుండ పోయిందని రైతులు తెలిపారు. తమ భూములపై నష్టపరిహారం అందేలా చూడాలని తహసీల్దారును కోరారు. రిజర్వాయరు కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దారు వారికి హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌ను కలిసిన ఆల్తూరుపాడు రైతులు

### నోటు పుస్తకాల
## పంపిణీ

**గూడూరు(రూరల్):** మండల పరిధిలోని కందలి, తుంగపాళెం, తిరువెంగళాయపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంగళవారం తిప్పవరప్పాడు గ్రామా నికి చెందిన బత్తల సుబ్బారెడ్డి దాతృత్వంతో రూ.50 వేలు విలువ చేసే నోటు పుస్తకాలను లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ రూ.5 లక్షలు విలువ చేసే విద్యాసామాగ్రిని అందజేస్తున్నామన్నారు. కార్యక్ర మంలో బత్తల సుబ్బారెడ్డి, క్లబ్ కార్యదర్శి జీ చంద్రశేఖర్, కోశాధికారి కడివేటి చంద్రశేఖర్, హెచ్ఎంలు భ్రమరాంబ, సునీత తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చిరంజీవి
## జన్మదిన వేడుకలు



చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న చిరంజీవి యువసేన

**వెంకటగిరి:** ప్రముఖ సినీ నటుడు, మెగస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం చిరంజీవి యువసేన ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపకున్నారు. ఈ సందర్భంగా కాశీపేట కూడల్లోని బస్ షెల్టర్‌లో కేక్ కట్ చేశారు. అదేవిధంగా స్థానిక ఆం జనేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో యువసేన అధ్యక్షుడు ధనుంజయ, అభిమానులు మధు, సుబ్బు, రఫీ, ప్రకాష్, కాళేంద్ర ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

## రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

**బాలాయపల్లి:** స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం ఎస్సీ , ఎస్టీ, బీసీ మైనార్టీ కాపు కేటగిరీలలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బంగారుపేట, వెంకటగిరి ఏపీజీపీ బ్యాంకుల పరిధిలోని గ్రామాల్లో 375 మంది దరఖాస్తు చేసుకోగా, 225 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు సుబ్బరామయ్య, శ్రీహరి, జన్మభూమికమిటీ సభ్యులు రాయి మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు

## విద్యార్థులకు పండ్లు పంపిణీ



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా నిర్వాహకులు

**వెంకటగిరి:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సంస్థ నిర్వాహకులు స్థానిక బాలలసదన్‌లోని అనాథ బాలికలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, ఢిల్లిబాబు, డాక్టర్ రామాంజనేయులు, నాగరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గణేష్ విగ్రహాల ఏర్పాటుకు
## అనుమతి తప్పనిసరి

- ఎస్ఐ మరిదినాయుడు

**డక్కిలి :** గణేష్ ఉత్సావాలను పురస్కరించుకుని గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాలంటే ముందుస్తుగా పోలీసుల అను మతి తీసుకోవాలని ఎస్ఐ మరిదినాయుడు అన్నారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా ఎక్కడబడితే అక్కడ విగ్రహాలు ఏర్పాటుచేసి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని చెప్పారు. విగ్రహాల వద్ద మైకుల ఏర్పాటుకు ముందుగా గూడూరు డీఎస్పీ నుంచి అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా మైకులు ఏర్పాటు చేస్తే వాటిని తొలగించి నిర్వాహకులపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాల్లో కమిటీలుగా ఏర్పడి కార్యక్రమం బాధ్యతలను స్వీకరించాలని తెలిపారు. నిమజ్జన సమయాల్లో ఏలాంటి గొడవలు జరగకుండా ముందుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

### పేదల భూములు పేదలకు
## అందించాలి

**చిల్లకూరు:** మండలంలోని పలు గ్రామాల్లో గతంలో పేద లకు అందించిన సీజేఎఫ్ఎస్ భూములను వారికే ఇవ్వాలంటూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మందా కృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మందా కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

### సినిమా గైడ్

**వెంకటగిరి**

త్రిభువని: లై
జ్యోతిమహల్: నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంబ : జయ జానకి నాయక

**రాపూరు**

శ్రీనివాసమహల్: నేనే రాజు నేనే మంత్రి
వేంకటేశ్వరమహల్: జయ జానకి నాయక